13-10Pg1FS.qxd:13-10Pg1FS.qxd 1/1/02 7:35 AM Page 1


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

13-10-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 254 పేజీలు: 16 వెల: 6.50


## ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

రాష్ట్రపతి కీలక నియామకాలు

2







# మేయర్, చైర్‌పర్సన్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు

**17 కార్పొరేషన్లలో 5 బిసిలకు, 106 పురపాలికల్లో 36 స్థానాలు: ఉత్తర్వులు జారీ**

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవుల రిజర్వేషన్లు ఖరారు చేస్తూ అధికారులు జాబితాను రిలీజ్ చేశారు. ఈ కేటాయింపులో బిసి వర్గాలకు పెద్దపీట వేయడంతో పాటు మహిళలకు ఏకంగా 50 స్థానాలు కేటాయించి అగ్రతాంబూలం అందించింది. అన్ని కేటగిరీల్లో కలపి మహిళలకు మొత్తం 50 చైర్మన్ స్థానాలు దక్కాయి. జనరల్ కేటగిరీ మహిళలకు 27 స్థానాలు కేటాయించగా, బిసి, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో మహిళలకు కలిపి మరో 23 స్థానాలు రిజర్వ్ అయ్యాయి. అలాగే వెనుకబడిన తరగతులకు అంటే బిసిలకు అత్యధికంగా 36 స్థానాలు దక్కాయి. అందులో బిసి మహిళలకు 14, బిసి జనరల్ 22 స్థానాలు కేటాయించబడ్డాయి. ఎస్‌సి వర్గానికి 14 స్థానాలు (మహిళలకు 7, జనరల్ 7), ఎస్‌టి వర్గానికి మూడు స్థానాలు (మహిళలకు 1, జనరల్ 2) కేటాయించారు. అదేవిధంగా ఎలాంటి రిజర్వేషన్ లేని ఓపెన్ కేటగిరీ కింద 26 మున్సిపాలిటీలు ఉన్నాయి. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్ స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ స్థానాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. బిసిలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి 1, జనరల్ మహిళలకు 5, అన్ రిజర్వ్‌డ్ కోసం 4 స్థానాలు కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.
ఎస్టీ 1: మంగళగిరి తాడేపల్లి, ఎస్సీ 2: రాజమహేంద్రవరం, కర్నూలు, బిసి మహిళ 2: మచిలీపట్నం, కాకినాడ బిసి జనరల్ 3: ఏలూరు, అనంతపురం, చిత్తూరు జనరల్ మహిళ 5: విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖ అన్‌రిజర్వ్‌డ్ 4: తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

మరోవైపు రాష్ట్రంలోని 106 మున్సిపాలిటీలకు కూడా రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
వీటిలో ఎస్సీ జనరల్ 2, ఎస్టీ మహిళలకు 1, ఎస్సీ జనరల్‌కు 7, ఎస్సీ మహిళలకు 7, బిసి జనరల్‌కు 18, బిసి మహిళలకు 18, జనరల్ అభ్యర్థులకు 26, జనరల్ మహిళలకు 27 స్థానాలు కేటాయించినట్లు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది. **సామాజిక వర్గాలవారీగా కేటాయించిన మున్సిపాలిటీల పూర్తి వివరాలు** >>2

**జడ్‌పిటిసి, ఎంపిటిసి రిజర్వేషన్లు ఖరారు** 2
7 జడ్‌పి చైర్‌పర్సన్ల స్థానాలు బిసిలకు కేటాయింపు

**స్థానిక వ్యూహాంపై కూటమి అగ్రనేతల భేటీ**
సిఎం చంద్రబాబు నివాసంలో కీలక చర్చలు

# సర్‌ను వెంటనే ఆపండి



సోమవారం న్యూఢిల్లీలో సర్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఇండియా కూటమి నేతలు

సుప్రీంలో 'ఇండి' కూటమి పిటిషన్
నేడు విచారణకు వచ్చే అవకాశం
ర్యాలీని అడ్డుకొన్న పోలీసులు..
సమయం మించకుండా పోల్ టీమ్‌తో పిటిషన్ సమర్పించిన రాహుల్
వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ సిఎంలు, పిసిసి చీఫ్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలతో భారీ ర్యాలీ
పోలీసులు నిరోధించినా ఆగని ఆందోళన
అపూర్వంగా మారండని సిఇసికి రాహుల్ సూచన

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ఎన్నికల ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓటర్ల పేర్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్నారని, ఎన్నికల జాబితాల సవరణలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై విచారణకు సుప్రీంకోర్టు సిద్ధమైంది. రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారమే పరిశీలించి, అందులోని లోపాలు ఉంటే సరిచేసి మంగళవారం విచారణకు జాబితా చేయాలని కోర్టు రిజిస్ట్రీని ఆదేశించినట్లు సమాచారం. కేంద్ర ఎన్నికల ప్రధానకమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌తో పాటు ఇద్దరు కమిషనర్లను ఈ పిటిషన్‌లో పార్టీలుగా చేసారు. దాదాపుగా ఇండియా కూటమి నేతలు అందరూ కూడా ఈ ర్యాలీలో పాల్గొని సుప్రీం కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధం అయ్యారు. సాయంత్రంలోపు దాఖలుచేసేందుకు వీలుగా రాహుల్‌గాంధీ తన లీగల్‌టీమ్‌ను ముందు పంపించి పిటిషన్ దాఖలుచేయించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలుకు ర్యాలీగా వెళుతున్న ఇండియా కూటమి బృందాన్ని భగవాన్‌పూర్‌వద్ద పోలీసులు అడ్డుకోవడంతో సమయం మించిపోతోందని భావించినేతలు రాహుల్ న్యాయవాదబృందంతో పిటిషన్ దాఖలుచేయించారు. ఓటర్ల పేర్ల తొలగింపులు, జాబితాల తయారీలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న అవకతవకలపై కాంగ్రెస్ న్యాయ బృందం ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ పిటిషన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ ప్రసాద్ యాదవ్ తదితర విపక్ష నాయకులు కూడా భాగస్వాములుగా ఉన్నారు. శివసేన నేత సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నేత మహువా మాఝీ, ఎన్సీపీ (శరదచంద్ర పవార్) నేత సుప్రియా సూలే, ఐయూఎంఎల్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ తదితరులు కూడా పిటిషన్‌లో ఉన్నారు.

**నేడే విచారణకు అవకాశం:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించనున్నట్లు కాంగ్రెస్‌నేతలు వెల్లడించారు. సోమవారం సాయంత్రంలోగా పిటిషన్ దాఖలైతే మరుసటి రోజు విచారణకు తీసుకుంటామని గతంలో ప్రధాన న్యాయమూర్తి సూచించినట్లు సమాచారం. అయితే, పిటిషన్‌పై విచారణ జరగడం, అందులో చేసిన ఆరోపణలు నిజమని కోర్టు నిర్ధారించడం రెండూ వేర్వేరు విషయాలు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా, ఓటు >>2



## అర్థశాస్త్రంలో ఇద్దరికి నోబెల్

స్థూల ఆర్థిక స్థిరత్వంపై రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ పరిశోధనలకు గుర్తింపు

**స్టాక్‌హోమ్, అక్టోబరు 12:** ఇతర సాంప్రదాయ నోబెల్ బహుమతుల మాదిరిగా 2026 సంవత్సరానికి ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అమెరికాకు చెందిన ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ సంయుక్తంగా గెలుచుకున్నారు. ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఉపయోగపడే సిద్ధాంతపరమైన పరిశోధనలకు గుర్తింపుగా వీరికి ఈ పురస్కారం ప్రకటించారు. అక్టోబర్ 12న స్టాక్‌హోమ్‌లో రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ ప్రకటన చేసింది. ఈ యేడాది ఆర్థిక శాస్త్ర పురస్కారానికి >>2

# ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా తిరుపతి



రూ.3,222 కోట్లతో సమగ్రాభివృద్ధికి శ్రీకారం
అలిపిరి వద్ద యాత్రికుల టౌన్‌షిప్‌కు శంకుస్థాపన
మొదలైన మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులు
టిటిడి ఉద్యోగుల నివాస లేఔట్ పనుల ప్రారంభం
అభివృద్ధి పనులకు వర్చువల్‌గా సిఎం శంకుస్థాపన
చంద్రబాబుచే 'వెంకటాద్రి యాప్ ఆవిష్కరణ

**అమరావతి, తిరుపతి, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల- తిరుపతి ప్రాంతాన్ని మరింత అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా చేపట్టిన పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, టిటిడి పరిధిలో రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. తిరుమలకు వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించేందుకు రూ.2,750 కోట్లతో సమీకృత టౌన్‌షిప్ నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేశారు. తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సురక్షితమైన, ఆధ్యాత్మిక అనుభూతిని అందించేలా తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఎస్వీ జూపార్కు రహదారి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో వసతి, అన్నప్రసాదం, విశ్రాంతి, రవాణా, పార్కింగ్, వైద్య సేవలు, డిజిటల్ సమాచార కేంద్రాలు సహా భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురానున్నారు. భక్తుల వసతి కోసం నాలుగు బ్లాకుల్లో పది అంతస్తుల చొప్పున మొత్తం 2,700 గదులను నిర్మించనున్నారు. వీటి >>2

## 11మంది ఐఎఎస్‌లకు స్థానచలనం

ఎపి భవన్ ఓఎస్‌డిగా సౌరభ్ గౌర్
గిరిజనశాఖ కార్యదర్శిగా మురళీధర్‌రెడ్డి
పర్యాటకశాఖ కార్యదర్శిగా ఆమ్రపాలి
ప్రభుత్వం ఉత్తర్వు.. తక్షణం అమల్లోకి

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ >>2

# పెట్టుబడులకు, ప్రగతికి ఎపి స్వర్గధామం

పెట్టుబడిదారులు రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేస్తారనేది మా ప్రాధాన్యం
సింగపూర్ తరహాలో సమష్టి శ్రమతో విజయం సాధ్యం
పరిశ్రమలు మొదటి రోజు నుంచే పర్యావరణం మీద దృష్టిపెట్టాలి.
అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో కూటమి ప్రభుత్వం చొరవ
కాకినాడ సిఐఐ ప్రాంతీయ సదస్సులో డి.సిఎం పవన్ 2






# పెద్దశేషునిపై మలయప్పస్వామి దర్శనం



**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సత్యయుగంలో వైకుంఠంలో శ్రీమహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణునిగా.. కలియుగంలో శ్రీనివాసుడుగా పూజలందుకుంటున్నాడు. ఏడుకొండల్లో మొదలైన శ్రీవేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు సోమవారం రాత్రి మలయప్పస్వామి శ్రీదేవిభూదేవిలతో కలసి ఏడుతలల పెద్దశేషునిపై భక్తులకు దర్శనమిచ్చాడు. రాత్రి 7 గంటలకు వాహనమండపం వద్ద పెద్దశేష వాహనంపై వేంచేపుచేసిన మలయప్ప ప్రత్యేక పూజలందుకున్న అక్కడ నుండి ఊరేగుతూ భక్తులను కటాక్షించాడు. వాహనం ముందు గజరాజులు, అశ్వాలు ఠీవిగా నడుస్తుం డగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు. మంగళవాయిద్యాలు, డ్రమ్స్ వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనల నడుమ స్వామివారి వాహనసేవ అత్యంత రమణీయంగా జరిగింది. ఈ వాహనం పంచభూతా త్మకమైన విశ్వానికి, అందునివసించే జీవునికి వరా లిస్తుంది. పెద్దశేషవాహనాన్ని దర్శిస్తే దుష్టశక్తుల వల్ల కలిగే దుష్ఫలితాలు తొలగి భక్తులకు కుండలినీయోగ సిద్ధించి సుఖ శాంతులతో ఆనందజీవులవుతారని విశ్వాసం.

ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర దంపతులు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, ఎస్‌విబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ, బోర్డు సభ్యులు శాంతారామ్, జ్యోతుల నెహ్రూ, ఆలయ డిప్యూటీ ఇఒ భయ్యాల భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు పాల్గొన్నారు.

# ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ



**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో వివిధ రాష్ట్రాలు, విదేశాలకు చెందిన కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో భక్తులను అలరిస్తున్నారని టిటిడి ధార్మిక ప్రాజెక్టుల అధికారులు తెలిపారు. నాలుగు మాడ వీధుల్లో వాహన సేవల సందర్భంగా ప్రత్యక్షంగా ప్రదర్శనలను వీక్షిస్తున్న భక్తులతోపాటు, ప్రపంచ వ్యాప్తంగా భక్తులు టివి, డిజిటల్ మాధ్యమాల ద్వారా ఈ కార్యక్రమాలను వీక్షిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం తిరుమలలోని రాంభగీచా2 మీడియా సెంటర్‌లో టిటిడి ధార్మిక ప్రాజెక్టుల అధికారులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యదర్శి, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డా. మేడసాని మోహన్ మాట్లాడుతూ, వార్షిక బ్రహ్మోత్సవాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల కళాబృందాలతోపాటు సింగపూర్, జర్మనీకి చెందిన ప్రవాస భారతీయ కళాకారులు కూడా తమ ప్రతిభను చాటారని తెలిపారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఖతార్, దుబాయ్, ఆస్ట్రేలియా నుంచి వచ్చే కళాకారులు కూడా తమ ప్రదర్శనలతో భక్తులను అలరించనున్నారని చెప్పారు. టిటిడి దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డా. పి.ఆర్. ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ, కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా శ్రీ వేంకటేశ్వరస్వామి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటుతూ, బ్రహ్మోత్సవాల్లో కళాసేవ అందిస్తున్నారని తెలి పారు. ఈ ప్రాజెక్టు ఆధ్వర్యంలో 39 బృందాలకు చెందిన సుమారు 1,000 మంది కళాకారులు వాహన సేవల సమ యంలో ప్రదర్శనలు ఇవ్వనున్నారని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డా. ఉమా ముద్దుబాల మాట్లాడుతూ, ఈ కళాశాల భారతీయ సాంప్రదాయ కళల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు.

కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ గాత్ర సంగీతం, వాద్య సంగీతం, హరికథ తదితర కళారంగాల్లో ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని తెలిపారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో 59 బృందాల్లోని సుమారు 1,500 మంది తమ కళాప్రదర్శనలతో భక్తులను అలరించనున్నారని వివరించారు. ఈ సమావేశంలో టిటిడి పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

# దసరా వేళ ఎపిఎస్ ఆర్‌టిసి 5,261 స్పెషల్ బస్సులు

- తిరుమల శ్రీవారి బహ్మోత్సవాలకు ప్రత్యేక సర్వీసులు



**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. పండుగ సందర్భంగా 5,261 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచేలా ఎపిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం ప్లాన్ చేసింది. దసరా పండగకు, తిరుమల శ్రీవారి బహ్మోత్సవాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు సంస్థ సంయుక్త సంచాలకులు శివప్రసాద్ చెప్పారు. దసరా పండగ, అలాగే సెలవుల తర్వాత 5,261 బస్సులు నడుపుతున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు హైదరాబాద్‌కు 1,066, విజయవాడకు 1,313, బెంగళూరు 398, విశాఖపట్నం 574 రాజమహేంద్రవరం 335, తిరుపతి 143, చెన్నై 121 బస్సులు సర్వీసులు తిరుగుతాయని ప్రకటించారు. రాష్ట్రంలో దసరా సీజన్ మొదలైంది. ఈనెల 20న దసరా పండగ ఉంటుంది. అందులో భాగంగా ఎపిఎస్ ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడుపుతోందని శివప్రసాద్ వివరించారు. ముఖ్యంగా ప్రముఖ పుణ్య క్షేత్రాలకు, దగ్గరలోని హైదరాబాద్, బెంగళూరులకు ఈ బస్సులు నడుస్తాయి. రాష్ట్రంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని 10 రోజుల పాటు దాదాపు 5,261 ప్రత్యేక బస్సులకు ఆర్‌టిసి నడుపుతోంది. పండుగను ప్రి దసరా, పోస్ట్ దసరాగా విభజించాం. 16 నుంచి 19 వరకు ప్రి దసరాగా, అలాగే 20 నుంచి 25 వరకు పోస్ట్ దసరాగా నిశ్చయించాం. ఇందులో రాష్ట్రంలోకి వచ్చేవారు, పండగ అనంతరం బయటకు వెళ్లేవారి కోసం ప్రత్యేకంగా సర్వీసులను నడుపుతున్నాం. హైదరాబాద్‌కు 1,066, విజయవాడకు 1,313, బెంగళూరు 398, విశాఖపట్నం 574 రాజమహేంద్రవరం 335, తిరుపతి 143, చెన్నై 121 బస్సులు సర్వీసులు నడుపుతున్నాం. అలాగే బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు యాత్రీ రద్దీ దృష్ట్యా 425 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు జెఎండి చెప్పారు. గత నెలలో జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సుమారు 10 లక్షల మంది యాత్రికులు ఆర్‌టిసి సేవలు వినియోగించుకున్నారని అన్నారు. అలాగే స్త్రీ శక్తి పథకం కారణంగా ఒక్కోసారి ఆర్‌టిసి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 100శాతం దాటి పోతోందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి 750 విద్యుత్ బస్సులు, వచ్చే ఏడాది చివరి నాటికి మొత్తం 3 వేల కొత్త బస్సులు వస్తాయని జెఎండి శివప్రసాద్ మీడియాకు వివరించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** దక్షిణ అండమాన్ ప్రాంతంలో సముద్రంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవస్థ దక్షిణ బంగాళాఖాతం మీదుగా తమిళనాడు, శ్రీలంక తీరం వైపు కదులుతున్నందున దక్షిణ భారతదేశ వ్యాప్తంగా వర్షాలు ఊపందుకోనున్నాయి. దీని ప్రభావంతో ముఖ్యంగా అక్టోబరు 14 నుంచి కోస్తాంధ్ర, తమిళనాడు తీర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. అక్టోబరు 15న కూడా తీరం వెంబడి వర్షాలు కొనసాగుతాయని తెలుస్తోంది. అక్టోబరు 16 నుంచి 19 మధ్య ఈ వర్షాలు క్రమంగా లోతట్టు ప్రాంతాలకు విస్తరించనున్నాయి. రాయలసీమ, దక్షిణ కర్ణాటక ప్రాంతాల్లోనూ వర్షాలు కురుస్తాయి. కొన్ని చోట్ల పిడుగులు, బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ఉపసంహారణ చివరి దశలో ఉన్నందున, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న ఈ వాతావరణ వ్యవస్థ ఈశాన్య రుతుపవనాల ఆగమనానికి దోహదపడొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఈ అల్పపీడనం తుపానుగా మారే అవకాశం లేనప్పటికీ, గణనీయమైన వర్షపాతాన్ని ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# బదలీ, పోస్టింగులపై నిషేధం పొడిగింపు

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** అధికారుల బదిలీ, పోస్టింగులపై నిషేధాన్ని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిఒ జారీ చేసింది. రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల నేపథ్యంలో ఐఎఎస్‌ల బదిలీలను తాత్కాలికంగా నిలివేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఓటరు జాబితా సవరణ పూర్తయ్యే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను సవరించే పనులు వేగవంతంగా పూర్తవుతున్నాయని, ఈ సమయంలో ఐఎఎస్‌లను బదిలీ చేయడం వల్ల పనుల్లో ఆటంకాలు ఏర్పడే అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. స్థానిక ఎన్నికల అనంతరం ఉన్నతాధికారుల బదిలీలు, పోస్టింగులు అమల్లోకి రానున్నట్లు సమాచారం.

# వైఎస్ భాస్కర్ రెడ్డికి ఇడి నోటీసులు

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ6 నిందితుడిగా ఉన్న వైఎస్ భాస్కర్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నోటీసులు జారీ చేసింది. సిబిఐ దర్యాప్తు ఆధారంగా పిఎంఎల్‌ఏ చట్టం కింద మనీలాండరింగ్ కోణంలో హత్య వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలపై ఇడి దృష్టి సారించింది. ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో భాస్కర్ రెడ్డి విచారణకు హాజరుకానున్నారు. కాగా, సోమవారం దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని పలు కోణాల్లో ప్రశ్నించిన అధికారులు, రేపు భాస్కర్ రెడ్డిని, ఈ నెల 14న కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డిని విచారించనున్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంపై నిర్లక్ష్యం వద్దు

- ఆర్‌టిజిఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



**అమరావతి, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదు పరిశీలించాలన్నారు. వెంటనే పరిష్కార మార్గాన్ని అన్వేషించాలన్నారు. ఏ ఏ రంగాల నుంచి సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయనే అంశంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. సచివాలయంలో సోమవారం ఆర్‌టిజిఎస్ నుంచి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రభుత్వ సేవలపై ఆరా తీశారు. ప్రస్తుతం పిజిఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించగలుగుతున్నామని, మరింత వేగంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ సమావేశంలో 175 నియోజక వర్గాల నోడల్ అధికారులు ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత వాటిని పరిష్కరించే విషయంలో ఉద్యోగులకు, అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చూడాలన్నారు.

వివిధ శాఖలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, జారీ చేస్తున్న జిఒలను వక్రీకరిస్తూ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతున్నారన్నారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జిఒపై ఈ తరహా దుష్ప్రచారం చేస్తున్నారని సిఎం చంద్రబాబు తెలిపారు. తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు సమర్థంగా సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖా పరంగానే ఎక్కువగా అర్జీలు వస్తాయన్నారు. వీటిని పరిష్కరించే క్రమంలో అలసత్వం ఉండకూడదన్నారు. క్షేత్ర స్థాయిలో చోటు చేసుకునే అంశాలు ఒక్కొక్కసారి సున్నిత అంశాలుగా మారతాయన్నారు. అందువలన అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయి అధికారులు నివేదికలపై కచ్చితంగా దృష్టి పెట్టాలన్నారు. అవసరమైతే ఫీల్డ్ విజిట్‌లు జరగాలన్నారు. ప్రజారోగ్యం. మంచినీరు తదితరంశాలపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో సిఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్
- 14, 15 తేదీల్లో ద్రౌపది ముర్ము విజయవాడలో పర్యటన

**అమరావతి, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి రాష్ట్రపతి సచివాలయం నుండి జారీ అయిన మార్గదర్శకాలను తుచ తప్పక పాటించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి మినిట్ టు మినిట్ కార్యక్రమాన్ని ఆలస్యం లేకుండా సమయపాలనకు అనుగుణంగా జరిగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఏర్పాట్లకు సంబంధించి సంబంధిత శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై ఆయా శాఖల అధికారులు పటిష్టంగా



ఏర్పాటు చేయాలని సిఎస్ ఆదేశించారు.

అంతకు ముందు ఈ వర్చువల్ సమావేశానికి వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు మాట్లాడుతూ భారత రాష్ట్రపతి పర్యటనకు సంబంధించి వివిధ శాఖల పరంగా చేయాల్సిన ఏర్పాట్లపై శాఖల వారీ వివరాలను తెలియజేశారు.

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనకు సంబంధించి డ్రాప్టు ముసాయిదా ప్రయాణ సమాచారం ప్రకారం ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం 3.55 గం.లకు రాష్ట్రపతి ఢిల్లీ నుండి విమానంలో బయలుదేరి సా.6.25 గం.లకు గన్నవరం విమానాశ్రయం చేరుకుని అక్కడి నుండి రోడ్డు మార్గంలో విజయవాడ ఇంద్రకీలాద్రికి చేరుకుని రాత్రి 7.20 గం.ల నుండి 7.40ల వరకు కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాత్రికి విజయవాడలో బస చేస్తారు. 15వ తేది ఉదయం 11.30 గం.లకు పున్నమి ఘాట్ చేరుకుని ఉ.11.30 గం.ల నుండి మధ్యాహ్నం 1గం.వరకూ అక్కడ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్ మేళాలో ముఖ్య అతిధిగా పాల్గొంటారు. తదుపరి మధ్యాహ్నం 1గం.10 నిమిషాల నుండి 2గం.ల10 నిమిషాల వరకూ స్వయం సహాయక సంఘాలు లక్‌పతి దీదీలతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం రాష్ట్రపతి మధ్యాహ్నం 2.45 గన్నవరం విమానాశ్రయం చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఈ వర్చువల్ సమావేశంలో అదనపు డిజిపి మదుసూదన్ రెడ్డి, పిఆర్ అండ్ ఆర్డి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, సెర్ప్ సిఇఒ కరుణ, ఎన్టిఆర్ జిల్లా కలక్టర్ లక్ష్మి శ, ఐఅండ్‌పిఆర్ డైరెక్టర్ కెఎస్.విశ్వనాధన్, దుర్గగుడి ఇఒ శీనూనాయక్, ప్రోటోకాల్ విభాగం జెస్.రామసుబ్బయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శ్రీశైలం డ్యాంకు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

**శ్రీశైలంప్రాజెక్టు, అక్టోబరు 12 ప్రభాతవార్త:** ఆధునిక దేవాలయంగా పేరుగాంచి శ్రీశైలం జలాశయంకు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది. ఈక్రమంలోనే వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డు లండన్ సంస్థకు చేందిన జాయింట్ సెక్రటరీ ఎలియాజర్ సోమవారం సుండిపెంట ఎపి జెన్‌కో అతిధి గృహంలో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి గుర్తింపు ధ్రువికరణ పత్రాన్ని అందజేసారు. ఈ సందర్బంగా వారు మాటా ్లడుతూ శ్రీశైలం



ఎమ్మెల్యేకు ధ్రువీకరణ పత్రం అందజేసిన ఎలియాజర్

డ్యాంకు కలిగి ఉన్న నాలుగు ప్రత్యేకమైన అంశాలను పరిశీలించి వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డు లండన్ సంస్థ గుర్తించిందని అన్నారు. అదే విధంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం జలాశయంకు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డు లండన్ సంస్థ ద్వారా గుర్తింపు పొందడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. డ్యాం నిర్మాణ కట్టడం ఇంజనీర్ల గోప్పతనంకు నిదర్శనం అన్నారు. 2009వ సంవత్సరంలో 25లక్షల అత్యధిక క్యూసెక్కుల నీరు వచ్చినప్పటికిని చెక్కుచెదరకుండా ఉండడం హర్షించదగ్గ విషయం అన్నారు. వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డు సంస్థ గుర్తించినందుకు జలవనరుల శాఖ, ఎపిట్రాన్స్‌కో- ఎపి జెన్‌కో, ఇతర శాఖల తరుపున, ప్రభుత్వం తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలాశయం ఎస్.ఇ వేణుగోపాల్‌రెడ్డి, ఇతరశాఖల అధికారులు, శ్రీశైలం మండలం టిడిపి ఇన్‌చార్జ్ యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ వివేకా హత్య కేసులో కొనసాగుతున్న ఇడి దర్యాప్తు

## రూ.40 కోట్ల చెల్లింపులో శివశంకర్‌రెడ్డి సుదీర్ఘ విచారణ

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మాజీ మంత్రి వై.ఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) విచారణ కొనసాగుతోంది. వివేకా హత్యకు రూ.40 కోట్లు చెల్లింపులు జరిగినట్లు నిర్ధా రణ కావడంతో మనీలాండరింగ్ కోణంలో దీనిపై ఈడీ వేరుగా విచారిస్తుండడం తెలిసిందే. ఈ కేసులో నిందితులెవరు? ఎందుకు ఈ నేరానికి పాల్పడ్డారనే అంశాలను సిబిఐ విచారిస్తుండగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ సాగుతోంది. ఇందుకు సంబంధించి 20 రోజుల వ్యవధిలో ఎ1 ముద్దాయి ఎర్ర గంగిరెడ్డి, ఎ2గా వున్న సునీల్ యాదవ్, అప్రూవర్‌గా మారిన దస్తగిరిని ఇడి అధికారులు పలుమార్లు విచారించగా సోమవారం ఎ5గా వున్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డిని సుధీర్ఘంగా విచారించి రూ.40 కోట్ల లావాదేవీల గురించి భిన్న కోణాల్లో ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. బషీర్‌బాగ్‌లోని ఇడి కార్యాలయంలో ఈ విచారణ సాగింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు రూ.40 కోట్లు చెల్లించినట్లు వెలుగులోకి రావడంతో ఈ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సమకూర్చారు? ఎందుకు ఇచ్చారు? అనే అంశాలపై ఇడి అధికా రులు శివశంకర్‌రెడ్డిని ప్రశ్నించారు. 2019లో జరిగిన వివేకానంద రెడ్డి హత్యకు సంబంధించి రూ.40 కోట్ల ఫండింగ్ వ్యవహారాలు, ఫోన్ కాల్స్, డిజిటల్ ఆధారాలపై దృష్టి సారించిన ఇడి అధికారులు ఇతర నిందితులను విచారించినట్లుగానే శివశంకర్ రెడ్డిని ప్రశ్నించినట్లుగా సమాచారం. ఈ విచారణలో సునీల్ యాదవ్ సహా ఇతర నిందితులతో జరిపిన ఫోన్ సంభాషణలపై శివశంకర్ రెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. వీరితో మాట్లాడిన కాల్ డేటా రికార్డును అతని ముందు వుంచి వివరాలను రాబట్టినట్లు తెలిసింది. సాంకేతిక సాక్ష్యాలుగా వున్న గూగుల్ టెక్ అవుట్‌ను కూడా అతని ముందు ఈడీ అధికారులు వుంచినట్లు తెలిసింది. శివశంకర్ రెడ్డి బ్యాంకు లావాదేవీలను 2019 నుంచి ఈడీ అధికారులు పరిశీలించి అనుమానిత వ్యవహారాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి కోటి రూపాయలు ఇచ్చిన విషయం గురించి ఈడీ అధికారులు శివశంకర్ రెడ్డిని ప్రశ్నించినట్లు తెలిసింది. వివేకా నంద రెడ్డి హత్య వెనుక గల ఆర్థిక లావాదేవీల నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు ఈడీ మరింత లోతుగా విచారించేందుకు ఈ కేసులో నిందితులుగా వున్న వారిని వరుసగా విచారిస్తోంది. ఇందుకు సంబంధించి కడప ఎంపి అవినాష్ రెడ్డితో పాటు ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్ ఇళ్లలో ఈడీ అధికారులు ఇటీవలే ఏకకాలంలో సోదాలు నిర్వహించి కీలక పత్రాలు జప్తు చేయడం తెలిసిందే. హైదరాబాద్‌లోని అవినాష్ రెడ్డి ఇంట్లోనూ ఈ సోదాలు జరిగాయి. కాగా ఇదే కేసులో కడప ఎంపి అవినాష్‌రెడ్డిని ఈ నెల 14న ఇడి విచారించనున్నది.



# రాజధాని అమరావతికి రైలు

## కీలక మార్గాల అనుసంధానం వేగవంతం

**అమరావతి, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతికి కీలక రైలు మార్గాల అనుసంధానం పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రాజధాని అమరావతికి రైలు కనెక్టివిటీ 2028 లేదా 2029 నాటికి సిద్ధం చేసే దిశలో కార్యచరణ సాగుతుంది. రైల్వే కనెక్టవిటిలో భాగంగా రూ. 2,047 కోట్ల అంచనా వ్యయంతో 58.10 కి.మీ. పొడవైన ఈ రైలు మార్గాన్ని నాలుగు ప్యాకేజీలుగా నిర్మిస్తున్నారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన 9 కొత్త స్టేషన్లు, సరుకు రవాణా కోసం పరిటాల గూడ్స్ టెర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. ఒక ప్రాంతం అభివృద్ధికి కనెక్టివిటీ అత్యంత ప్రధానం కాబట్టి, అమరావతిని రాజధానిగా ఎంపిక చేసినప్పటి నుంచే కనెక్టివిటీపై దృష్టి సారించారు. కేంద్రంతో సంప్రదింపుల తర్వాత 2018లోనే ఈ రైల్వే లైన్‌కు మంజూరు లభించింది. సర్వేలు పూర్తి చేసి మార్గాన్ని ఖరారు చేశారు. అయితే, తర్వాత మారిన ప్రభుత్వాల వల్ల ఈ ప్రాజెక్టు కొంత జాప్యానికి గురైంది. 2024లో కొత్త కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రైల్వే శాఖతో మాట్లాడి అమరావతి రైల్వే లైన్‌ను తిరిగి పట్టాలెక్కించింది. తొలుత డబుల్ ట్రాక్ అనుకున్నప్పటికీ, ప్రస్తుతం సింగిల్ లైన్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది.

**ప్రాజెక్టు వివరాలు, అంచనా వ్యయం:** అమరావతి రైల్వే లైన్ ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం వద్ద ప్రారంభమై అమరావతి మీదుగా నంబూరు వరకు విస్తరించనుంది. ఈ రైల్వే లైన్ మొత్తం పొడవు 58.10 కిలోమీటర్లు. దీని నిర్మాణానికి అంచనా వ్యయం రూ.2,047 కోట్లుగా ఉంది. ఈ ప్రాజెక్టును నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టనున్నారుప్యాకేజీ 1లో ఎర్రుపాలెం నుంచి పెదపురం వరకు 3.5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీనికి సంబంధించిన భూసేకరణ, టెండర్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయి కాంట్రాక్టర్ సంస్థను ఎంపిక చేశారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ప్యాకేజీ 2లో పెద్దాపురం నుంచి కృష్ణా నదిపై నిర్మించే బ్రిడ్జి వరకు ఉంటుంది. దీని కోసం 152.40 హెక్టార్ల భూమి అవసరం కాగా, భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. టెండర్లు కూడా పూర్తయ్యాయి.ప్యాకేజీ 3లో కృష్ణా నదిపై 3.23 కిలోమీటర్ల పొడవైన బ్రిడ్జి నిర్మాణంతో పాటు అక్కడి నుంచి వడ్డమాను వరకు రైల్వే లైన్ నిర్మాణం ఉంటుంది. ఇది రాజధాని రెండో విడత భూ సమీకరణ పరిధిలోకి వస్తుంది. టెండర్లు పూర్తయ్యాయి. ప్యాకేజీ 4లో వడ్డమాను నుంచి నంబూరు వరకు 28.35 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది. ఈ ప్యాకేజీ పూర్తిగా రాజధాని పరిధిలోకి వస్తుంది. పల్నాడు జిల్లాలో 48.527 హెక్టార్లు, గుంటూరు జిల్లాలో 181.16 హెక్టార్ల భూమి అవసరం. దీని భూసేకరణను సిఆర్‌డిఎ చేపడుతోంది. రూ.599.33 కోట్ల విలువైన ఈ టెండర్లకు నవంబర్ 23 వరకు గడువు విధించారు. ఇపిసి (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) మోడల్‌లో రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాడికొండ, కొప్పురావూరు ప్రాంతాల్లో భూములు సమీకరిస్తున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు కూడా ఈ రూట్ లోనే వెళ్తున్నందున, రెండింటికీ ఒకేసారి భూ సమీకరణ చేస్తున్నారు.

అత్యాధునిక స్టేషన్లు, సౌకర్యాలు అమరావతి రైల్వే లైన్ పరిధిలో 9 కొత్త స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. పెదపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పురావూరు వంటి ప్రదేశాల్లో ఈ స్టేషన్లు రానున్నాయి. ఈ స్టేషన్లలో విద్యుదీకరణ, సరికొత్త సిగ్నలింగ్ వ్యవస్థ, ఆధునిక స్టేషన్ భవనాలు, అంతర్జాతీయ స్థాయి ప్లాట్‌ఫామ్‌లు వంటి అధునాతన సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రమాదాలను నిరోధించే కవచ్ టెక్నాలజీని కూడా ఈ స్టేషన్లలో పొందుపరచనున్నారు.

**పరిటాల గూడ్స్ టెర్మినల్... వాణిజ్యపరమైన ప్రయోజనాలు:** ఈ రైల్వే లైన్ కేవలం ప్రయాణికుల రవాణాకే పరిమితం కాకుండా, సరుకు రవాణాకు కూడా కీలకమైన మౌలిక సదుపాయంగా మారనుంది. పరిటాల స్టేషన్ దగ్గర ప్రత్యేకంగా గూడ్స్ టెర్మినల్‌ను నిర్మించనున్నారు. ఇది కృష్ణపట్నం పోర్టు, కాకినాడ పోర్టులతో పాటు నిర్మాణంలో ఉన్న బందరు (మచిలీపట్నం) పోర్టుతో కనెక్టివిటీని కలిగి ఉండనుంది. దీని వల్ల అమరావతి వాణిజ్యపరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

**భవిష్యత్ అనుసంధాన సూచనలు:** నిపుణుల సూచనల ప్రకారం, అమరావతి నుంచి పెదకూరపాడుకు లింక్ లైన్ నిర్మిస్తే బీబీ నగర్, గుంటూరు లైన్‌తో అనుసంధానం సాధ్యమై, సికింద్రాబాద్ నుంచి అమరావతికి నేరుగా రైళ్లు నడపవచ్చు. నరసరావుపేట, సత్తెనపల్లి లింక్ లైన్ వేస్తే రాయలసీమ, బెంగళూరు నుంచి రైళ్లు నేరుగా రాజధానికి చేరుకోవచ్చు. వేజండ్లచుండూరు రూట్‌ను వినియోగంలోకి తెస్తే చెన్నైకి కనెక్టివిటీ మెరుగుపడుతుంది. స్టేషన్లలో ప్లాట్‌ఫామ్‌ల పొడవును 450 మీటర్ల నుంచి 600 మీటర్లకు పెంచాలని కూడా సూచనలు ఉన్నాయి. రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతున్న ఈ తరుణంలో, రోడ్డు కనెక్టివిటీతో పాటు రైలు కనెక్టివిటీ సిద్ధమవుతుండటం శుభపరిణామం.

# ఎసిబి కోర్టులో కెటిఆర్ డిశ్చార్జ్ పిటిషన్

**హైదరాబాద్, అక్టోబరు 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చో టుచేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు కోర్టుకు ఛార్జిషీట్ దాఖలు చేసి ఇతరత్రా అన్ని ఆధారాలు సమర్పించి, దర్యా ప్తును వేగవంతం చేస్తున్న తరుణంలో ఇందులో మొదటి ముద్దాయిగా వున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నాంపల్లి ఏసీబీ కోర్టులో సో మవారం నాడు డిశ్చార్జి పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఏసీబీ అధికారులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో తన పేరును తొలగించాలని కెటిఆర్ తన పిటిషన్‌లో కోరారు.

ఫార్ములా ఇ కార్ రేస్ కేసు విచారణ ఏకపక్షంగా వుందని, ఈ క్రమంలో నిందితుల జాబితా నుంచి తన పేరు ను తొలగించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కెటిఆర్ ఎ1గా వుండగా సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఎ2గానూ, హెచ్ఎండిఎ మాజీ సీఈ బిఎల్ఎన్ రెడ్డి ఎ3గానూ మరికొందరు ఇతర నిందితులుగానూ వుండడం తెలిసిందే. కాగా కెటి ఆర్ దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను ఏసీబీ కోర్టు విచారణకు స్వీకరించింది. నవంబరు నెలలో దీనిపై విచారణ జరిగే వీలుందని తెలిసింది.

13-10pg4.qxd:13-10pg4.qxd 1/1/02 7:08 AM Page 1



వార్త

మహాత్ములు సంపద కలిగినప్పుడు వికసించిన తామరపువ్వులా ఉంటారు. ఆపదలను ఎదుర్కొనేటప్పుడు పెద్ద గండశిలవలె ధైర్యం చెడక ఉంటారు.

న- భర్తృహరి

## 'జెన్‌జీ' మారుతం!

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రమా? అనే ధోరణిలో సుప్రీంకోర్టు ధర్మాసనం క్రాక్రోచ్ జనతాపార్టీ, కాంగ్రెస్ ఆందోళన లపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును తప్పు పట్టింది. శుక్రవారం 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయో గించకూడదని సుప్రీం ప్రభుత్వ చర్యలను ఎద్దేవా చేస్తూ మందలించింది. దేశ రాజధాని ఢిల్లీలో శనివారం సిఇసి రాజీనామా కోరుతూ వివిధ వర్గాలు, పార్టీల నేతృత్వంలో జరిగిన నిరసన సభలతో, ప్రదర్శనలతో న్యూఢిల్లీ అట్టు డికిపోయిన సంఘటన గురించి సుప్రీంకోర్టు ధర్మాసనం మండిపడింది. మెట్రోస్టేషననమూసివేత కోర్టు ధిక్కారణే అని ధర్మాసనం చెప్పింది. సిజెపి ఆందోళనలతో మెట్రో సర్వీసు, మరికొన్ని రైలు సర్వీసులను రద్దు చేయడంతో దేశ ప్రజలంతా దృష్టి అటువైపు మళ్లింది. ఇందులో ఉద్య మంతో కానీ ప్రభుత్వ నిర్ణయాలతో ఏమాత్రం సంబంధం లేని ఢిల్లీ ప్రజలు బాగా ఇబ్బంది పడ్డారు. ఈ నిరసన ప్రకంపనలు దేశవ్యాప్తంగా మిన్నుముట్టాయి. లక్షలాది మంది నిరసన కారులను మార్గమధ్యంలోనే అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు. సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అశుతోష్ రాంకాలను అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రాజధాని నగరం దిగ్బంధానికి గురైంది. ఒక రాజ్యాంగ అధిపతి ఏకపక్ష నిర్ణయాలకు, ఓటు హక్కుపై గొంతెత్తిన విపక్షాలు, విద్యార్థులు తదితర యువత మధ్య సాగుతున్న 'నిరసన ఘోష' రాజకీయ ప్రత్యర్థుల మధ్య జరిగే ఎత్తులు పై ఎత్తుల స్థాయిలో సాగుతోంది. నిన్న గాకమొన్న సిఇసికి అనుకూలంగా పూర్వ న్యాయమూర్తు లు, తాజాగా మాజీ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులువత్తాసు పలికారు. సాధారణంగా 'ఓటు హక్కు' అంశంపై కన్నా సిఇసి హోదాలో ఉన్న జ్ఞానేశ్‌కుమార్ వ్యక్తిగత హోదాకే వారి మద్దతు ఇచ్చినట్లు అనిపిస్తోంది. 'ఓటు హక్కు' కోల్పోయిన వారి విషయంలో కూడా వారి మద్దతు అవసరముంది. ఒకప్రక్క ప్రధాని నరేంద్రమోడీ సైతం ప్రపంచానికి ప్రస్తుతం ఎంతో అవసరాలను అందించేశక్తి సామర్థ్యాలు 'జెన్‌జీ' యువతకే ఉందంటూనే మరోపక్క వారి మీద దాష్టీకాలు జరిగినా నోరు మెదపడం లేదనే అపప్రథనెదుర్కొంటున్నారు. చెప్పాలంటే ప్రశ్నించే హక్కు ను కాలరాస్తున్నారా అని అనిపిస్తోంది. వీటన్నిటినీ చూస్తే 'జెన్‌జీ' ఏ పేరున పిలిచినా ఎక్కడైనా యువతరానిదే పె చేయి అనే పరిస్థితులను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఒకసారి చేపట్టిన తొలినాటి ఉద్యమంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ రోజు న కూడా 'జెన్‌జీ' ఉద్యమాన్ని తక్కువ అంచనా వేయడం వలనే పరిస్థితులు చేతులు దాటిపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వం లొంగక తప్పలేదు. తదుపరి జార్ఖండ్ ప్రభు త్వంపై కూడా విద్యార్థిలోకం ధ్వజమెత్తింది. సాధించింది. ప్రభుత్వాలు తమకున్న ఆధిపత్య ధోరణిలో ఎలాపడితే అలా కార్యాచరణ చేపడితే తాము కూడా అదే దారిలో బీష్మించుకు కూర్చోగలమని, ఉద్యమించగలనని యువత తేల్చి చెప్పింది. ఇప్పుడు 'జెన్‌జీ' మరో ఉద్యమాన్ని నెత్తిన వేసుకుంది. ఆది నుంచి 'సర్' ఉద్యమాన్ని నిలబెట్టిందీ, పట్టువిడుపులు లేకుండా ముందుకురుకుతున్న ప్రధాన విప క్షం కాంగ్రెస్‌కు తోడుగా ఇతర విపక్షాలు, నీడగా జెన్‌జీ యువత, విద్యార్థిలోకం కూడా ఇప్పుడు అగ్నికి ఆజ్యం పోసిన చందాన సిఇసి జ్ఞానేశ్‌కుమార్ పదవీ త్యాగం చేయాల్సిందేనంటూ 'జెన్‌జీ' గొంతు కలిపింది. దేనికైనా తెగించేందుకు సిద్ధంగానే ఉంది. ప్రభుత్వ నిర్ణయాల్లో పార దర్శకత లేనందున్న యువత అసంతృప్తికి గురై తిరగబడు తోందన్న నిజాన్ని అన్యులు గ్రహించినంతగా కేంద్రప్రభు త్వం గ్రహించలేకపోవడం వలనే యువతలో అశాంతి ప్రబ లింది. ఎన్ని వ్యూహాలు పన్నినా యువతకు అందాల్సి న భరోసా ఏదీచిక్కడం లేదు. పైగా ఉద్యమిస్తున్న యువతపై బలప్రయోగం చేయడం ఏ ఇతర వర్గాలకూ నచ్చడంలేదు. యువత ప్రస్తుతం క్రాక్రోచ్ జనతాపార్టీ నేతృత్వంలో ఉద్య మాలకు ఆకర్షితులౌతోంది. నిరసనకారులు జంతర్‌మంతర్ వైపు వెళ్లేనే పోలీసు గణం సహించలేకపోతోంది. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎఐఎస్‌ఎ, కాంతికారి యువత సంఘటన్ (కెవైఎస్) సభ్యులతోపాటు క్రాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్త లను సైతం ఢిల్లీ పోలీసులు తీవ్రంగా ఆటంకపరిచారు. ఇవన్నీ యువతను ఆగ్రహావేశుల్ని చేసిన సంఘటనలే. ఒక నాడు కేవలం విశ్వవిద్యాలయాలు కళాశాలలకేపరిమితమైన విద్యార్థి ఉద్యమాలు 'జంతర్ మంతర్' వరకు దారితీసా యంటే పాలకుల పట్ల యువతలో ఉన్న అసంతృప్తి విష యం ఆలోచించాల్సిందే. రాజధాని నగరం అట్టుడికి పోతోం దని పత్రికల పతాక శీర్షికలనెక్కుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా ఢిల్లీలో ఏదో జరుగుతోందనే విష యం పౌరులకు దాదాపుగా చేరిపోయింది. అన్నివర్గాల నుంచి నిరసనలు మిన్నుముట్టాయి. 'సర్' ప్రక్రియ లోప భూయిష్టంగా ఉండటమే ఈ ఉద్యమాలకు అగ్గిరాజేసింది. 'సర్' ఉద్యమాల నేపథ్యాన్ని గ్రహించి దాని ప్రక్రియలో మార్పులు తేవడంగానీ 'సర్' ప్రక్షాళన గానీ పూర్తిగా జరు గలేదనే చెప్పాలి. ఎన్నిసార్లు 'సర్' విషయంలో సుప్రీంకోర్టు మెట్టెక్కినా సరైనఊరట రాలేదని ప్రఖ్యాత న్యాయకోవి దుడు కపిల్‌సిబాల్ సైతం చేతులెత్తేసారు. కానీసుప్రీంకోర్టు ధర్మాసనాధినేతలు మాత్రం ప్రజలకు న్యాయం ప్రసాదిం చడంలోనూ, న్యాయం కలిగించామన్న నమ్మకం కలిగించ డంలోనూ తాము ముందుంటామని ఎంతో హుందాగా కపిల్‌సిబాల్ ఆవేదనకు సమాధానంగా వివరించారు. ఏదిఏమయినా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా కోరుతూ విపక్షాలు చేపట్టిన నిరసనోద్యమంలో ప్రధాన భాగస్వామ్యంగా ఉన్న 'జెన్‌జీ' యువతను ప్రశాంతపరచడమొక్కటే పాలకుల ముందున్న తక్షణ కర్తవ్యం. యువతను నిర్మాణాత్మక కార్యక్రమాలవైపు మళ్లించాలన్న కేంద్రప్రభుత్వ యోచన మంచిదే అయినా

ప్రతి మనిషి కావలసినవాడే. కాకపోతే ఏ మనిషీ ఎక్కువ కావలసిన వాడు కాదు.



ఎమర్సన్

ఎలా పొందాలో తెలుసుకుంటే, అనంతమైన శక్తి మనిషికి అందుబాటులో ఉంది.



ఆడమ్స్ బెక్

# విద్యార్థుల ఆత్మహత్యలకు అంతం లేదా?

***ఫిర్యాదు చేస్తే తమ కెరీర్ నాశనమవుతుందనే భయం విద్యార్థులను నీడలా వెంటాడుతోంది. విచారణ కమిటీల్లో ఆయా సంస్థల అధిపతులే ఉండటంతో పాటు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉండడంవల్లే బాధితులకు న్యాయం జరగడంలేదనే అభిప్రాయం కూడా ఉంది. రోహిత్ వేముల చట్టంఅమలు కోసం విద్యార్థి సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను ఇకనైనా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలి. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో స్వతంత్ర, విద్యార్థి ప్రాతినిధ్యం కలిగిన ఫిర్యాదు పరిష్కార సెల్, బయటి నిపుణులతో కూడిన విచారణ వ్యవస్థ, తప్పనిసరి మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఫ్యాకల్టీలకు సామాజిక న్యాయ సున్నితత్వ శిక్షణ ఏర్పాటు చేయాలి. వీటికి అదనంగా తల్లిదండ్రులు సైతం తమ డాలర్ల కలలను నిజం చేసుకునే తొందరలో తమ పిల్లల పై అనవసరమైన మానసిక ఒత్తిళ్లకు పూనుకోరాదు.***



డాక్టర్ నీలం సంపత్

మనిషికి విద్యతో వివేకం, వివేకంతో మానసిక పరివర్తన, తద్వార మనిషి మానవీయ విలువలు గల పౌరుడిగా తీర్చిదిద్దబడతాడనే సత్యం లోకవిదితమే. ఐతే ఔత్సాహికులైన విద్యార్థులకు ఆ శాస్త్రీయ విద్యను అందించాల్సి న విద్యాలయాలే వారిని మానసిక ఒత్తిళ్లకు గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో అభివృద్ధి పథంలో ఆకాశ మంత ఎత్తు ఎదగాల్సి న ఆ విద్యార్థులే అర్థాంతరంగా అసువులుబాస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 21ప్రతి పౌరుడికి జీవించే హక్కును ప్రసాదిస్తే, దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అనేక ఉన్నత విద్యాసంస్థలు మాత్రం కొంతమంది యువతకు ఆ హక్కును దూరం చేస్తున్న వైనం గుండెలను ద్రవింప జేస్తోంది. ఉన్నత విద్యారంగంలో విద్యార్థులను మహోన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాల్సి న ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఎయిమ్స్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఏ ఏటికా ఏడు నిరంతరంగా కొనసాగుతున్న యస్.సి, యస్.టి, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల ఆత్మహత్యల పరంపర సమకాలీన సమాజాన్ని కలవరపెడుతోంది. దేశవిద్యావ్యవస్థమౌలిక స్వరూపంలో ఉన్న లోపమో?లేదా లోప భూయిష్టమైన విద్యావిధానాల ఫలితమో? లేదా సదరు ఉన్నత విద్యా సంస్థల పాలకుల వివక్షతో కూడిన పాలనో?మరే కారణమో కాని పేదరికంలో పుట్టి పేదరికంలో పెరిగినా అనేక రకాల సామాజిక వివక్షలకు ఎదురొడ్డి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యా సంస్థలలో ప్రవేశం పొందినవంతో మంది అణగారిన కులాలు, వర్గాలకు చెందిన దళిత బహుజన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం ఆధునిక సమాజంపై మాయనిమచ్చగా భావించక తప్పదు. పదేళ్ల క్రితం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీ.హెచ్.డి. స్కాలర్ రోహిత్ వేముల ఆత్మహత్య ఒక్కసారిగా మొత్తం దేశాన్ని కుదిపేయడమే కాకుండా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్‌గా పరిగణించే తన లేఖలో 'నా పుట్టుకే నా ప్రాణాంతక యాక్సిడెంట్'అని రాసిన ఆ యువ శాస్త్రవేత్త హృదయ ఘోష ,అధికశాతం ఉన్నత విద్యా సంస్థల క్యాంపస్‌లను క్యాన్సర్‌లా పీడిస్తున్నకుల వివక్ష క్రూరత్వాన్ని వెలుగులోకి తెచ్చిన వైనంజాతీయ చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో షరా మామూలుగా ఆనాటి ప్రభుత్వం సదరు దురదృష్టకర సంఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. మరింత లోతుగా అధ్యయనం చేయడం కోసం ఉన్నత విద్యారంగ నిపుణులతో కమిటీలు వేసింది. కుల వివక్ష మూలాలలోకి వెళ్లి దానిని సమగ్రంగా అధ్యయనం చేసి సమూలంగా నిర్మూలిస్తామని పుంఖాను పుంఖాలుగా హామీలు గుప్పించింది. రోహిత్ వేముల పేరుతో ఒ ప్రత్యేక చట్టాన్ని కూడా రూపొందించింది. తదనంతరం పదేళ్ల కాలం గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు, ఉన్నత విద్యాసంస్థలు మారలేదనడానికి నిలువెత్తు నిదర్శనంగా నిన్నటికి నిన్న ఐ.ఐ.టీ ఢిల్లీలో దళిత విద్యార్థి సాహిల్ మరణం అదే ఘోర దురంతాన్ని మళ్లీ గుర్తు చేసింది. రోహిత్ వేముల నుండి పాయల్ తడ్వి (ముంబై), ఫాతిమా లతీఫ్ (ఐ.ఐ.టీ మద్రాస్), అనిల్ కుమార్ (ఐ.ఐ.టీ హైదరాబాద్), దర్శన్ సోలంకి (ఐ.ఐ.టీ బాంబే) వరకు, ఇప్పుడు సాహిల్ వరకు మరణించిన వారిలో అత్య



ధికులు దళిత, బహుజన, ఆదివాసీ, మైనారిటీ సామాజిక వర్గాల నుండి వచ్చినవారు కావడం యాదృచ్ఛికం కాదు, అది ఒక వ్యవస్థాగత వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమే ననే బుద్ధిజీవుల అభిప్రాయాలు ప్రాధాన్యతను సంతరించు కుంటున్నాయి. ఈ ఆత్మహత్యలను కేవలం వ్యక్తిగత మానసిక సమస్యగా చూడలేం. వీటి వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయనిపిస్తోంది. ఉన్నత విద్యారంగంలో రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్ ద్వారా అత్యున్నత విద్యా సంస్థలలో క్యాంపస్‌లో ప్రవేశాన్ని సంపాదించుకున్న నిరుపేద యస్.సి, యస్.టి విద్యార్థులు అత్యంత క్రూరమైన కుల వివక్షను ఎదుర్కొంటున్నారు. 'నువ్వు కోటా ద్వారా వచ్చావు' అనే హేళన, మెస్‌లలో, హాస్టళ్లలో వేర్పాటు, లైంగిక వేధింపులు, పరిశోధనా రంగంలో గైడ్‌ల నుండి సరైన మార్గదర్శకత్వం లేకపోవడం, స్కాలర్ షిప్‌లు సకాలంలో అందకపోవడం వారిని ఒంటరి వాళ్లుగా మారుస్తున్నాయేమోనని పిస్తోంది. ఉన్నత విద్యాసంస్థల్లో ఫ్యాకల్టీ వివక్ష, పరిపాలన యంత్రాంగంలో సామర్థ్య లోపం, లోపభూయిష్టమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కేవలం కార్యాలయాల్లో కాగితాలకే పరిమితం కావడం, తోటి విద్యార్థులతో అనవసరమైన, అనారోగ్యకరమైన పోటీ, అకడమిక్ ఒత్తిడి, మూల్యాంకనంలో పారదర్శకత లేకపోవడం, ఆరుగాలం కష్టపడి తమ కుటుంబాలను కష్టాల కడలిలోకి తోసి ఫీజుల భారాన్ని భరించి ఉన్నత చదువుల కోసం ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చేర్పించిన తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలు నెరవేర్చే స్థాయిలో మార్కులనూ, ర్యాంకులనూ సంపాదించి క్యాంపస్ ఉద్యోగాలను సంపాదించి వారి డాలర్ల కలలను నెరవేర్చలేమోననే తీవ్రమైన మానసిక భావనలు విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. తీవ్రమైన ఒత్తిళ్లలో ఉన్న సమయంలో బాధిత విద్యార్థులకు అవసరమైన స్వాంతనను సమకూర్చి వారికి అవసరమైన మనోధైర్యాన్ని నింపేమద్దతు వ్యవస్థ అందుబాటులో లేకపోవడం. అత్యంత వెనుకబడిన గ్రామాలు, తండాలు, ఏజన్సీ ఏరియా లతో పాటు చిన్న చిన్న పట్టణాల నుండి వచ్చిన మొదటి తరంగ్రాడ్యుయేట్లకు క్యాంపస్ సంస్కృతికి అలవాటు పడటానికి, ఇంగ్లీష్ భాషా బెరుకును అధిగమించడానికి తగిన శిక్షణను, కౌన్సెలింగ్‌ని ఇవ్వడం ద్వారా ఆ విద్యార్థులకు అవసరమైన మానసిక సామర్థ్యాన్ని అందించే మెంటార్ షిప్ వ్యవస్థ లేకపోవడం ఆ సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులను మానసికంగా బలహీనులుగా మారుస్తోంది. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉన్నత విద్యా సంస్థలలో జరుగుతున్న ప్రతి ఆత్మహత్య తర్వాత ప్రభుత్వాల తీరు ఒకేలా ఉంటుంది. ఎమ్మెల్యేలు, యం.పి.లు, మంత్రులూ, ముఖ్యమంత్రులూ, ప్రధాన మంత్రి, రాష్ట్రపతి వరకు పాలకులంతా అత్యంత బాధాకరమైన ఆత్మహత్యలపట్ల తీవ్రమైన విచారాన్ని ప్రకటించడం, మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతినీ, సంతాపాన్ని తెలియజేయడంతోపాటు ఎంతో కొంత నష్ట పరిహారాన్ని అందించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. తదనంతరం ఒక విచారణ కమిటీ, ఒక టాస్క్ ఫోర్స్, కొన్ని మార్గదర్శకాలు. యూజీసీ 2012 లోనే కులవివక్ష నిరోధానికి రెగ్యులేషన్స్ తెచ్చింది. సుప్రీంకోర్టు సైతం పలు మార్లు ఎన్నోప్రామాణిక ఆదేశాలు ఇచ్చినా, వాటిని అమలు పరచాల్సి న అధికార యంత్రాంగంలో చిత్తశుద్ధి లోపించి ఆత్మహత్యలు ఆగడంలేదేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తు తోంది. ఫిర్యాదుచేస్తే తమ కెరీర్ నాశనమవుతుందనేభయం విద్యార్థులను నీడలా వెంటాడుతోంది. విచారణ కమిటీల్లో ఆయా సంస్థల అధిపతులే ఉండటంతో పాటు విచారణను ప్రభావితం చేసే అవకాశం ఉండడంవల్లే బాధితులకు న్యాయం జరగడంలేదనే అభిప్రాయం కూడా ఉంది. రోహిత్ వేముల చట్టంఅమలు కోసం విద్యార్థి సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను ఇకనైనా ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించాలి. ప్రతి ఉన్నత విద్యాసంస్థలో స్వ తంత్ర, విద్యార్థి ప్రాతినిధ్యం కలిగిన ఫిర్యాదు పరిష్కార సెల్, బయటి నిపుణులతో కూడిన విచారణ వ్యవస్థ, తప్పనిసరి మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్, ఫ్యాకల్టీలకు సామాజిక న్యాయ సున్నితత్వ శిక్షణ ఏర్పాటు చేయాలి. వీటికి అదనంగా తల్లిదండ్రులు సైతం తమ డాలర్ల కలలను నిజం చేసుకునే తొందరలో తమపిల్లల పై అనవసరమైన మానసిక ఒత్తిళ్లకు పూనుకోరాదు.

# ప్రకృతి విపత్తుల పట్ల అప్రమత్తత అవసరం

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

ప్రకృతి వైపరీత్యాలు జరుగుతూనే ఉంటాయి. కనీసం శతాబ్దానికి ఒకసారి కరోనా లాంటి మహమ్మారులు చుట్టు ముడుతూనే ఉండవచ్చని వింటున్నాం. ప్రకృతి వైపరీత్యాలను ముందు ఊహించడం చాలా సందర్భాలలో వీలు కాదు. మానవ తప్పిదాలతో ప్రాణ ఆస్తినష్టాలు తరుచుగా చూస్తున్నాం. గతంలో విశాఖపట్నం సమీప వెంకటాపురం గ్రామంలో యల్‌జి పాలిమర్స్ పరిశ్రమ నుండివిడుదలైన స్టైరిన్ వాయు లీకేజీ కారణంగా 11మంది మరణించగా, 1000కి పైగా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలైనారు. ఈ మానవ నిర్లక్ష్యానికి 3 కిమీ పరిధిలోని ఐదు గ్రామాలు ప్రభావితం కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారంతో పాటు పునరావాసానికి 30 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. ఇలాంటి సహజ, మానవ కారణ విపత్తులు జరిగినప్పుడు ఆస్తి ప్రాణనష్టాలను తగ్గించే ప్రయత్నాలు చేయడం, ఉపశమన చర్యలు తెలుసుకోవడం, క్షతగాత్రుల ను రక్షి ంచి వైద్యసదుపాయాలు కల్పించడం, విపత్తుప్రమాద నిర్వహణలో సుశిక్షి తులైన బలగాలు సత్వరమే స్పందించడం మాత్రమే మన అధీనంలో ఉంటుంది. 2011లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన 302 విపత్తుల్లో 80,000 మరణాలు, 206 మిలియన్ల ప్రజలు ప్రభావితం అయినారు. ఈ విపత్తులు మిగిల్చిన నష్టం 2ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. సహజ (నాచురల్), మానవ కారణ (మ్యాన్ మేడ్) విపత్తులు జరిగినప్పుడు వెంటనే స్పందిస్తూ తీసుకోవలసిన చర్యలను, నష్ట నివారణ పద్ధతులు, విపత్తు నిర్వహణ గూర్చి కనీస పరిజ్ఞానాన్ని అందించాలనే లక్ష ్యం తో ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో ప్రపంచ దేశాల్లో 13 అక్టోబర్‌న 'అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం' పాటించడం జరుగుతోంది. 1989 ఐరాస పిలుపు మేరకు విపత్తుల తీవ్రతను తగ్గించడం, నివారించ డం, స్పందించడం, ధైర్యాన్నినూరిపోయడం, తిరిగి యథా స్థితికి తీసుకురావడం, ఎదుర్కొనే సంసిద్ధత కలిగి ఉండడంలాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తు ప్రమాద నియంత్రణ మార్గాలను శోధించే వేదికగా అంతర్జాతీయ విపత్తు తగ్గింపుదినాన్ని తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం 2026నినాదంగా స్థిత ప్రజ్ఞత ఇంటి నుంచే ప్రారంభం కావాలి అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల్లో భూకంపాలు, వరదలు, తుఫానులు, సునామీలు, సూక్ష్మమహమ్మారి కల్లోలాలు, జునోటిక్ వ్యాధులు, వడగాలులు, మంచు తుఫానులు, ఇసుక తుఫానులు, అగ్ని పర్వత విస్ఫోటనాలు, అసాధారణ సముద్ర అలలు, నేల కోతలు, కరువులు, మంటలు, రేడియోధార్మిక వాయువుల వ్యాప్తి, హిమపాతాలు, కొండచరియలు విరిగి పడడం లాంటివి వస్తాయి. మానవ కారణ విపత్తుల్లో భోపాల్ వాయు దుర్ఘ టన లాంటివి, సముద్రజలాల్లో పెట్రోలియం లీకేజ్, చెర్నో బిల్ అణువిస్ఫోటనం, భూతాపంతో మంచుకొండలు కరగటం లాంటివి వస్తాయి. వైపరీత్యాల తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు ప్రాణనష్టం వేలల్లో, గాయపడిన వారు లక్షల్లో, ఆస్తి నష్టం కోట్లల్లో ఉంటుంది. విపత్తు నిర్వహణలోప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధానమైంది. క్షతగాత్రులకుసత్వర వైద్య సదుపాయాల కల్పన, నిరాశ్రయులకు తాత్కాలిక శిబిరాల ఏర్పాటు, జంతువుల పరిరక్షణ, ఆస్తులను కాపాడుతూ నష్టాన్ని తగ్గించడం, అత్యవసర సరుకుల రవాణా వ్యవస్థలను నెలకొల్పడం లాంటి చర్యలను తీసుకోవాలి. విశ్వమహామ్మారులైన సూక్ష్మజీవుల విజృంభన, వాతావరణ ప్రతికూలతలు, ప్రకృతి వైపరీత్యాలు, జరిగినప్పుడు సత్వర పౌర స్పందనతో అపార ప్రాణఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చు. అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, సునామీల, భూకంపాలు లాంటివిపత్తులు జరిగినప్పుడు మానవ, జంతు ప్రాణనష్టం, ఆస్తిధ్వంసం, ప్రకృతి వినాశనం పెద్ద ఎత్తున స్వల్ప వ్యవధిలోనే జరిగిపోతుంది. ఇండియాకు ఒక ప్రత్యేకమైన జాతీయ విపత్తు నియంత్రణ ప్రణాళిక ఉండాలని, దానిని 2016లో రూపొందించిన ఘనత ప్రస్తుతకేంద్ర ప్రభుత్వానికేదక్కింది. దీనిలోభాగంగా ప్రత్యేకమైన జాతీయ విపత్తు స్పందనదళం సహాయం తీసుకోవడం జరుగుతోంది. విపత్తు ప్రమాదఅవగాహన, విపత్తుప్రమాద నిర్వహణ, పర్యవేక్షణ యంత్రాంగం, విపత్తు నష్టాన్ని తగ్గించడానికి పెట్టుబడులు, విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటూ ముందస్తు హెచ్చరికలు చేయడం అనేనాలుగు సూత్రాల మీద భారతవిపత్తు నిర్వహణ ప్రణాళికను అభివృద్ధి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు జరగకూడదని, జరిగినా ముందస్తు హెచ్చరికలతోజరగబోయే

# ప్రజావాక్కు



### శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను 'సర్' అనే ఓటర్ల జాబితాలో అనేక అవకతవకల వల్ల కోట్లాది ఓట్లు గల్లంతయ్యాయని, ఆ కారణంగా సి.ఇ.సి. వెంటనే రాజీనామా చేయాలని లేక అభిశంసన ద్వారా తొలగించాలని క్రాక్రోచ్ జనతా పార్టీ వారితోబాటు ఇండియా కూటమి పార్టీలవారు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు చేస్తూ పరిస్థితిని ఉధృతం చేస్తున్నారు. ప్రభుత్వం ఓ పరిష్కారం కనుగొనకుండా సుమారు ఏడువేలమంది ఉద్యమకారుల ను అరెస్టు చేయడం జరిగింది. ఇది చినికి చినికి హింసాత్మక రూపందాలుస్తుందేమోనని సందేహాలు కలుగుతున్నాయి. కొన్నిబిజెపేతర ఉత్తర, దక్షిణరాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు కూడా ఆందోళనకారులకు మద్దతివ్వడంతో ఈ వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది. పరిస్థితి చేయదాటకుండా ప్రభుత్వం మౌనాన్ని వీడి ఆందోళనను శాంతియుతంగా పరిష్కరించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఎఐ అనుభవాన్ని అధిగమిస్తుందా?

నేడు కార్యాలయాలు, పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో తరచుగా వినిపిస్తున్న చర్చకృత్రిమ మేధసు(ఎఐ) అనుభవాన్నిఅధిగమిస్తుందా అనే ప్రశ్న. అయితే ఈచర్చను అనుభవం వర్సెస్ ఏఐగా చూడడం సరైన దృక్పథం కాదు. ఎందుకంటే ఈ రెండింటిలో ఏదీఒంటరిగా సంపూర్ణ పరిష్కారం అందించలేవు. ఇరవై లేదా ముప్పై సంవత్సరాల అనుభవం కలిగిన ఒక సీనియర్ అధికారి వ్యాపార నిర్ణయాల్లో లోతైన అవగాహన కలిగిఉండవచ్చు. కానీ ఆధునిక ఏఐ వ్యవస్థలు ఎలా పని చేస్తాయో తెలియకపోతే, కొత్త అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేడు. అదే సమయంలో అత్యాధునిక డిజిటల్ సాధనాలపై పట్టు ఉన్న యువ నిపుణుడు, అనుభవంతో వచ్చేవిచక్షణ, దీర్ఘకాలిక దృష్టి లేకపోతే సరైన నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బంది పడవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రైలు ముఖచిత్రాన్ని మార్చాలి

వచ్చేయేడాది మే, జూన్‌లలో బుల్లెట్ రైలు పట్టాలెక్కనున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న తొలి హైస్పీడు రైలు బాడీ ఫ్రేం పూర్తయిందని తెలిపారు. పత్రికల్లో వచ్చిన చిత్రంలో దూసుకుపోతున్నట్లు కనిపిస్తోంది. కానీవరాహం ముఖచిత్రం అమర్చేరు. వరాహం బదులు అశ్వాన్ని రూపొందించాలి.

-వి.ఆర్.ఆర్. ఎ.రాజు, హైదరాబాద్

### మద్యం మత్తులో డ్రైవింగ్ వద్దు

ప్రైవేటు బస్సులు, లారీలు నడిపే డ్రైవర్లు రహదారి భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి. కొందరు డ్రైవర్లు అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో పాటు మద్యం మత్తులో వాహనాలు నడపడంవల్లప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల కారణంగా అమాయక ప్రయాణికులు, ఇతర వాహన దారులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. కొన్నిసార్లు డ్రైవర్లు సైతం ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవ హరించాలి. ప్రయాణ సమయంలో డ్రైవర్లు మద్యం సేవించకూడదు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూవాహనాలను నడపాలి. నిర్ణీత వేగపరిమితులను పాటిస్తూ, వాహనాల పరిస్థితినిఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. ప్రయాణానికి ముందు డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితి, అప్రమత్తతపై యాజమాన్యాలు కూడా శ్రద్ధ చూపాలి. రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, మద్యంసేవించి వాహనాలు నడపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. మన జాగ్రత్తే మన ప్రాణాలకు రక్ష, ఇతరుల ప్రాణాలకు భరోసా.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### యువతతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఢిల్లీ మొత్తం బంధు అయిపోయింది. అక్కడకక్కడ బారికేడ్లు దర్శనంఇస్తున్నాయి. ఒకవేల ప్రభుత్వంనుండి తప్పు జరగలేదు అనుకుంటే ఇన్ని ఆంక్షలు ఎందుకు? ఇంత నిర్బంధం ఎందుకు?అర్థరాత్రి ఇన్నారిల్స్ చేయాల్సి న అవసరం ఏముంది? ఈపరిణామాలు అన్ని గమనిస్తున్నావారికి అర్థం అయ్యేది ఒకటే ప్రభుత్వం ఆత్మరక్షణలో ఉందని. జ్ఞానేష్ సెలువులపై వెళ్లారని చెపుతున్న ఆయన రాష్ట్రాలా పర్యటనలు రద్దు చేసుకుంటున్నారు. అంటేనే బొద్దింకలు అనబడే యువతకు ప్రభుత్వంకానీఆయనకానీ బయపడిపోయారుఅనిఇప్పుడేదేశంఅర్థం చేసుకుంటుంది. ఇన్ని జరుగుతున్నా ప్రభుత్వం చేస్తున్న తప్పులను సరిదిద్దు కోవాలి. లేకపోతే యువతకు మొత్తమే దూరం అయిపోయే ప్రమాదం ఉంది.

- భారత అవినాష్, జనగామ

### భక్తి శ్రద్ధలతో చేసుకుందాం

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న దుర్గామాత వేడుకలను అత్యంత భక్తిభావంతోవేడుకలను నిర్వహించుకోవాలి. రాజకీయాలకు అతీతంగా ప్రజలందరూ ఒకేచోట సామరస్య బద్ధంగా సజావుగా ముందుకు సాగాలి. నిర్వహణ సమయంలో తగు జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి పునాది!



కాలగిరి శ్రీనివాసరెడ్డి

ఎన్నికల్లో ఎవరు గెలిచారు? ఎవరు ఓడిపోయారు? అన్నదానికంటే ముందు ఒక ప్రశ్నకు సమాధానం ఉండాలి. ఎవరు ఓటువేయగలిగారు? ఎందుకంటే ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రజాస్వామ్యంలో పౌరుడి గొంతుకకు గొళ్లెం వేసినట్లే. అది పౌరుడి రాజకీయ హక్కుకు పునాది. ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై సాగుతున్న వివాదం ఎన్నికల సంఘం విశ్వసనీయతతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థ పారదర్శకతపైనా కీలక ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఈ వివాదం సుప్రీం కోర్టు ముందుకు వెళ్లింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కొన్ని నిర్ణయాలను ఇతర ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండానే తీసుకున్నారన్న ఆరోపణలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయ మూర్తులు జోయ్‌మాల్య బాగ్చి, వి.మోహానాలతో కూడిన ధర్మాసనం విచారించింది. అయితే కోర్టు ఈ దశలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను సస్పెండ్ చేయలేదు. ఆరోపణలను నిజమని గానీ, అబద్ధమని గానీ తేల్చలేదు. బదులుగా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి తదితరుల నుంచి సమాధానాలు కోరింది. ఇదే విచారణలో అత్యంత ముఖ్యమైన అంశం. పిటిషనర్లవాదన మాత్రం తీవ్రంగా ఉంది. గత పది నెలల్లో ఎన్నికల జాబి తాలు, కొత్త ఓటర్ల నమోదు, సాంకేతిక వ్యవస్థలకు సంబంధించిన పలు నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారని వారు చెబుతున్నారు. బహుళ సభ్యుల ఎన్నికల సంఘంలో నిర్ణయాలు సామూహికంగా తీసుకోవాల్సి ఉండగా, ఒక వ్యక్తి ఆధిపత్యంలో నిర్ణయాలు జరిగాయా? అన్నదే వారి ప్రధాన ప్రశ్న. అయితే ఇవి పిటిషనర్ల ఆరోపణలే తప్ప సుప్రీంకోర్టు ధృవీకరించిన వాస్తవాలు కావు. అసలు రికార్డులు బయటకు వచ్చిన తర్వాతే నిజానిజాలు స్పష్టమవుతాయి. ఫారం-6 వ్యవహారం కూడా ఈ వివాదంలో మరో కీలక అంశంగా మారింది. కొత్తఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేశారన్న అభ్యంతరాలపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తన అనుమతి లేకుండా మార్చిన ఫారం-6ను తాను ఆమోదించలేదని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో ఉపయోగించే ప్రతి పత్రానికి చట్టపరమైన ఆధారం ఉండాలి. నియమాలు మార్చితే ఆ మార్పుకు ఎవరు అనుమతి ఇచ్చారు?ఏ నిబంధన ఆధారంగా మార్చారు? నిర్ణయం తీసుకున్న విధానం




ఏమిటి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఉండాలి. ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు చట్టబద్ధంగానే జరిగాయని చెబుతోంది. ముసాయిదా దశలో అధికారుల మధ్య అభిప్రాయ భేదాలు ఉండటం సహజమని, అవి తుది నిర్ణయాలపై సంస్థాగత విభేదాలుగా పరిగణించరాదని వివరిస్తోంది. ఎస్ఐఆర్ షెడ్యూల్ వంటి కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఇసి వాదిస్తోంది. అంటే ఒకవైపు పిటిషనర్ల ఆరోపణలు, మరోవైపు ఎన్నికల సంఘం వివరణ. ఈ రెండింటి మధ్య అసలు నిజాన్ని నిర్ణయించాల్సింది రాజకీయ వేదికలు కాదు. రికార్డులు, చట్టం, న్యాయపరమైన పరిశీలనే. ఇదే సమయంలో ఓటర్ల పేర్ల తొలగింపుపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతోంది. భారీ సంఖ్యలో పేర్లుతొలగించబడ్డాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల సంఘం మాత్రం చెల్లని, పునరావృత, మరణించినలేదా ఇతర కారణాలతో అనర్హమైన నమోదులను తొలగించడం అవసరమని చెబుతోంది. రెండు వాదనల్లోనూ ఒక వాస్తవం ఉంది. ఓటరు జాబితా శుద్ధి చేయకపోతే ఎన్నికల విశ్వసనీయత దెబ్బతింటుంది. కానీ శుద్ధిపేరుతో ఒక్కఅర్హుడి పేరు తప్పుగా తొలగినా అతని ఓటు హక్కు ఆ ఎన్నికకే శాశ్వతంగా కోల్పోయినట్టే. అందుకే పేరు తొలగించడం కంటే ముందు పౌరుడికి సమాచారం ఇవ్వడం, అభ్యంతరం చెప్పే అవకాశం కల్పించడం, అప్పీల్‌హక్కు ఇవ్వడం అత్యవసరం. డిజిటల్ వ్యవస్థలో మార్పుజరిగితే దానికి స్పష్టమైన ఆడిట్ ట్రయిల్ ఉండాలి. ఎప్పుడు ఎవరు ఏ మార్పు చేశారో రికార్డులోఉండాలి. ఎన్నికల వ్యవస్థలో సాంకేతికత పెరుగుతున్నకొద్దీ జవాబుదారీతనం కూడా పెరగాలి. ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తడం ప్రజాస్వామ్యంలో సహజం. అదే సమయంలో ఎన్నికల సంఘంపై వచ్చిన ప్రతి ఆరోపణను నిజమని భావించడం కూడా సరైందికాదు. ఎన్నికల సంఘం రాజ్యాంగసంస్థ కాబట్టి దాని స్వతంత్రతను కాపాడటం ఎంతముఖ్యమో, దాని నిర్ణయాల్లో పారదర్శకతను నిర్ధారించడం కూడా అంతే ముఖ్యం. సంస్థపై విశ్వాసం కేవలం రాజ్యాంగ హోదాతో రాదు. ప్రజలకు కనిపించే పారదర్శక చర్యలతోవస్తుంది. సుప్రీంకోర్టు ఈరోజుతీసుకున్న వైఖరి కూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. కోర్టు వెంటనే ఎవరినీ దోషిగా తేల్చలేదు. తక్షణ సస్పెన్షన్ కూడా విధించలేదు. కానీ ఆరోపణలను పక్కన పెట్టకుండా సంబంధిత సంస్థల నుంచి సమాధానాలు కోరింది. అంటే ఇకపై రాజకీయ నినాదాల కంటేఆధారాలు, ఫైల్ నోటింగ్స్, సమావేశాల రికార్డులు, నిర్ణయ ప్రక్రియ, చట్టపరమైన నిబంధనలే కీలకం కానున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం ఒకబటన్ నొక్కడం కాదు. అది ఒక పౌరుడిస్వరం. ఆ స్వరం వినిపించడానికి ముందే ఓటరుజాబితాలో అతని పేరు సురక్షి తంగా ఉండాలి. అదే సమయంలో నకిలీ ఓట్లు, ద్వంద్వ నమోదు లు, అనర్హులపేర్లు కొనసాగకుండా చూడటం కూడాఎన్నికల సంఘం బాధ్యతే. కాబట్టి లక్ష ్యం ఎక్కువ పేర్లు తొలగించ డం కాదు, అర్హుడైన ప్రతిపౌరుడి పేరు కాపాడుతూ, అనర్హ నమోదులను చట్టబద్ధంగా తొలగించే విశ్వసనీయ వ్యవస్థను నిర్మించడం. ఎన్నికల్లో గెలిచే పార్టీ మారవచ్చు. ప్రభుత్వాలు మారవచ్చు. నాయకులు మారవచ్చు. కానీ ఓటుపై ప్రజల నమ్మకం మాత్రం దెబ్బతినకూడదు. ఎందుకంటే ఎన్నికల ఫలితాన్ని ఓడిపోయిన పార్టీ ప్రశ్నిం చడం ఒక రాజకీయ

# 200 మంది అధికారులు టచ్‌లో ఉన్నారు!

## జ్ఞానేశ్‌కుమార్ నుంచి ఎస్‌ఎంఎస్‌లు వస్తున్నాయి

## విపక్ష కూటమి నేత రాహుల్‌గాంధీ సంచలన ప్రకటన





**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన తనకు సందేశాలు పంపిస్తున్నారని వెల్లడించారు. మీరు చేసిన తప్పును అంగీకరించి అపూర్వంగా మారండి. మీరు ప్రధాన నేరస్థుడు కాదు. మీ వెనుక అసలు సూత్రధారులు ఉన్నారు అని జ్ఞానేశ్ కుమార్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్ష కూటమి చేపట్టిన మార్చ్ ముందు మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జ్ఞానేశ్ కుమార్ తనను సంప్రదించారా సందేశాలు పంపారా అని ఓ విలేకరి అడగ్గా రాహుల్ అవునని సమాధానమిచ్చారు. తాను నిర్వహిస్తున్న మీడియా సమావేశాన్ని కూడా ఆయన చూస్తున్నారని వ్యాఖ్యానించారు. తనకు వచ్చిన సందేశాల్లోని వివరాలను మాత్రం వెల్లడించలేదు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఒత్తిడితోనే సీఈసీ వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆయన ఆధారాలను మీడియా ముందు వెల్లడించలేదు. ఎన్నికల సంఘంపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు మార్చ్ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయంటూ రాహుల్ గతంలోనూ ఆరోపణలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత దెబ్బతింటోందని విమర్శించారు. సీఈసీని తొలగించాలని, ఎన్నికల వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని సుమారు 200 మంది అధికారులు ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారని రాహుల్ తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), విదేశాంగ శాఖకు చెందిన అధికారులు కూడా ఇందులో ఉన్నారని పేర్కొన్నారు. వారే తమకు సమాచారం అందిస్తున్నారని తెలిపారు. ఈ వాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తాను ఎన్నికల నిష్పక్షపాతంపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశామని రాహుల్ చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి రాజకీయాలకు అతీతంగా మద్దతిస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తమ ఆందోళన ఆగదని రాహుల్ ప్రకటించారు.

### సిఇసి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు: రాహుల్

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై కొనసాగుతున్న నిరసనలతో ఆయనకు నిద్రలేని రాత్రులు గడుస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఈ ఉద్యమం ద్వారా సీఈసీ రాజీనామా చేసేలా చేస్తామని స్పష్టం చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కాపాడుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించడం వెనుక ఉద్దేశం అదే అని పేర్కొన్నారు. మా వ్యూహం వేరు. అక్కడ పోలీసుల వలయం ఉండాలని మేం కోరుకుంటున్నాం. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ రక్షిస్తున్నారనే విషయం దేశానికి తెలియాలి అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రాంతాల్లో 20 వేల నుంచి 30 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించినా తమకు అభ్యంతరం లేదని రాహుల్ అన్నారు. ఇంత భారీగా బలగాలను మోహరించడం ద్వారా ప్రభుత్వం సీఈసీకి అండగా నిలుస్తోందనే సందేశం ప్రజల్లోకి వెళ్తుందని పేర్కొన్నారు.

# జంతర్‌మంతర్ వద్ద ప్రదర్శనలపై నిషేధం

## కొత్తగా మూడు ప్రాంతాలు ఎంపిక




**న్యూఢిల్లీ,అక్టోబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌ను ఇకపై దాని కోసం వినియోగించడానికి వీలు లేదు. నిరసనల కోసం మూడు కొత్త ప్రాంతాలను నిర్దేశించారు. తూర్పు ఢిల్లీలోని రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్ నిరసనల వేదికలు కానున్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఒక కమిటీ సిఫార్సుల ఆధారంగా వీటిని ఖరారు చేశారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశిత ప్రదేశంగా గుర్తించే హోదాను రద్దు చేస్తూ ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సిఫార్సుల ఆధారంగా, నిరసన వేదికగా జంతర్ మంతర్‌కు ఉన్న గుర్తింపును రద్దు చేశారు. నిరసనలు లేదా ప్రదర్శనలు నిర్వహించడానికి రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానం అనే మూడు కొత్త ప్రదేశాలను నిర్దేశించారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మూడు కొత్త ప్రదేశాలలో నిరసనలు నిర్వహించడానికి సంబంధించిన ప్రామాణిక కార్యనిర్వహణ విధానాలను వేర్వేరుగా జారీ చేస్తామని ఢిల్లీ పోలీసులు తెలిపారు. మరోవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్షాలతో పాటు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలను ఉధృతం చేశాయి. దీంతో గత రెండు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. అక్కడకు చేరుకుంటున్న వారిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పటి వరకు నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌కు ఆ గుర్తింపును రద్దు చేయడం ప్రాధాన్యత సంతరించుకున్నది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకించే అవకాశమున్నది. ఆందోళనకారులు పాటించాల్సిన భద్రతా నియమాలు, ముందస్తు అనుమతుల ప్రక్రియ, సౌండ్ పరిమితులు, హాజరయ్యే నిరసనకారుల సంఖ్య, సమయం.. వంటి గైడ్‌లైన్స్ అన్నీ కూడా వీటిల్లో పొందుపరచనున్నారు. ఢిల్లీ నడిబొడ్డున ఉండటం, పార్లమెంట్ భవనం, ప్రధాన మంత్రిత్వ శాఖల కార్యాలయాలకు అతి సమీపంలో ఉండే జంతర్ మంతర్ వద్ద నిరంతరం ధర్నాలు జరగడం వల్ల రవాణా సమస్యలు తలెత్తుతున్నాయని కేంద్రం భావిస్తోంది.

# ఆమోదమూ లేదు.. తిరస్కరణా లేదు

## ఫాం - 6పై స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం సందర్భంగా కొత్త ఓటర్లను చేర్చేందుకు ఉద్దేశించిన ఫామ్ 6లో మార్పులు చేశారు. ఈ మార్పులపై కేంద్ర ఎన్నికల సంఘంలో ఎన్నికల కమిషనర్లు వివేక్ జోషీ, సుఖ్ బీర్ సింగ్ సంధూ అభ్యంతరం తెలిపారు. దీంతో ఎన్నికల సంఘం వాటిని సుప్రీంకోర్టు ఆమోదంతోనే చేపట్టినట్లు వివరణ ఇచ్చింది. అయితే ఆ తర్వాత ఫామ్ 6 మార్పులపై దాఖలైన పిటిషన్ పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గతంలో ఫామ్ 6 మార్పులను తాము కేవలం ఆమోదించలేదని మాత్రమే చెప్పిన సుప్రీంకోర్టు అలాగని వాటిని తిరస్కరించలేదని సోమవారం ప్రకటించింది. ఈసీ పనితీరులో జరిగిన అవకతవకల ఆరోపణలపై సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన మరో పిటిషన్‌పై గతంలో జరిగిన విచారణలో భారత ప్రధాన న్యాయమూర్తి చెప్పిన విషయాన్నే జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి మౌఖికంగా పునరుద్ఘాటించారు. ఫారం 6కు చేసినట్లు చెబుతున్న ఏ మార్పులనూ తాము ఆమోదించలేదని ఆయన అన్నారు. తమ తీర్పులో ఫారం 6కు చేసిన అటువంటి ఏ మార్పునూ మేము ఆమోదించలేదని సీజేఐ చెప్పారని గుర్తుచేశారని పిటిషనర్ ప్రియా మిశ్రా తరఫున ఈసీ పనితీరులో సీఈసీ జ్ఞానేష్ కుమార్ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలను సవాలు చేసిన న్యాయవాది నరేంద్ర మిశ్రాతో జస్టిస్ బాగ్చి అన్నారు. మొత్తం మీద ఇవాళ సుప్రీంకోర్టు మరో జడ్జి చేసిన వ్యాఖ్యలతో ఈసీకి కొంత మేర ఊరట దక్కినట్లయింది.

# కపిల్‌సిబల్ విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకే ఉన్నాం

## జంతర్‌మంతర్ అరెస్టులపై స్పందించిన సుప్రీం



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** న్యాయవ్యవస్థపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యక్తం చేసిన అసంతృప్తిపై సుప్రీంకోర్టు అసాధారణ రీతిలో స్పందించింది. ఈ వ్యవస్థపై సిబల్ విశ్వాసాన్ని పునరుద్ధరించడానికే మేమిక్కడున్నామని వ్యాఖ్యానిస్తూ, ఆయన నమ్మకాన్ని తిరిగి నిలబెడతామని స్పష్టం చేసింది. ఢిల్లీలో పోలీసుల ఆంక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ జరిపిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, పలువురిని నిర్బంధంలోకి తీసుకోవడంపై కపిల్ సిబల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలపై పదేపదే సుప్రీంకోర్టును ఆశ్రయించి అలసిపోయానని, ఇక కోర్టుకు వెళ్లడం వల్ల ప్రయోజనం లేదనిపిస్తోందని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం న్యాయవాదులు పోరాడుతూనే ఉండాలని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపితే ప్రభుత్వానికే ప్రమాదం ఉన్నట్టుందనిపిస్తోందని సిబల్ విమర్శించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించడాన్ని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక, పశ్చిమ బెంగాల్ నుంచి రైళ్లు, విమానాల్లో వస్తున్న వారిని కూడా మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు.

# జంతర్‌మంతర్ నిరసనలకు 24 గంటల్లో అనుమతించండి

## లేదంటే తదుపరి నిర్ణయం ప్రకటిస్తాం: సిజెపి హెచ్చరిక



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలు సోమవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. నిరసన తేదీ, సమయాన్ని పోలీసులే నిర్ణయించాలని కోరారు. దీనిపై స్పందించేందుకు 24 గంటల గడువు విధించారు. పోలీసులు సాధారణంగా నిరసనకు కనీసం పది రోజుల ముందే దరఖాస్తు చేసుకోవాలని చెబుతుంటారని, ఈసారి మాత్రం తేదీ, సమయాన్ని పోలీసులే ఖరారు చేయాలని కోరుతున్నట్లు సీజేపీ కార్యకర్త సౌరవ్ దాస్ తెలిపారు. ఈ మేరకు పోలీసులకు 24 గంటల అల్టిమేటం ఇచ్చినట్లు వెల్లడించారు. నిరసన తేదీపై పోలీసుల నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు పార్టీ నేత అశుతోష్ రంకా అన్నారు. అధికారులు స్పందించకపోతే 24 గంటల్లో మరో నిర్ణయం తీసుకుంటామని రంకా స్పష్టంచేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని సౌరవ్ దాస్ చెప్పారు. ప్రజలు ఇప్పటికే ఆ హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. నిరసనకు పదిరోజుల ముందే సమాచారం ఇవ్వాలంటూ పోలీసులు పదేపదే చెబుతున్నారని తెలిపారు. అందుకే ఈసారి నిరసన తేదీ, సమయాన్ని నిర్ణయించే బాధ్యతను పోలీసులకే అప్పగిస్తున్నట్లు చెప్పారు. అయితే ఈ వ్యవహారాన్ని నిరవధికంగా పెండింగ్‌లో ఉంచేందుకు అంగీకరించబోమని దాస్ స్పష్టంచేశారు. పోలీసులు స్పందించేందుకు 24 గంటల సమయం ఇస్తున్నామని తెలిపారు. గడువు ముగిసిన తర్వాత తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని పార్టీ నేతలు వెల్లడించారు.

# అగ్రరాజ్యాల్లో పేదల ఆదాయమే ఎక్కువ!

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** ఒక దేశంలో అత్యంత పేదలుగా ఉన్నవారి ఆదాయం మరో దేశంలో అత్యంత సంపన్నులుగా ఉన్నవారి ఆదాయం కంటే ఎక్కువగా ఉంది. ప్రపంచ బ్యాంకు గణాంకాలప్రకారం అమెరికా, కెనడా, జర్మనీ వంటి సంపన్న దేశాల్లో దిగువ 10 శాతం ప్రజల ఆదాయ స్థాయి భారత్‌లో ఎగువ 10 శాతం ప్రజల స్థాయిని మించిపోయింది. దేశాల మధ్య జీవన ప్రమాణాల్లో ఉన్న వ్యత్యాసాన్ని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు 2026 పేదరికం, అసమానతల గణాంకాల ప్రకారం భారత్‌లో దిగువ 10 శాతం ప్రజల రోజువారీ ఆదాయం లేదా వినియోగ స్థాయి ఒక్కో వ్యక్తికి సుమారు 3 డాలర్లు. అదే ఎగువ 10 శాతం ప్రజల విషయంలో ఈ స్థాయి రోజుకు 10 డాలర్లుగా ఉంది. భారత ఆర్థిక సర్వే ప్రకారం నెలకు రూ.80 వేల ఆదాయం ఉన్న వ్యక్తి కూడా దేశంలోని అత్యధిక ఆదాయం పొందుతున్న 10 శాతం మందిలో ఉంటారు. అమెరికాలో దిగువ 10 శాతం ప్రజల రోజువారీ ఆదాయం లేదా వినియోగ స్థాయి 25 డాలర్లు. కెనడాలో 31 డాలర్లు కాగా జర్మనీ, ఆస్ట్రేలియాలో 28 డాలర్లుగా ఉంది. అంటే భారత్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న వర్గం స్థాయి కంటే ఈ దేశాల్లో దిగువ ఆదాయ వర్గాల స్థాయి కూడా ఎక్కువగా ఉంది.

అయితే ఇవి దేశాల మధ్య జీవన వ్యయాల తేడాలను సర్దుబాటు చేసిన గణాంకాలు. పేదరికాన్ని తగ్గించడం మాత్రమే సరిపోదని ఆర్థికాభివృద్ధి నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దేశ వ్యాప్తంగా ఆదాయాలు, ఉత్పాదకత పెరగాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. కొత్త ఆలోచనలకు అవకాశాలు కల్పించడం, వ్యాపా రాల విస్తరణకు అడ్డంకులు తగ్గించడం, మెరుగైన వేతనాలతో ఉద్యోగాలు పెంచడం కీలకమని పేర్కొంటున్నారు.

అప్పుడే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి సంపన్న దేశాలతో ఉన్న అంతరం తగ్గే అవకాశం ఉంటుంది.

# అమెరికాలో పెరుగుతున్న రుణ ఎగవేతలు!

**వాషింగ్టన్, అక్టోబరు 12:** అమెరికన్ కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఆదాయం, సంపద పెరుగుతున్నప్పటికీ, అధిక వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం కారణంగా అప్పుల భారం తీవ్రమవుతోంది. 2025 చివరి నాటికి, ప్రతి ఐదు అమెరికన్ కుటుంబాల్లో ఒకటి (దాదాపు20) రుణచెల్లింపుల్లో వెనుకబడినట్లు తేలింది. 2007-08 ఆర్థిక మాంద్యం తర్వాత 2010లో నమోదైన స్థాయికి మించి, రుణ ఎగవేతలు ఇంతటి గరిష్ఠ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. ఫెడరల్ రిజర్వ్ తాజాగా విడుదల చేసిన 2025 సర్వే ఆఫ్ కన్స్యూమర్ ఫైనాన్సెస్ (ఎస్‌సీఎఫ్) నివేదిక ఈ చేదు వాస్తవాలను వెల్లడించింది. 2022లో రుణచెల్లింపుల్లో వెనుకబడిన కుటుంబాల వాటా సుమారు 12 శాతంగా ఉండగా, మూడేళ్లలో ఇది 20 శాతానికి చేరింది. రెండు నెలలకు పైగా చెల్లింపులు చేయని వారి సంఖ్య 5 శాతం నుంచి 8 శాతానికి పైగా పెరిగింది. తమ ఆదాయంలో 40 శాతానికి పైగా రుణాలకే చెల్లించే కుటుంబాల వాటా 6.5 శాతం నుంచి 8.6 శాతానికి పెరిగింది. ఇది 2013 తర్వాత ఇదే అత్యధికం. ఆశ్చర్యకరంగా, ఇదే సమయంలో అమెరికన్ల సగటు ఆదాయం ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేసిన తర్వాత కూడా 7 శాతం పెరిగి 82,200 డాలర్లకు, సగటు నికర సంపద 2 శాతం పెరిగి 2,15,900 డాలర్లకు చేరుకుంది. అయితే, పెరిగిన వడ్డీ రేట్లు, అధిక ధరల పెరుగుదల వారి ఆనందాన్ని ఆవిరిచేశాయి. రుణాల చెల్లింపులు భారంగా మార డంతో ఆర్థిక ఒత్తిడి పెరిగింది. సుమారు 77 శాతం కుటుంబాలు ఏదో ఒక రూపంలో అప్పులు కలిగి ఉన్నాయి. ఈ ఆర్థిక అసమానతలు అన్ని వర్గాలపై ఒకేలా ప్రభావం చూపడం లేదు. అధిక ఆదాయ వర్గాల వారి సగటు నికర సంపద 31 శాతం పెరిగితే, 35 ఏళ్లలోపు వయసున్న యువ కుటుంబాల సగటు సంపద ఏకంగా 23 శాతం తగ్గి 33,000 డాలర్లకు పడిపోయింది. మరోవైపు, 75 ఏళ్లు పైబడిన వారి సంపద 37 శాతం పెరిగింది. దీంతో యువత తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ ఆర్థిక ఒత్తిడి నేపథ్యంలో అమెరికన్లు బై నౌ పే లేటర్ వంటి కొత్త తరహా రుణాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీని వినియోగం 7 శాతం నుంచి 12 శాతానికి పెరిగింది. బీఎన్‌పీఎల్ రుణం ఉన్న కుటుంబాల్లో సగటు బ్యాలెన్స్ 400 డాలర్లుగా ఉంది. క్రెడిట్ కార్డుల వినియోగం, వాటిపై ఉన్న బ్యాలెన్సులు కూడా పెరిగాయి. మొత్తంమీద, స్థూల ఆర్థిక గణాంకాలు సానుకూలంగా కనిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ముఖ్యంగా యువత, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. భవిష్యత్తులో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్న నమ్మకం ప్రజల్లో తగ్గుతున్నట్లు ఇతర సర్వేలు సూచిస్తున్నాయి.

# ఖైబర్‌ఫఖ్తూన్‌ఖ్వాలో అత్యవసరపరిస్థితి

## మంటల్లో గవర్నర్‌హౌస్

**పెషావర్, అక్టోబరు 12:** పాకిస్థాన్‌లో రాజకీయ సంక్షోభం తీవ్రరూపం దాలుస్తోంది. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించడంతో మొదలైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. గవర్నర్ హౌస్ మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మరోవైపు, పలు నగరాల్లో పోలీసులు కాల్పులు జరుపుతున్నట్లు కనిపిస్తున్న వీడియోలు కలకలం రేపుతున్నాయి. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ నేతృత్వంలోని ప్రావిన్షియల్ ప్రభుత్వాన్ని పక్కనపెడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించింది. దీంతో ఆదివారం పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఇస్లామాబాద్‌కు పీటీఐ తలపెట్టిన ర్యాలీకి కూడా భద్రతా చర్యలతో ఆటంకం ఏర్పడింది. గవర్నర్ హౌస్ మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ప్రావిన్స్‌లోని పలు ప్రాంతాల్లో పోలీసులు కాల్పులు, షెల్లింగ్ జరుపుతున్నట్లు మరో వీడియోలో కనిపిస్తోంది. అయితే గవర్నర్ హౌస్‌కు మంటలు ఎలా అంటుకున్నాయి ఎంతమేర ఆస్తి నష్టం జరిగింది ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. ప్రభుత్వ అణచివేత చర్యల్లో భాగంగా స్వాబీలో పీటీఐ కార్యకర్తలు 59 మందిని, ఖైబర్ జిల్లాలో మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది, పీటీఐ ప్రావిన్షియల్ అధ్యక్షుడు జునైద్ అక్బర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. మరో మాజీ ముఖ్యమంత్రి అలీ అమీన్ ఖాన్ గండాపూర్ తనను డేరా ఇస్మాయిల్ ఖాన్‌లోని నివాసంలో గృహనిర్బంధం చేశారని వెల్లడించారు. ప్రావిన్స్‌లోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై భద్రతా బలగాలను మోహరించారు. స్వాబీలో మొబైల్ ఫోన్, పీటీసీఎల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ప్రావిన్షియల్ పాలనపై పట్టు సాధించేందుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గవర్నర్ పాలన విధించడాన్ని ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది ప్రజాస్వామ్యంపై దాడి అని అభివర్ణించాయి. ఈ నిర్ణయాన్ని న్యాయస్థానాలతో పాటు ప్రజాక్షేత్రంలోనూ సవాలు చేస్తామని ప్రకటించాయి. ఎన్నికైన నాయకత్వాన్ని బలహీనపరిచేందుకే కేంద్రం ఈ చర్యలకు దిగిందని పీటీఐ ఆరోపించింది. అరెస్టయిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది.

# బాలిస్టిక్ క్షిపణులు పరీక్షించిన ఉత్తరకొరియా

**సియోల్, అక్టోబరు 12:** ఉత్తర కొరియా తన ఆయుధ సంపదను పెంచుకుంటోంది. తాజాగా పలు బాలిస్టిక్ క్షిపణులను ఆ దేశం పరీక్షించింది. తూర్పు సముద్ర జలాలపై వైపు ఇవాళ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా మిలిటరీ ఆరోపించింది. కొరియా దేశాల మధ్య ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. దక్షిణకొరియా సంయుక్త దళాల ప్రతినిధి జాంగ్ డో యుంగ్ మాట్లాడుతూ ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్యాంగ్ నుంచి పలు రకాల క్షిపణులను పరీక్షించినట్లు చెప్పారు. ప్రధాన విమానాశ్రయాన్నే గత కొన్నేళ్ల నుంచి కీలక లాంచింగ్ సైట్‌గా ఉత్తర కొరియా వాడుకుంటోంది. ఉత్తర కొరియా పరీక్షించిన ఓ క్షిపణి సుమారు 900 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జాంగ్ వెల్లడించారు. అయితే ఎన్ని క్షిపణులను డిటెక్ట్ చేశారన్న విషయాన్ని మాత్రం చెప్పలేదు. జపాన్ డిప్యూటీ రక్షణ మంత్రి తకాశి కోయరి మాట్లాడుతూ 17 నిమిషాల తేడాతో రెండు క్షిపణులను డిటెక్ట్ చేసినట్లు చెప్పారు. ఎకనామిక్ జోన్ బయటి ప్రదేశంలో ఉన్న జలాల్లో ఆ క్షిపణులు పడినట్లు తెలుస్తోంది. తొలి క్షిపణి సుమారు 220 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, రెండో క్షిపణి సుమారు 910 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జపాన్ అధికారి చెప్పారు. బహుశా హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించి ఉంటారని ఆయన అన్నారు. ఎయిర్‌క్రాఫ్ట్ కానీ నౌకలకు కానీ ఎటువంటి ఇబ్బందికాలేదన్నారు. అణు సామర్థ్యం కలిగిన ఆయుధాలను సిద్ధం చేసేందుకు ఉత్తర కొరియా సుదీర్ఘకాలంగా ప్రయత్నిస్తోంది.

# కుప్పకూలిన పాక్ ఆర్మీ శిక్షణ హెలికాప్టర్ : ఇద్దరు పైలట్లు మృతి



**క్వెట్టా, అక్టోబరు 12:** పాకిస్థాన్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. బలూచిస్థాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టా సమీపంలో పాకిస్థాన్ ఆర్మీకి చెందిన శిక్షణ విమానం కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగినట్లు పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలిపింది. క్వెట్టా జిల్లాలోని నవాన్ కిల్లీ ప్రాంతం సమీపంలో పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ముష్షాక్ శిక్షణ విమానం కూలిపోయింది. మధ్యాహ్నం సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సైన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఘటనలో ఇన్‌స్ట్రక్టర్ పైలట్ మేజర్ హుస్నైన్ షెహజాద్ హుమాయూన్, శిక్షణ పొందుతున్న పైలట్ కెప్టెన్ అబ్దుల్ సమద్ మరణించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలపై మరింత సమాచారం వెలువడాల్సి ఉంది. పైలట్ల మృతిపై అధ్యక్షుడు, ప్రధాని సంతాపం ఇద్దరు సైనిక పైలట్లు మరణించడంపై పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధ్యక్షుడు జర్దారీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

# సంక్షిప్త వార్తలు

## నిరసనల్లో తీవ్రంగా గాయపడిన అమీర్‌ఖాన్ మేనకోడలు!

**ముంబయి, అక్టోబరు 12:** ఆర్థిక రాజధాని నగరంలోజరిగిన సీజేపీ నిరసనలో పాల్గొని పోలీసుల అదుపులోకి వెళ్లిన బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మేనకోడలు, నటి జైన్ మేరీ ఖాన్ తనకు అయిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను పంచుకున్నారు. ఈ పరిణామం ఒకవైపు చర్చనీయాంశం కాగా, మరోవైపు ఇదే నిరసనలో పాల్గొన్న అమీర్ ఖాన్ మేనల్లుడు, నటుడు ఇమ్రాన్ ఖాన్‌పై కేసు నమోదు చేయాలని బీజేపీ నేత కిరీట్ సోమయ్య పోలీసులను ఆశ్రయించడం సంచలనంగా మారింది.

## సిఇసి జ్ఞానేశ్‌ను తొలగించాలంటూ కేరళ అసెంబ్లీ తీర్మానం



**తిరువనంతపురం, అక్టోబరు 12:** భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ కేరళ శాసనసభ సోమవారం తీర్మానాన్ని ఆమోదించింది. దేశంలో ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఎన్నికల సంఘం నిష్పక్షపాతంపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. 140 మంది సభ్యులున్న కేరళ శాసనసభలో 16వ అసెంబ్లీ రెండో సమావేశాల తొలిరోజున ఈ తీర్మానం ఆమోదం పొందింది. భారత ఎన్నికల ప్రక్రియ సమగ్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తీర్మానం స్పష్టం చేసింది.

## నేపాల్, బంగ్లా తరహాలో అస్థిరతకు కుట్ర

**న్యూఢిల్లీ,అక్టోబరు 12:** భారతదేశంలో నిరసనల పేరుతో నేపాల్, బంగ్లాదేశ్‌లో మాదిరిగా అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీనియర్ అడ్వకేట్, భారత మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే సంచలన ఆరోపణలు చేశారు. దేశంలో అశాంతిని రెచ్చగొట్టడంలో విదేశీ శక్తుల పాత్ర ఉండొచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మీడియా ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని నిరసన కార్యక్రమాలకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని తాను విశ్వసిస్తున్నట్లు సాల్వే తెలిపారు.

## 144 యేళ్ల తర్వాత బర్దా అడవుల్లోకి ఆసియా సింహాలు



**అహ్మదాబాద్, అక్టోబరు 12:** గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో ఉన్న బర్దా వన్యప్రాణుల అభయారణ్యంలో 144 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆసియా సింహాలు మళ్లీ అడుగుపెట్టాయి. ఒకప్పుడు సింహాల జాడలేని ఈ ప్రాంతం ఇప్పుడు 17 సింహాలతో కళకళలాడుతోంది. ఆసియా సింహాల సంరక్షణలో ఇదొక చారిత్రక విజయంగా పర్యావరణవేత్తలు అభివర్ణిస్తున్నారు. గిర్ అడవులకు మాత్రమే పరిమితమైన సింహాలకు, బర్దా అభయారణ్యం రెండో సురక్షిత ఆవాసంగా మారనుంది. బర్దా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ యాజ్ ఏ పొటెన్షియల్ స్ట్రాంగ్‌హోల్డ్ ఫర్ ఏషియాటిక్ లయన్స్ పేరుతో ప్రఖ్యాత ప్లోస్ వన్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, బర్దా అభయారణ్యం సింహాల దీర్ఘకాలిక మనుగడకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని తేలింది.

## ఢిల్లీలో ఆరు మెట్రోస్టేషన్ల మూసివేత

**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ నిరసనల నేపథ్యంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. విపక్ష ఇండియా కూటమి సోమవారం సుప్రీంకోర్టు వైపు నిరసన మార్చ్ చేపట్టంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. 12న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరు మెట్రో స్టేషన్లలో ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. పటేల్ చౌక్, జన్‌పథ్, రాజీవ్ చౌక్, మండీ హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, బరాఖంబా రోడ్ మెట్రో స్టేషన్లు మూసేసింది.

13-10Pg6exHMNWJQE.qxd:13-10Pg6exHMNWJQE.qxd 1/1/02 6:31 AM Page 1



# బిసి యువతకు పి4లో ఉచిత సివిల్స్ కోచింగ్



**అమరావతి, అక్టోబరు 12, ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే తొలిసారిగా పీ4 మోడల్ లో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్ సర్వీసెస్ కోచింగ్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీతో బీసీ సంక్షేమ శాఖ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ సందర్భంగా మెటీరియల్ ఉచితంగా ఇవ్వడంతో పాటు అభ్యర్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర సచివాలయం లోని మంత్రి సవిత సమక్షంతో డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ ప్రతినిధులు, బీసీ సంక్షేమ శాఖాధికారులు పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలను అన్ని రంగాల్లోనూ ముందు ఉంచాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నా రు.బీసీ యువత ఉన్నత స్థానాల్లో కొలువుదీ రాలన్న ఉద్దేశంతో సివిల్స్ సర్వీసెస్, డీఎస్సీ, గ్రూప్ 1, పోలీస్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగాల కోసం బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ అందజేస్తున్నామన్నారు. సీఎం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 మోడల్ లో బీసీ యువ తకు ఉచిత సివిల్స్ శిక్షణ అందిం చడానికి దేశం లో ప్రఖ్యాత గాంచిన డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ ముందుకు రావడం అభి నందనీయమ న్నారు. ఈశిక్షణ సందర్భంగా డాక్టర్ లక్ష్మయ్య అకాడమీ మెటీరియళ్లతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన అందించనున్నాం న్నారు.

**డీఎస్సీ సహా ఇతర పోటీ పరీక్షలకు త్వరలో ఉచిత శిక్షణ..**

2014- 19లో బీసీ నిరుద్యోగ యువతకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని మంత్రి సవిత గుర్తు చేశారు. తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం ఉచిత సివిల్స్ కోచింగ్ నిలిపేసిందన్నారు. దీంతో బీసీ నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పాలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఉచిత సివిల్స్ కోచింగ్ ను పునరుద్ధించిందన్నారు.

# లావేరులో గంజాయి ముఠా గుట్టురట్టు

● 12 మంది అరెస్ట్, 2.29 కేజీల గంజాయి స్వాధీనం



**రణస్థలం, లావేరు (శ్రీకాకుళం జిల్లా), అక్టోబరు 12 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ త్రిశూల్'లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని లావేరు పోలీసులు గంజాయి విక్రయ వినియోగ ముఠా ఆటకట్టించారు. లావేరు మండలంలోని తాళ్లవలస పంచాయతీ పరిధిలో బొడ్డపాడు గ్రామంలో జీడితోటలో గుమిగూడి గంజాయి పంచుకుంటున్న 12 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి 2.292 కిలోల గంజాయి, 6 మొబైల్ ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని జెఆర్ పురం సిఐ ఎం అవతారం ఎదుట సోమవారం హాజరు పరిచారు. లావేరు ఎస్ఐ వి సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అక్టోబరు 11వ తేదీ సాయంత్రం లావేరు మండలం తాళ్లవలస పంచాయతీ పరిధిలోని బొడ్డపాడు శ్రీమాత ఆశ్రమం సమీపంలోని జీడితోటలో కొంతమంది గంజాయి సేవిస్తూ, పంచుకుంటున్నారని పోలీసులకు కచ్చితమైన సమాచారం అందింది. దీంతో ఎస్ఐ సందీప్ కుమార్, రెవెన్యూ అధికారులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మిక దాడి చేశారు. పోలీసులను చూసి నలుగురు నిందితులు పారిపోగా, మిగిలిన 12 మందిని చాకచక్యంగా పట్టుకున్నారు.నిందితుల వద్ద నుంచి 2.292 కేజీల గంజాయి, 6 మొబైల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలు (ఒక స్కూటీ, పల్సర్, స్ప్లెండర్) స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పారిపోయిన నలుగు కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**దాబా కేంద్రంగా అక్రమ దందా :** పోలీసుల విచారణలో నిందితుల నెట్‌వర్క్ గురించిన విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రాజు మహ్తో (ఎ1), ముఖేష్ మహ్తో (ఎ2) అనే అన్నదమ్ములు పైడిభీమవరం సమీపంలోని హైవే ప్రక్కన 'బీహార్- జార్ఖండ్' పేరుతో దాబా నడుపుతు న్నారు. దాబాకు వచ్చే లారీ డ్రైవర్ల నుంచి వీరు గంజాయి సేకరించి, తాము తాగుతూ పరిచయస్తులకు చిన్న చిన్న పొట్లాల రూపంలో అమ్మడం ప్రారంభించారు. వీరి వద్దకు భోజనానికి వచ్చే కోల హార్షవర్ధన్ (ఎ3), సురవరపు వరప్రసాద్ (ఎ4), పిన్నింటి చంటి (ఎ5)లకు గంజాయి విక్రయించగా వారు తమ స్నేహితులైన విద్యార్థులు, యువకులకు (ఎ6 నుంచి ఎ12) సప్లై చేస్తున్నారు. అక్టోబర్ 11న తాళ్లవలస జీడితోట వద్ద గంజాయి పంపిణీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

**పాత నేరస్థులే ఎక్కువ.. విద్యార్థులూ బలి!**

అరెస్ట్ అయిన వారిలో ఎ1, ఎ3, ఎ4, ఎ5, ఎ6, ఎ7లపై గతంలోనూ ఎన్డీపీఎస్, బీఎన్ఎస్ చట్టాల కింద జేఆర్ పురం, లావేరు, రాజాం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. ఈ ముఠాలో డిగ్రీ, బీటెక్ చదువుతున్న యువకులు ఉన్నట్లు తెలిపారు.

# సోషల్ మీడియా విభాగం కేవలం పోస్టులు పెట్టే వ్యవస్థ కాదు

**విజయవాడ.అక్టోబరు 12,.ప్రభాతవార్తప్రతినిధి:** సోషల్ మీడియా పోస్టుల్లో భాష హుందాగా, విషయం బలంగా ఉండాలిరానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగం అత్యంత కీలకమైన బాధ్యతను నిర్వహించాలని పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియా విభాగంలో బాధ్యతలు నిర్వహించే వారు సాధారణ కార్యకర్తల కంటే భిన్నంగా కంటెంట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగే ఆర్గనైజర్లుగా పనిచేయాలని సజ్జల సూచించారు. కంటెంట్ క్రియేట్ చేయడం ఒక్కటే కాకుండా, పార్టీ నుంచి వచ్చే మెసేజ్‌ను వెయ్యి మందికా, పదివేల మందికా, లక్ష మందికా ఎంత వేగంగా తీసుకెళ్లగలుగుతున్నామన్నదే అసలు సామర్థ్యమని చెప్పారు. సోషల్ మీడియా విభాగం అన్ని అనుబంధ విభాగాలతో అనుసంధానమై పనిచేయాలని చెప్పారు. ప్రతి గ్రామం, మండలం, నియోజకవర్గంలో సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని సజ్జల సూచించారు. ప్రతి కార్యకర్త తనకు అందిన పార్టీ సందేశాన్ని ఎంతమందికి చేరవేయగలుగుతున్నాడో స్పష్టంగా గుర్తించుకోవాలని చెప్పారు.



# శాస్త్రీయ మార్గంలో వేమన అడుగులు

● వేమన పౌండేషన్ సభలో ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డి

**అనంతపురం, అక్టోబరు 12 ప్రభాతవార్త బ్యూరో:** వేమన ఆలోచనలు శాస్త్రీయ దృష్టితో సమాజ పురోగతిని కాంక్షించే ధోరణితో సాగుతాయని ప్రముఖ భౌతికశాస్త్ర ఆచార్యులు ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వేమన పౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయిబాబా కళాశాలలోని వేమన కేంద్రంలో వేమన వైజ్ఞానిక దృక్పథంపై ఉపన్యాస కార్యక్రమంలో వక్తగా రాజోలు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత వైస్ ఛాన్సలర్,ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత వైస్ ఛాన్సలర్ ఆచార్య హుసేనన్ రెడ్డి పాల్గొన్నారు. వేమన పద్యాలు కేవలం నైతిక, తాత్విక అంశాలేనే కాకుండా ఆనాటి వాతావరణ పరిస్థితులు, వ్యవసాయ స్థితిగతులు, ఆరోగ్యం, వ్యాధులు, అనేక రసాయన మూలకాలు,దేహనిర్మాణం, మానసిక స్థితిగతులు, పంచ భూతాలు తదితర అనేక అంశాలపై శాస్త్రీయంగా వివరించారని వక్త రాజోలు రామకృష్ణారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి వేమన పౌండేషన్ కార్యదర్శి డా.అప్పిరెడ్డి, హరినాథరెడ్డి సమన్వయం చేసారు. ఆచార్య రమణ, ప్రేమకుమార్, ప్రజా సంఘాల నాయకులు రాహుల్, శ్రీనివాసరెడ్డి, కెవి రమణ, యోగా టీచర్ వేలూరి స్వప్న, కవులు దామోదర రెడ్డి, రియాజ్ అహమ్మద్, మధుర శ్రీ పాల్గొన్నారు.

# ఆర్.టి.ఐ కమిషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు

● ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం
● గ్రామ స్థాయి నుంచి ఆన్‌లైన్‌లో విచారణ



**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** కేసుల పరిష్కారంలో రాష్ట్ర ఆర్.టి.ఐ కమిషన్ జాతీయస్థాయిలో గుర్తింపుపొందిందని రాష్ట్ర సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. సమాచార హక్కు చట్టం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంను ప్రజలకు మరింత చేరువ చేయుటకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమాచార హక్కు చట్టం సామాన్యుని చేతిలో శక్తివంతమైన ఆయుధం అన్నారు. దేశంలో ఉన్నత స్థాయిలో ఉన్న అధికారి పనితీరును కూడా పొందే అవకాశం కల్పిస్తుందని చెప్పారు. రాష్ట్ర సమాచార కమిషన్ మంచి పనితీరును కనబరుస్తుందని పేర్కొన్నారు. 2026 జనవరి నుంచి సెప్టెంబరు నెలాఖరు నాటికి 7,034 కేసులు పరిష్కరించి చరిత్ర సృష్టించిందన్నారు. ప్రస్తుత కమిషనర్లు 10 వేల కేసులు పరిష్కరించారని ప్రశంసించారు. అవసరాన్ని అనుసరించి ఇద్దరు సభ్యులతో కూడిన బెంచ్‌లు, ముగ్గురు సభ్యులతో కూడిన ఫుల్ బెంచ్ లు ఏర్పాటు చేసి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొదట వచ్చిన కేసు మొదటగా పరిష్కారం కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని అప్పుడే అందిన దరఖాస్తులకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్ నుండి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని అన్నారు. గ్రామ స్థాయి నుంచి ఆన్ లైన్ ద్వారా విచారణ చేపట్టి దూరప్రాంతాల నుండి వచ్చే వారికి వ్యయ ప్రయాసలు లేకుండా చేస్తున్నామని అన్నారు. ఆన్ లైన్ విచారణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. 95 శాతం విచారణలు ఆన్ లైన్ లో జరుగుతున్నాయని, దగ్గర ప్రాంతాల్లో ఉండే వారు 5 శాతం వరకు నేరుగా వస్తున్నారని తెలిపారు.

# గ్రామ పంచాయతీల బలోపేతానికి కృషి



**అమరావతి, అక్టోబరు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** కళాకారులకు అండగా నిలుస్తూ, గ్రామ పంచాయతీల బలోపేతానికి జాతీయ స్థాయిలో కృషి చేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ పర్యాటక, చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదకు గుర్తింపు తీసుకురావడంలో విశేష సేవలందిస్తున్న అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులును ఆదివారం గుంటూరులో ఘనంగా సన్మానించారు. గుంటూరులోని అమరావతి రోడ్డులో ఉన్న అన్నదాన సమాజం ఆడిటోరియంలో సేవాసదన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాతృశ్రీ విద్యాసంస్థల అధినేత బండ్లమూడి గాంధీ సభాధ్యక్షత వహించగా, సేవాసదన్ అధ్యక్షుడు, జనసేన నాయకుడు మిరియాల గోపికుమార్, కళావేదిక అధినేత మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. మాజీ శాసనమండలి సభ్యుడు డాక్టర్ అమ్మినేని శివరామకృష్ణ రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాకారుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ, కళా సంస్థలకు తనవంతు సహకారం అందిస్తున్న డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సేవలను వక్తలు కొనియాడారు. కళారంగానికి సేవ చేయడంతో పాటు గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, రాష్ట్ర పర్యాటక రంగ ప్రగతి కోసం ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# మూలపాడు వేదికగా ఆంధ్ర బ్యాటర్ల ఆధిపత్యం

**విజయవాడ, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రా-కర్ణాటక జట్ల మధ్య మూలపాడు వేదికగా జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రెండో రోజు ఆంధ్ర బ్యాటర్లు ఆకట్టుకున్నారు. కర్ణాటక బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ ఎస్వీ రాహుల్ శతకంతో రాణించగా, రేవంత్ రెడ్డి కీలక ఇన్నింగ్స్‌తో జట్టుకు అండగా నిలిచారు. తొలి రోజు రెండు వికెట్లు నష్టపోయి కష్టాల్లో పడిన ఆంధ్రా జట్టును బ్యాట్స్ మెన్ రాహుల్, రేవంత్ రెడ్డి ఆదుకున్నారు. మూడవ రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్రా జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 331 పరుగులు చేసింది. ఎస్.వి. రాహుల్ 187 బంతుల్లో 10 ఫోర్లతో 108 పరుగులు సాధించి అద్భుత సెంచరీ నమోదు చేశారు. మరోవైపు రేవంత్ రెడ్డి 143 బంతుల్లో 13 ఫోర్లతో 97 పరుగులు చేసి శతకానికి చేరువగా నిలిచారు. క్రీజులో నిలదొక్కుకుని బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేసిన వీరిద్దరూ ఆంధ్ర ఇన్నింగ్స్‌కు కీలకంగా నిలిచారు.కర్ణాటక బౌలర్లలో శిఖర్ శెట్టి మూడు వికెట్లు పడగొట్టగా, మాధవ్ బజాజ్ రెండు వికెట్లు, రితేష్ బతకల్ ఒక వికెట్ సాధించారు. దీంతో మూడో రోజు ఆట ఇరు జట్లకు కీలకంగా మారనుంది. ఆంధ్ర జట్టు తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుందా? కర్ణాటక బౌలర్లు పుంజుకుని మ్యాచ్‌పై పట్టు సాధిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

## తిరుమల సమాచారం



# నవరాత్రి బ్రహ్మోత్సవాన బంగారుతిరుచ్చిపై భగవంతుడు

**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా సోమవారం ఉదయం మొదలయ్యాయి. ఉదయం ఆలయంలో నిత్యకైంకర్యాలు ముగించుకున్న శ్రీదేవిభూదేవిమలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాఢవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులను కటాక్షించారు. సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు ఊంజల్‌సేవ జరిగింది. బ్రహ్మోత్సవ శోభ ఉట్టిపడేలా విద్యుత్‌దీపాలంకరణలు, పుష్పాలంకరణలు టిటిడి విస్తృతంగా చేపట్టింది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర దంపతులు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఎస్‌విబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ, బోర్డు సభ్యులు శాంతారామ్, జ్యోతుల నెహ్రూ, ఆలయ డిప్యూటీ ఇఒ భయ్యాల భాస్కర్, ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, అర్చకులు పాల్గొన్నారు.



# తిరుమలేశునికి హిందు మహాసభ ట్రస్ట్ గొడుగులు

**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి సోమవారం ఉదయం హిందు మహాసభ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొడుగులు సమర్పించారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలిరోజే స్వామివారికి నూతన గొడుగులు హిందూ మహాసభ ట్రస్ట్ ఛైర్మన్ వసంతం కుమార్ కానుకగా అందజేశారు. గత 15 సంవత్సరాలుగా స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో వేంకటేశ్వరస్వామికి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పద్మావతి అమ్మవారికి నూతన గోడుగులు హిందు మహాసభ ట్రస్ట్ సమర్పిస్తుంది. శ్రీపురం నారాయణి అమ్మ ఆలయంలో తొలుత పూజాలు నిర్వహించిన అనంతరం చెన్నై నుండి 10 రోజులు బాటు ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చారు. వైభోత్సవ మండపం వద్ద 9 నూతన గోడుగులను ఆలయ డిప్యూటీ ఇఒ భయ్యాల భాస్కర్, బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, రాష్ట్ర హస్తకళల చేనేత అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎస్‌విబిసి ఛైర్మన్ శ్రీధర్‌వర్మ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి సమక్షంలో టిటిడికి అందజేశారు. స్వామివారి పై అచెంచలమైన భక్తిశ్రద్ధలతో 15 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న దాతను టిటిడి అధికారులు అభినందించారు.

# జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎపి టీం



**శ్రీకాళహస్తి, అక్టోబరు 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జాతీయ జట్టును ఎంపిక చేసారు. ఈ మేరకు నిర్వాహకులు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి అమ్ములు సోమవారం ప్రకటించారు. 14, 17, 19 సంవత్సరాల లోపు విభాగాల్లో జట్టులను ఎంపిక చేసారు. ఈ నెల 23 నుంచి జరిగే పోటీలకు సంబంధించిన జట్టులను ఎంపిక చేసారు.

**జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జట్లు ఇవే:**

14సంవత్సరాల లోపు బాలికల జట్టులో పివి సుక్తిశ్రీ(గుంటూరు), పప్పాల లాస్యప్రియ(విశాఖ పట్టణం), మోటుపల్లి చాందిని(తిరుచానూరు), ముత్తా వశస్వి(విశాఖ పట్టణం), గాంధీ సుధిక్ష(విశాఖ పట్టణం), స్టాండ్ బైగా వేణి ఆలిషనిరెడ్డి(గుంటూరు), పియాషిచా శర్మ(మదనపల్లి), కుక్కల చైత్రా శ్రీప్రియ(పాలకొల్లు)లు ఎంపికయ్యారు.

**బాలుర జట్టు:** 14 సంవత్సరాల లోపు బాలుర జట్టులో పెంటకోట రేవంత్ రిషి(విశాఖ పట్టణం), యడ్లపల్లి కృష్ణ(విజయవాడ), భీమనేని ధత్రిష్(విశాఖ పట్టణం), పాపసాని రాజారెడ్డి (తిరుపతి), సేనాపతి శౌర్య(విశాఖ పట్టణం)లు ఎంపిక కాగా స్టాండ్‌బైటీంగా గోలిశేఖర్‌బాబు(గుంటూరు), పోలవరపు సుమంత్(విశాఖ పట్టణం), పట్టిసాపు హరికేష్(విశాఖ పట్టణం)లు ఎంపికయ్యారు.17 సంవత్సరాల లోపు బాలికల జట్టుగా నున్నబోయిన లేఖశ్రీ (పాలకొల్లు), వట్టప్రంబిల ప్రణీత(విశాఖ పట్టణం), సుమేహార అన్సారి(మెట్టురు చిత్తూరు), లలిత తాలశీల(విజయవాడ), సాయి సంజన రెడ్డి(పూతల పట్టు) జట్టుగా ఎంపిక కాగా స్టాండ్‌బైగా ఎపెద్దిరెడ్డి లోచన(సామర్లకోట కాకినాడ), గోనే మోక్ష(పెనుమలూరు), అంకిరెడ్డి జోషిప్రియ రెడ్డి(ఖాజానగర్ అనంతపురం) ఎంపికయ్యారు. బాలుర జట్టులో బొమ్మ యశ్వంత(విశాఖ పట్టణం), ఇషాన్ యడ్లపల్లి(లక్ష్మీపురం కర్నూల్), కొండారెడ్డి నిషాంత్(అమరావతి), కొల్లి బృషిన్ సాయి(విశాఖ పట్టణం) ఎంపిక కాగా స్టాండ్‌బైగా చెన్నారెడ్డి గారి గీతేష్ రెడ్డి(రామాపురం), తోటకూర గురు రోహిత్ (శ్రీకాళహస్తి), నందనం హర్షవర్ధన్ (కాకినాడ) ఎంపికయ్యారు.

19 సంవత్సరాల లోపు బాలికల జట్టుగా గోలి సోషిత(గుంటూరు), గందన్‌మేధా శేష సాయి (కాకినాడ), అల్లబోయిన ఆరుషి(విశాఖ పట్టణం), పి.షర్‌నిషితా అనంద్ (తూర్పు గోదావరి), తాడినారి సన్నిహిత (అనంతపురం) ఎంపిక కాగా స్టాండ్‌బైగా రవడ ఊర్మిల (శ్రీకాకుళం), సాకే కిరణ్మయి (అనంతపురం), గనివేడ రాజా నందిని (ఏలూరు) ఎంపిక కాగా బాలుర జట్టులో దేశం సాయి శంకర్( కర్నూల్), షేక్ ఉమర్ అక్మల్ (శ్రీకాళ హస్తి), బేసిశెట్టి జయసాయి కుమార్(శ్రీకాళ హస్తి), రెడ్డివారి తనిష్‌రెడ్డి (తిరుపతి), నార మంగళం మునిహిమసాయి (తిరుపతి) ఎంపిక కాగా స్టాండ్‌బై టీంగా ఎం ఇషాన్ (చిత్తూరు), సాకే కిరణ్‌కుమార్ ( అనంతపురం), దారపురెడ్డి అఖిల్ (విశాఖ పట్టణం)ను ఎంపిక చేసారు.



# ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.3 లక్షలు జరిమానా

**తిరుపతి, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ న్యాయస్థానం న్యాయమూర్తి జి.అర్చన సోమవారం తీర్పునిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్సు ఎస్పీ జె.కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదై, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు .2017లో ఇద్దరు ముద్దాయిలు తిరుపతి జిల్లా గాజులమండ్యం సర్కిల్ రేణిగుంట మండలంలో అరెస్టయ్యారు. వీరు తమిళనాడు, వేలూరు జిల్లా నగానదీ గ్రామానికి చెందిన ఎన్ఆర్ మణి, తిరువన్నామలై జిల్లా పుదూరు గ్రామానికి చెందిన ముత్తు పొన్నుసామి. వీరి పై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతో బాటు రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

# తిరుపతి అలిపిరిలో మెగా టౌన్‌షిప్ !

● 16వేల మంది భక్తులకు తిరుపతిలోనే సకల సౌకర్యాలు

**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ప్రతిరోజూ దేశవిదేశాల నుండి తరలివస్తున్న భక్తుల సంఖ్య అశేషంగా పెరిగింది. అనూహ్యంగా రెట్టింపవతున్న భక్తుల రద్దీతో తిరుమల తిరుపతి దేవస్థానం కూడా సౌకర్యాలు మరింత సులభంగా కల్పించేలా ప్రణాళికలు రూపొందించింది. తిరుమలకు రోజువారీగా 90 వేలమంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. ఈ సంఖ్య వారాంతం, ప్రత్యేక పర్వదినాల్లో 1.30 లక్షల మంది వరకు ఉంటున్నారు. 40వేలమంది భక్తులు తిరుమలకు వస్తే వసతి కల్పించడం గగనంగా మారింది. అదేగాక ఇష్టదైవమ్ తిరుమలేశుని దర్శనం చేయించడం కూడా గంటలుగంటలు సమయం నిరీక్షణ తప్పడంలేదు. తిరుమలలో భవనాలు నిర్మాణానికి అవకాశం లేకపోవడంతో ఈ నేపథ్యంలో తిరుపతి అలిపిరి వద్ద భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి అధికారులు, బోర్డు నిర్ణయించారు. ఇందుకు అలిపిరి వద్ద మెగాటౌన్‌షిప్ పేరుతో అధునాతన యాత్రికుల వసతి సముదాయం భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతి తీసుకుంది. తాజాగా గతనెలలో జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన సిఎం చంద్రబాబునాయుడు ఆ దిశగా టౌన్‌షిప్ నిర్మాణానికి అనుమతినిచ్చారు. యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఎక్కడా రాజీపడవద్దని సూచించారు. తాజాగా సోమవారం ఉదయం సిఎం చంద్రబాబునాయుడు అమరావతి నుండి వర్చువల్‌గా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంతో అలిపిరి వద్ద యాత్రికుల వసతి సముదాయం నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చారు.

తిరుమల-తిరుపతికిపెరుగుతున్న భక్తుల రద్దీకి అనుణంగా టిటిడి చర్యలు తీసుకుంటోంది. భక్తుల సదుపాయాల కోసం అలిపిరి వద్దే ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్ షిప్ ఏర్పాటుకానుండటంతో భక్తులకు వసతితో బాటుగా దర్శన టికెట్ల జారీ కేంద్రాలు సహా అన్ని రకాల సేవలు అందించేలా ఈ టౌన్ షిప్‌కు రూపకల్పన చేస్తున్నారు. ఈ టౌన్ షిప్‌కు సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఈ టౌన్ షిప్‌లో నాలుగు బ్లాకుల్లో 2,700 గదులు, రోజుకు 16 వేల మంది భక్తులకు వసతి కల్పనకు అవకాశం ఏర్పడుతుంది. రూ.160 కోట్లతో అన్నప్రసాద కేంద్రం నిర్మించి, ఒకేసారి ఆరు వేల మంది భక్తులకు అన్నప్రసాదం అందించేలా రూపకల్పన చేశారు. రూ.486 కోట్లతో నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపడుతున్నారు. ఈ వసతి సముదాయాలలో ఒకేసారి 16 వేల మంది భక్తులకు స్నానం, విశ్రాంతి తీసుకునే సౌకర్యం కల్పిస్తున్నారు. రూ.311 కోట్ల అంచనాతో 4,500 వాహనాలు నిలిపే బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయం నిర్మాణం కోసం వ్యయం చేస్తున్నారు. రూ.90 కోట్లతో 30 బస్ బేలతో ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.తిరుమలకు వచ్చే భక్తులకు వసతి, అన్నప్రసాదం, రవాణా, పార్కింగ్, వైద్య సేవలన్నీ ఒకేచోట ఏర్పాటు చేస్తున్నారు.

# దసరా సెలవుల్లోనూ నామమాత్రంగా భక్తులు

● సర్వదర్శనానికి 8గంటలు



**తిరుమల, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** పెరటాసిమాసం నవరాత్రి బ్రహ్మోత్సవాలు, దసరా సెలవులతో సోమవారం తిరుమలలో భక్తులు నామమాత్రంగా వున్నారు. ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ఉదయానికి భక్తులతో వైకుంఠమ్ 2లో 11కంపార్టుమెంట్లలో భక్తులు ఉన్నారు. ఉదయం కొంతసమయం భక్తులను వైకుంఠమ్ నుండి నేరుగా క్యూలైన్‌లో ఆలయంలోనికి అనుమతించారు. సాయంత్రానికి ఇదే మోస్తరుగా భక్తుల రద్దీ ఉంది. తిరుమలలో సాయంత్రానికి 36వేల మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. సర్వదర్శనానికి 8గంటలు సమయం పడుతోంది.

# సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

**తిరుపతి, అక్టోబరు 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు తదితర సమస్యలను వినియోగదారులు తమదృష్టికి తీసుకువస్తే సత్వర చర్యలు తీసుకుని పరిష్కరిస్తున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో సోమవారం 'డయల్ యువర్ సిఎండి', 'డయల్ యువర్ ఎస్ఇ' కార్యక్రమాలు జరిగాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఓల్టేజ్ లో హెచ్చుతగ్గులు, విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పు, ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం వాట్సాప్ 91333 31912 నంబర్‌కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, ఎన్. శోభా వాలెంటీనా, ఆర్.పద్మ, ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్.రమణ, కె.సంపత్ కుమార్, ఎం.శ్రీకాంత్, ఎ.శ్రీనివాస బాబు, సుధాకర్, ఓఎస్డీ ఉమాపతి, జనరల్ మేనేజర్లు భాస్కర్ లత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

13-10Pg7exHMNWJQE.qxd:13-10Pg7exHMNWJQE.qxd 1/1/02 7:25 AM Page 1



## స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులకు

# తక్షణం సర్టిఫికెట్లు జారీ చేయాలి

● రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ను కోరిన వైఎస్సార్సీపీ లేఖ

**విజయవాడ,అక్టోబరు 12,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు కులం/ కమ్యూనిటీ సర్టిఫికెట్లు, నోడ్యూస్/వివీధి సర్టిఫికెట్లు పొందడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంపై పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఇవాళ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు మరోసారి లేఖ రాశారు. గతంలో అక్టోబర్ 1, 5 తేదీల్లో ఈ మేరకు సమర్పించిన రెండు వినతిపత్రాలకు కొనసాగింపుగా ఆయన ఎస్ఈసీకి ఈ లేఖ రాశారు. ఇప్పటికైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తక్షణం కావాల్సి సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలని, ఇందులో జాప్యం కారణంగా ఏ దరఖాస్తుదారుడూ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా చూడాలని లేళ్ల అప్పిరెడ్డి కోరారు. రాష్ట్రంలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కులం, నో డ్యూస్/ ఎన్వోసీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా, వారికి సకాలంలో అవి అందడం లేదని ఇప్పటికే రెండుసార్లు విజ్ఞాపనలు ఇచ్చామని, అయినా ఇప్పటికీ అవసరమైన సర్టిఫికెట్లు పొందడంలో దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమకు సమాచారం అందుతోందని వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఎస్ఈసీకి రాసిన లేఖలో తెలిపారు. తమ ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తగిన స్పందన కనిపించడం లేదని, తాము గత లేఖల్లో ప్రస్తావించిన సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆయన గుర్తుచేశారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉన్నందున, ఈ జాప్యాలపై అత్యవసరంగా దృష్టి సారించాలని ఎస్ఈసీని లేళ్ల అప్పిరెడ్డి కోరారు. నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి అవసరమైన చోట ఈ సర్టిఫికెట్లను అభ్యర్థులు పొందాల్సి ఉంటుందని, అర్హులైన వ్యక్తులు తమ నామినేషన్లు దాఖలు చేయలేక ఎన్నికల్లో అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తుచేశారు.

## రిజర్వేషన్లు ఖరారు కావడంతో

# వేడెక్కిన మున్సిపల్ ఎన్నికలు

● అనంతపురం మేయర్, మున్సిపల్ చైర్మన్ స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు
● నేడో.. రేపో.. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ..!

**అనంతపురం, అక్టోబర్ 12 ప్రభాతవార్త బ్యూరో:** మున్సిపల్ ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ల స్తానాలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం వేరువేరుగా ఉత్తర్వులు జారీ చేయడంతో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రాజకీయ వర్గాల్లో అలజడి మొదలైంది. మున్సిపల్ చైర్మన్ స్థానాలకు ఆయా సామాజిక వర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశా వహుల్లో ఆసక్తిని నిలిపింది. రిజర్వేషన్ల ఖరారుతో కొన్ని సామాజిక వర్గాల్లో నిరాశ నెలకొనగా కొన్ని సామాజిక వర్గాల్లో ఆశలు చిగురించాయి. అధికారికంగా రిజర్వేషన్లు కాక ఒకరోజు ముందు మీడియాలో కొన్ని మున్సిపల్ స్థానాలు అన్ రిజర్వ్డ్ కేటాయిస్తున్నట్లు ప్రచారం చేయడం, అధికారికంగా జీవో విడుదలైన తర్వాత వేరే వర్గాలకు రిజర్వ్ కావడంతో కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పార్టీ నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. ఏది ఏమైనా మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి చైర్మన్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో టిడిపి, వైసిపిలో కొత్త జోష్ నెలకొంది. గతంలో మాదిరి కౌన్సిలర్లు, కార్పోరేటర్లు ఎన్నుకునే పద్దతికి స్వస్థి పలకడంతో ఒక్కసారిగా మేయర్, మున్సిపల్ చైర్మన్లుగా ఎన్నికైతే ఇక ఐదేళ్ల దిగులుండదని ధీమాతో అభ్యర్థులు ఉన్నారు. ఇందులో భాగంగా ఆర్థికంగా బలముండి ఫేస్ వ్యాల్యూ ఉన్న అభ్యర్థుల కోసం నేతలు ప్రయత్నాలు మొదలెట్టారు. ముఖ్యంగా అధికార పార్టీ తరుపున సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ప్రతిపక్షం తరుపున వైసిపి మాజీ ఎమ్మెల్యేలు భుజస్కందాలపై వేసుకుని మున్సిపల్ ఎన్నికల్లో ఢీ అంటే ఢీ అనేందుకు సిద్దమయ్యారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం మేయర్ స్థానాన్ని బిసి జనరల్‌కు కేటాయించారు. అదే విధంగా ధర్మవరం, రాయదుర్గం మున్సిపాలిటీలను అన్ రిజర్వ్డ్ స్థానాలుగా, కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని జనరల్ మహిళల కోటా కింద నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాడిపత్రి, పెనుకొండ, పుట్టపర్తి, మడకశిర, హిందూపురం మున్సిపల్ చైర్మన్ స్థానాలను బిసి జనరల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంతకల్లు, కదిరి మున్సిపల్ చైర్మన్ స్థానాలను బిసి మహిళలకు, గుత్తి మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఎస్సీ మహిళలకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపల్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ప్రతిష్ఠగా మారాయి. జిల్లా మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో మున్సిపాలిటీ లేనందున, ఎన్నికలు నిర్వహణ ఉండదు. మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరంలోనూ, మంత్రి సవితమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్న పెనుకొండలో మున్సిపల్ ఎన్నికలు జరుగుతుండటం గమనించదగ్గ విషయం. ఉరవకొండ, శింగనమల నియోజకవర్గాలు మినహా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మిగతా అందరూ ఎమ్మెల్యేలకు మున్సిపల్ ఎన్నికలు ఉన్నట్లే. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నియోజకవర్గ సమన్వయ కర్తలకు ఆ పార్టీ అధినేత, వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు ఉండటంతో నియోజకవర్గ సమన్వయ కర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకోగా, ఇదే సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా ప్రతిష్టాత్మకంగా మున్సిపల్ ఎన్నికలను తీసుకునే అవకాశం వుంది. ఒకటిరెండు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నందున మున్సిపల్ చైర్మన్ స్థానాలకు, మేయర్ స్థానానికి అభ్యర్థుల ఎంపికలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కసరత్తు ప్రారంభించారు. వైసిపికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, టిడిపికి సిట్టింగ్ ఎమ్మెల్యేల మధ్య కోలాహలం మొదలైంది.



## ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, అక్టోబరు 12 ప్రభాతవార్త :** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్) సంస్థ సిఎస్ఆర్ నిధుల ద్వారా రూ.4.52 కోట్ల విలువైన అధునాతన వైద్య పరికరాలను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అందించడం ఎంతో సంతోషకరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ పరికరాల అందుబాటుతో ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపడటంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లోనూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అత్యవసర, అధునాతన వైద్య చికిత్సల కోసం పేద ప్రజలు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా ప్రభుత్వ ఆసుపత్రులను నాణ్యమైన వైద్య సేవలకు నమ్మకమైన కేంద్రాలుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందాలన్నదే తమ సంకల్పమని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఆధునిక వైద్య పరికరాల సమకూర్పు, వైద్య సేవల నాణ్యత పెంపునకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొంటూ, ప్రభుత్వ ఆసుపత్రులను మరింత బలోపేతం చేయడం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## పేదలకు సొంతింటి కల సాకారం: మంత్రి నారాయణ



**నెల్లూరు, అక్టోబర్ 12, ప్రభాతవార్త - వైద్యం :** పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, నెల్లూరులో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అత్యంత పారదర్శకంగా హైక్వాలిటీ ఇళ్లను అందిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ముందుగా నెల్లూరు వెంకటేశ్వరపురంలో జరిగిన టిడ్కో గృహాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారాయణ వారి సతీమణి పొంగూరు రమాదేవికి పూలవర్షం కురిపించి స్థానిక ప్రజాలు నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం టిడ్కో ఇళ్లను గృహప్రవేశం చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ గొడ్డలి పార్టీ ప్రభుత్వం వచ్చి గతంలో తాము శాంక్షన్ చేసిన 7 లక్షల ఇళ్లను 2,61,000కి కుదించి, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని, కేంద్రం డబ్బులు ఇస్తామన్నా ఇళ్లు కట్టకుండా వెనక్కి పంపి ఇళ్లను, కలర్స్‌ను సర్వనాశనం చేసిందని మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిగిలిన పనుల కోసం అదనంగా 4,500 కోట్లు కేటాయించి, వచ్చే మార్చి 31 నాటికి ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు హ్యాండ్ ఓవర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే నెల్లూరు నగరంలో వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో గతంలో రద్దై ఖాళీగా ఉన్న ఫ్లాట్లను గుర్తించి, నేడు మొత్తం 332 మంది లబ్ధిదారులకు సుమారు 35 కోట్ల విలువైన ఇళ్ల పట్టాలతో పాటు మిఠాయిలు, చీరలు పంపిణీ చేశారు. ఇందులో నగరపాలక సంస్థ తరఫున 155 ఇళ్లను పూర్తిగా ఉచితంగా ఒక్క రూపాయి కాంట్రిబ్యూషన్ లేకుండా అందిస్తుండగా, మెప్మా పరిధిలోని తొలి విడత 177 ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల వాటాగా కేవలం 85 లక్షలు చెల్లించారని, వీరికి 8 కోట్ల రుణాలు త్వరలోనే ఇప్పించి ఒక్కో యూనిట్ విలువ 12 లక్షలతో పూర్తి చేయిస్తామని వెల్లడించారు.

# అనంతపురం మేయర్ పీఠం ఎవరికో?



## టిడిపి, వైసీపీలో ఆశావహుల తాకిడి - నేతలు తర్జనభర్జన

**అనంతపురం, అక్టోబర్ 12 (ప్రభాతవార్త బ్యూరో) :** అనంతపురం కార్పొరేషన్ స్థానంలో మేయర్ స్థానాన్ని బి సి జనరల్ కు కేటాయించిన నేపథ్యంలో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైసిపిలో ఆశావహుల తాకిడి ఎక్కువైంది. రెండు పార్టీల్లోనూ పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ముందుకు రావడంతో అభ్యర్థుల ఎంపికలో నేతలు తల మునకలై ఉన్నారు. ఇంతకాలం శ్రద్ధగా ఉన్న నాయకులు కూడా ఎన్నికల బరిలో దిగేందుకు ముందుకు రావడం, తటస్తులు కూడా ఎన్నికలకు సిద్ధం అంటుండడంతో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. జిల్లా కేంద్రమైన అనంతపురం మేయర్ స్థానానికి ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో టిడిపి తరఫున తలారి ఆదినారాయణ (అడ్వకేట్), సుధాకర్ యాదవ్ ( టిడిపి నగర అధ్యక్షులు), గాండ్ల విశాలాక్షి ( రాష్ట్ర గాండ్ల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ), ఉమర్ (మాజీ జెడ్పీ చైర్మన్ చమన్ కుమారుడు) , కమ్మూరు నాగరాజు ( వాల్మీకులు) తదితరులు ఆశిస్తున్నారు. అనంతపురం మేరుస్తానని వైసీపీ తరఫున రమేష్ గౌడ్ (బీసీ సంఘం జిల్లా నేత), వసీం ( మాజీ మేయర్), కురుబ శ్రీకాంత్ ( అనంతపురం మాజీ డిప్యూటీ మేయర్ వాసంతి భర్త) , చిలకం మధు ( మాజీ కార్పొరేటర్) పేర్లు వినిపిస్తున్నాయి. ముస్లిం మైనార్టీల్లో బీసీలుగా గుర్తింపు ఉన్నవారు, వడ్డే, బోయ సామాజిక వర్గానికి చెందినవారు కూడా వైసీపీ తరఫున పోటీ చేసేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నట్లు తెలియ వచ్చింది.. అనంతపురం మేయర్ స్థానానికి రిజర్వేషన్లు ఖరారు కావడంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తు కూటమి పార్టీలోనూ, అటు ప్రతిపక్ష వైసిపి లోని జోరు అందుకుంది.. అనంతపురం మేయర్ అభ్యర్థి ఎంపికలో వైసీపీ తరఫున అనంతపురం అర్బన్ సమన్వయకర్త అనంత వెంకట్రామిరెడ్డి, టిడిపి తరఫున అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ కీలకంగా వివరించే అవకాశం కనిపిస్తుంది. మేయర్ స్థానానికి పోటీ చేసే జిల్లాస్థాయిలో ప్రతిపాదన తీసుకొని రాష్ట్రస్థాయిలోనే రెండు పార్టీలు అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. అనంతపురం కార్పొరేషన్ స్థానంలో గతంలో 50 డివిజన్లు ఉండేటివి. ఇప్పుడు 60 డివిజన్లను చేశారు. కార్పొరేషన్లలో మేయర్ ను కార్పొరేటర్లు కలిసి ఎన్నుకునేవారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో మేయర్, మున్సిపల్ చైర్మన్ ను ప్రత్యక్షంగా ప్రజలు ఎన్నుకుంటారు. డిప్యూటీ మేయర్ ను మాత్రమే కార్పొరేటర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాత్రం కౌన్సిలర్న్లు ఎన్నుకుంటారు. మున్సిపల్ ఎన్నికలకు మంగళ, బుధవారాల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తూ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉండడంతో మున్సిపల్ ఎన్నికలపై పట్టణాల్లో ఎన్నికల సందడి ఎక్కువైంది. వైసీపీ తరఫున మీరు అభ్యర్థులను నేడు ప్రకటిస్తారా? రాష్ట్రస్థాయిలో వైసీపీ తరఫున వివిధ కార్పొరేషన్లలో పోటీ చేసే అభ్యర్థులను మంగళవారం వైసిపి అధిష్టాన వర్గం ప్రకటించే అవకాశం ఉందని తెలియ వచ్చింది. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన తాడేపల్లి లో వైసీపీ రీజినల్ కమిటీ చైర్మన్లతో ప్రత్యేక సమావేశం ఉందని, ఆ సమావేశంలో పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాత మీరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశం లేకపోలేదని వైసిపి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే నెల్లూరు కార్పొరేషన్ లో వేరు స్థానానికి పోటీ చేసే అభ్యర్థిని వైసీపీ ప్రకటించిన విషయం తెలిసిందే.

# మున్సిపల్ పోరులో తప్పిన బిగ్ ఫైట్

● తాడిపత్రి మున్సిపాలిటీ చైర్మన్ స్థానం బిసి జనరల్‌కు కేటాయింపు ● ఎద్దారెడ్డి కుటుంబం పోటీ చేయాలని గతంలో జె.సి ప్రభాకర్‌రెడ్డి సవాల్





**తాడిపత్రిఅర్బన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:** మున్సిపల్ పోరులో అనంతపురం జిల్లా తాడిపత్రి మున్సిపాలిటీ బీసీ జనరల్‌కు కేటాయించడంతో బిగ్ ఫైట్ లేకుండా పోయింది. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయిస్తూ ఎన్నికల సంఘం సోమవారం సాయంత్రం ప్రకటించింది. గతంలో జె.సి ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి కుటుంబాన్ని పోటీ చేయాలని తమ కుటుంబం నుంచి ఒకరు పోటీ చేస్తారని సవాలు విసిరారు. ఆయన సవాల్‌పై రాష్ట్ర ఎన్నికల సంఘం నీళ్ల చల్లినట్లు అయింది. జిల్లాలో తాడిపత్రికి ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 75 మున్సిపాలిటీలకు 2021లో జరిగిన ఎన్నికల్లో 74 స్థానాలు అధికార వైఎస్ఆర్ పార్టీ కైవశం చేసుకోగా తాడిపత్రి మున్సిపాలిటీ మాత్రం జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కైవశం చేసుకుంది. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన జె.సి అశ్మిత్‌రెడ్డి గెలుపొందడంతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని దాదాపు రెండు సంవత్సరాల పాటు తాడిపత్రిలోకి అడుగుపెట్టకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకుంటూ వచ్చాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టి పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నారు. పెద్దారెడ్డి చేపట్టిన ప్రతి కార్యక్రమానికి టిడిపి వారు ఏదో ఒక కార్యక్రమాన్ని చేపట్టి అడ్డు తగులుతూ వస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి గతంలో వైఎస్ఆర్‌సిపి అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవమైన స్థానాలను తిరిగి టిడిపికి ఏకగ్రీవం చేసి పెట్టాలని పోలీసు అధికారులపై మాటల యుద్ధం మొదలుపెట్టారు. గత మూడు రోజుల క్రితం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పోరులో కేతిరెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే తమ కుటుంబంతో పోటీపడాలని సవాలు విసరడంతో జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. తాడిపత్రి మున్సిపాలిటీ ఓసీ జనరల్‌కు వచ్చిందని ఓ దినపత్రికలో వచ్చిన క్లిప్పింగును సోమవారం ఉదయం అంతా సోషల్ మీడియాలో సర్క్యులేట్ అయింది. సాయంత్రం ఎన్నికల సంఘం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ గేజిట్ విడుదల చేయడంతో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయిస్తూ ప్రకటించడంతో తాడిపత్రిలో ఎక్కడ చూసినా ఇదే విషయంపై చర్చ కొనసాగుతోంది. ఎన్నికలు జె.సి కుటుంబము, కేతిరెడ్డి కుటుంబము ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాయా లేక పార్టీ ఆదేశాల మేరకు నిలబడిన వ్యక్తులు బరిలో ఉంటారా అన్నది తెలియాల్సి ఉంది. టిడిపిలో బలమైన నేతగా ఉన్న సూర్యమునికి అవకాశం దక్కుతుందేమోనని చాలామంది భావిస్తున్నారు. వైఎస్ఆర్‌సిపిలో బీసీఈ క్యాటగిరిలో ఉన్న ఫయాజ్‌బాషా బరిలో దిగుతారా లేక మరి ఎవరైనా చైర్మన్ అభ్యర్థిగా ఉంటారా అన్నది అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఏది ఏమైనా తాడిపత్రి మున్సిపాలిటీ బీసీ జనరల్ కేటాయించడంతో కొద్ది మేరకు ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఆత్మకూరు అభివృద్ధికి రూ.107కోట్లతో పనులు

● 29 కోట్లతో మరో 167 అభివృద్ధి పనులకు శ్రీకారం ● 20 కోట్లతో సమగ్ర క్రీడా కేంద్రం ● 2 కోట్లతో నగరవనం




**ఆత్మకూరు (నెల్లూరు), అక్టోబరు 12 ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. 2024ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ సహకారంతో ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో ఇప్పటికే 107కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, వీటిలో సిసిరోడ్లు, సిసి డ్రైన్లు దాదాపు పూర్తి కావచ్చాయన్నారు. ఆత్మకూరు ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో మంత్రి ఆనం పాత్రికేయులతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 50వేల కోట్ల విలువైన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రహదారి ప్రాజెక్టులో భాగంగా ఆత్మకూరు మున్సిపాల్టీకి మరో 29కోట్లు నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ఈ నిధులతో చేపట్టనున్న 167 అభివృద్ధి పనులకు సంబంధించి సోమవారం మూడు విడతల్లో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహిచామన్నారు. గత రెండేళ్ళలో ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో 100కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలున్నాయని రాబోయే రెండున్నర సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. ఆత్మకూరు యువత, మహిళలకు ఉపయోగపడేలా 20ఎకరాల విస్తీర్ణంలో సుమారు 20కోట్లతో సమగ్ర క్రీడా కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు. విద్యతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పార్కుల ఏర్పాటుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలో కూడమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపుపై రఘువీరారెడ్డి రణభేరి

● మోడీ, సిఇసి రాజీనామా చేయాలి.. ఇది మరో స్వాతంత్ర్య పోరాటం!..
● చంద్రబాబూ.. మోడీకి మద్దతు ఉపసంహరించుకో!



**విశాఖపట్నం,అక్టోబరు 12 ప్రభాత వార్త :** దేశంలో ఓట్ల తొలగింపు పేరుతో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని, రాజ్యాంగ పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటం మరో స్వాతంత్ర్య పోరాటమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖపట్నంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై విమర్శలు గుప్పించారు...ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యానికి ముప్పు..పారదర్శకత లేని ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కును కాలరాస్తున్నారని రఘువీరారెడ్డి ఆరోపించారు. ఈ ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు సుమారు 13.5 కోట్ల ఓట్లు తొలగించారని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత 12 ఏళ్లుగా సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలతో పాటు మీడియా, న్యాయవ్యవస్థపై కూడా కేంద్ర ప్రభుత్వం ప్రభావం చూపుతోందని, ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని సైతం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు.ప్రత్యర్థి పార్టీలకు మద్దతు ఇచ్చే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్లు తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ పరిణామాలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాడుతున్న ఇండియా కూటమి నేతలు, సీజేపీ యువజన నాయకులు అభిజిత్ దీప్తే, సౌరవ్ దాస్‌ల అరెస్టులను ఆయన ఖండించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చిన సందర్భంలో భారీగా పోలీసులను మోహరించడం, రైళ్లు, మెట్రో సేవలకు ఆటంకాలు కల్పించడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని విమర్శించారు...చంద్రబాబూ.. కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకో! ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షాల నిరసనలపై కూటమి ప్రభుత్వం నిర్బంధ చర్యలకు పాల్పడటాన్ని రఘువీరారెడ్డి తీవ్రంగా ఖండించారు. 2018లో ప్రధాని మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు అదే ప్రభుత్వానికి ఎలా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు...బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఎక్క?బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని టీడీపీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని రఘువీరారెడ్డి విమర్శించారు. రిజర్వేషన్లపై ఉన్న 50శాతంపరిమితినితొలగించకుండా బీసీలకు న్యాయం చేయడం సాధ్యం కాదని తెలిసినా ప్రభుత్వం కాలయాపనచేస్తోందనిఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2009-2014 మధ్య స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న పరిమితిని తొలగించి, జనాభా ప్రాతిపదికన ఓబీసీలకు రిజర్వేషన్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని తెలిపారు... ఎల్‌నినో ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం కావాలి..దేశంలో, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని రఘువీరారెడ్డి సూచించారు.

# భావోద్వేగాలతో మున్సిపల్ కౌన్సిల్‌కు వీడ్కోలు

● ఆఖరి సమావేశంలో ప్రతిపక్ష, అధికారపార్టీ సభ్యుల పరస్పరాభినందనలు
● జగ్గయ్యపేట అభివృద్ధిలో ఆల్‌టైమ్ రికార్డు రూ.205 కోట్ల నిధులతో పనులు



**జగ్గయ్యపేట, అక్టోబర్ 12, ప్రభాతవార్త :** ఐదేండ్ల క్రితం 2021 నవంబర్ 21వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం సోమవారం జరిగిన తమ తుది సమావేశంలో భావోద్వేగాలతో ఆనందపూర్వక సజల నేత్రాలతో వెల్లివిరిసింది. ఎప్పుడు కౌన్సిల్ సమావేశం జరిగినా పాలకపక్షం, ప్రతిపక్షం పరస్పర ఆరోపణలతో, నిందలతో హోరెత్తించిన సంఘటనలన్నీ కాలగర్భంలో కరిగిపోయాయి. కౌన్సిల్‌కు వీడ్కోలు పలుకుతూ ఆఖరి సమావేశంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్రతోపాటు, వైస్‌చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, పఠాన్ హఫీజున్నీసాబేగమ్ అందరు కౌన్సిలర్లు తమ అనుభవాలను, భావాలను వ్యక్తం చేస్తూ ఒకరికొకరు కృతజ్ఞతలు తెలుపుకున్న సన్నివేశాలు రక్తికట్టించాయి. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలనలో సగకాలం సామినేని ఉదయభాను, మిగిలిన కాలం శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఎమ్మెల్యేలుగా పనిచేసి అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. గడచిన ఐదేండ్ల కాలంలో రూ.205 కోట్ల నిధులు రాబట్టుకుని అభివృద్ధి పనులు విస్తృతం చేయటం జగ్గయ్యపేట మున్సిపల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఇది ఈ కౌన్సిల్ సాధించిన ఘనతగా గర్వపడుతున్నామని అన్నారు. కమిషనర్ ప్రసాద్ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత గడిచిన ఐదు నెలల కాలంలో కౌన్సిల్ తీరుతెన్నులు చూసి ముగ్ధుడనయ్యానన్నారు. అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే, చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తపన పడుతుండటం ముదావహమన్నారు. కాగా సమావేశంలో చైర్మన్‌తోపాటు కౌన్సిల్ సభ్యులందరిని జ్ఞాపిక,శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొలగాని రాము, కాశీ అనురాధ, సూర్యదేవర ఉషారాణి, వట్టెం మనోహర్, పూసల సీతరావమ్మ, పేరం సైదేశ్వరరావ, కన్నెబోయిన రామలక్ష్మి, నకిరికంటి వెంకట్, ఇర్రినరసింహారావు, సంగెపు బుజ్జిబాబు, దువ్వల రమాదేవి, సాధుపాటిరాజు , కర్ల శాంతకుమారి, కాకులపాటి సుందరమ్మ, మోరె సరస్వతి, షేక్ సిరాజూన, కంచేటి గీతారాణి, పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

# టెన్షన్ పెడుతున్న... పులి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, అక్టోబరు12, ప్రభాతవార్త:** గత వారం రోజులుగా తూర్పుగోదావరి జిల్లా లో తిరుగుతున్న పెద్దపులి అధికారులను ముప్పుతిప్పలు పెడుతోంది. పగటిపూట విశ్రాంతి తీసుకుంటూ రాత్రి సమయంలో దాదాపు 30 కిలోమీటర్లు దూరం వరకు సంచరిస్తూ ప్రజలకు, రైతులకు పశు యజమానులకు, అధికారయంత్రాంగానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.కాలర్ ఐడీ ద్వారా పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్న అధికారులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. అధికారయంత్రాంగంకి చిక్కకుండా ఎప్పటికప్పుడు పులి భయపెడుతూనే ఉంది. పగటిపూట పొలాల మధ్య, గుబురుల మధ్య విశ్రాంతి తీసుకుంటూ త్రాగునీటి ఆవారా ఉన్న ప్రాంతాల్లో ఉంటూ రాత్రి సమయంలో సంచరిస్తుంది. శనివారం చాగల్లు మండలంలో సేద తీరన పులి రాత్రికి పంగిడి రేచర్ల గౌరీపట్నం మధ్య క్వారీలో సంచరించింది.కృష్ణంపాలెంలో రాత్రి లేగ దూడపై పెద్దపులి దాడి చేసి చంపింది.ఆదివారం ఉదయం నుంచి రేచర్ల క్వారీ మధ్యలో జమీందారు తోటలో విశ్రాంతి తీసుకుని రాత్రికి దేవరపల్లి మండలం లక్ష్మీపురం నందవరం గ్రామాల మీదుగా ప్రయాణం సాగించింది. దేవరపల్లి సమీపంలో పోలవరం ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు.గతంలో ఈ దారిలో అయితే ఏ దారిలో అయితే వచ్చిందో అదే దారిలో వెళ్తుందని అంటున్నారు. గోదావరిని దాటి పోలవరం మండలం మీదుగా తూ.గో. జిల్లాలోకి ప్రవేశించింది. ఇప్పటివరకు ఎలాంటి ఆహారం తినకుండా 200 కి.మీ. పైగా సంచరించింది.మరోవైపు పెద్దపులిని సురక్షితంగా పట్టుకోవడానికి 80 మంది సిబ్బందితోఆపరేషన్ నడుస్తోంది. ఆయాశాఖల అధికారులు ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.అటవీశాఖ సిసిఎఫ్ జ్యోతి, డిఎఫ్ఓ ప్రభాకర్, ఫారెస్ట్ రేంజర్ దావీదు రాజు ఆధ్వర్యంలో సిబ్బందితోపాటు పూణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం సభ్యులు పులిని సురక్షితంగా పట్టుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

## నేటి అలంకరణ

# శ్రీ అన్నపూర్ణాదేవి



"ఉర్వీ సర్వజయేశ్వరీ జయకరీ మాతాకృపాసాగరీ
నారీనీల సమానకుంతల ధరీ నిత్యాన్నదానేశ్వరీ
సాక్షాన్ మోక్షకరీ సదాశుభకరీ కాశీపురాధీశ్వరీ
బిక్షాందేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ"

దసరా ఉత్సవాలలో మూడవ రోజున అమ్మవారిని శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరిస్తారు. సకల ప్రాణకోటికి జీవనాధారం అన్నమును పరబ్రహ్మ స్వరూపంగా కొలుస్తారు. రసపాత్రను ధరించి ఆదిబిక్షువైన ఈశ్వరుడికి భిక్ష ప్రసాదించిన దేవత అన్నపూర్ణాదేవి. ఆ తల్లిని ధ్యానిస్తే ఆహారంతో ఆరోగ్యం, మేధాశక్తి, వృద్ధి చెందుతుంది. మధుర భాషణం, సమయస్ఫూర్తి, వాక్‌సిద్ధి, శుద్ధి, భక్తి శ్రద్ధలు, ఐశ్వర్య సంపదలతో పాటు జ్ఞాన సంపదలు కలుగుతాయి. సకల సంపదలు అనుగ్రహించి మానవుణ్ణి సంపూర్ణుడిగా ఈ దేవి అనుగ్రహిస్తుంది. ప్రపంచ సృష్టి పోషకురాలు 'అమ్మ' అనే అంతరార్థం ఈ అవతారంలో కనిపిస్తుంది. అమ్మ ధరించిన రసపాత్ర అక్షయ శుభాలను అందిస్తుంది. బుద్ధి, జ్ఞానాలను ఈ తల్లి వరంగా ప్రసాదిస్తుంది. పరిపూర్ణ భక్తితో తనను కొలిచే భక్తుల పోషణాభారం వహించటమే కాక, జ్ఞాన సంపద, వైరాగ్యం కలిగించి తద్వారా అత్యుత్తమమైన మోక్ష మార్గం ప్రసాదిస్తుందని ఆర్షవాక్యం.

**అలంకారం:** అమ్మవారిని గడపపచ్చ వర్ణంతో కూడిన పట్టుచీరతో అలంకరిస్తారు.

**మంత్రం:** "హ్రీం శ్రీం క్లీం ఓం నమో భగవత్యన్నపూర్ణేశి మమాభిలషిత మహిదేవ్యన్నం స్వాహా" అనే మంత్రాన్ని 108 సార్లు జపించాలి.

**నైవేద్యం:** అమ్మవారికి రవ్వకేసరి, కొబ్బరన్నం నివేదించి తెల్లని పుష్పాలతో అన్నపూర్ణ అష్టోత్తరం, స్తోత్రాలు పారాయణ చేస్తూ అమ్మవారిని పూజించాలి.

- భట్టిప్రోలు నటరాజకుమార్

## యాలకులతో ఎంతందమో!

**మిఠాయిలకు సువాసనలిచ్చే యాలకులు నోటి ఇన్ఫెక్షన్లను దూరం చేస్తున్నారు. ఆహారం జీర్ణమయ్యేలా చేయడంతోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలకూ చెక్ పెడతాయనీతెలుసు. అందాన్నీ పెంచుతాయనీ తెలుసా?**



స్పూను చొప్పున యాలకుల పొడి, పంచదార, తేనె తీసుకుని బాగా కలపాలి. దీన్ని ముఖానికి మృదువుగా రుద్ది, పదినిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. ఈ స్క్రాబ్ మృతకణాలను తొలగించ డంతోపాటు చర్మానికి కావాల్సి న తేమని అంది స్తుంది. మాస్క్ ప్రయత్నిం చాలంటే స్పూను యాలకుల పొడికి చిటికెడు పసుపు, కొన్ని చుక్కల నిమ్మరసం కలిపితే సరి. దీన్ని పావుగంట ఎప్పు ముఖానికి రాసి, కడిగే యాలి. కప్పు రోజ్వాటర్కి స్పూను యాలకుల పొడి కలిపి, అరగంటసేపు నానబెట్టాలి. తరవాత వడకట్టి, స్ప్రే బాటిల్లో పోసు కోవాలి. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచుకుంటే టోనర్లా పనిచేస్తుంది. యాలకుల్లో అక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌లో పోరాడి వృద్ధాప్యరాయలు త్వరగా దరిచేరకుండా చూడటమే కాదు... అనేక చర్మసమస్యల నుంచీ కాపాడతాయి. రక్తప్రసరణ మెరుగయ్యేలా చూస్తూనే చర్మకణాలకు న్యూట్రియంట్లు, ఆక్సిజన్ సరఫరా మెరుగయ్యేలా చేస్తుంది. తద్వారా యవ్వనవంతమైన చర్మం సొంతమయ్యేలా చూస్తాయి. ఎన్ని సుగుణాలో కదా... అలాగని చకచకా పూయడం మొదలు పెట్టేయొద్దు. ఇతర ఉత్పత్తుల్లాగే దీన్ని ముందు స్కిన్ టెస్ట్ చేసుకోండి. ఎర్రబడటం, దద్దుర్లు లేకపోతే...చక్కగా కొనసాగించండి.

## ఆధ్యాత్మికత భావనతోనే చింతన



పిల్లలకు చదువు ఎంత ప్రధానమో.. ఆధ్యాత్మిక చింతన కూడా అంతే అవసరం. దీనివల్ల జీవితంలో సన్మార్గంలో నడవడంతో పాటు, సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, ఒత్తిడిని అధిగమించి మానసిక ప్రశాంతత ఎలా పొందాలి మొదలైన విషయాలు తెలుస్తాయంటు న్నారు నిపుణులు. అయితే పిల్లలకు ఆధ్యాత్మిక చింతనను అలవర్చే తల్లిదండ్రులు కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు. మరి, అవేంటో తెలుసుకుందాం. ...

కుటుంబపరంగా, సమాజపరంగా వివిధ ఆచారాలు, సంప్రదాయాలు పాటించడం సహజం.వాటివల్ల కొన్ని ప్రయోజనాలు కూడా ఉంటాయి. కానీ, ఈ రోజుల్లో చాలామంది వాటి అసలు అర్థం తెలుసుకోకుండా ఎవరికి నచ్చినట్టు వారు మార్చేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు గుడ్డిగా పాటించేస్తూ అసలు గాలికి వదిలేస్తు న్నారు. కాబట్టి, ముందుగా మీరు పిల్లలకు ఏ విషయాలు నేర్పించాలనుకుంటున్నారో వాటి గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ తర్వాత పిల్లలకు నేర్పించడం వల్ల ఆయా ఆచారాలు, సంప్రదాయాల వల్ల కలిగే లాభాలు ఏంటో వారు తెలుసుకోగలుగుతారు. వారికి క్రమేపీ ఆధ్యాత్మికత దిశగా ఆసక్తి కలుగుతుంది..

**కథలు చెప్పాలి...** వివిధ గ్రంథాలు, పురాణాలు మొదలైన వాటిలో ఉండే వివిధ అంశాల గురించి పిల్లలకు చిన్న చిన్న కథల రూపంలో చెప్పడం వల్ల వారిలో ఆధ్యాత్మిక భావన పెరుగుతుంది. అలాగే జీవితంలో వచ్చే ఎత్తుపల్లాలను ఎలా ఎదుర్కోవాలి? ఇతరులతో ఎలా ప్రవర్తించాలి? వంటి విషయాలు వారికి వ్యక్తిగత పాఠాలుగా ఉపయోగపడతాయి.

**చేసి చూపించాలి...** అసలు విషయాలు శోధించాలే కానీ ప్రతి మతంలోనూ ఎన్నో మంచి విషయాలు దాగి ఉంటాయి. చాలా మంది వీటి గురించి నలుగురిలో ఉన్నప్పుడు మాట్లాడతారు కూడా. మానవ సేవే మాధవ సేవ, అబద్ధాలు చెప్పకూడదు. మోసం చేయకూడదు.. మొదలైనవన్నీ అందులో భాగమే. అయితే పాటించాల్సి న సమయం వచ్చినప్పుడు మాత్రం చాలా మంది వెనకడుగు వేస్తారు. పిల్లల విషయంలో మీరూ ఈ తప్పులు చేయకూడదని నిపుణులు, మంచి అలవాట్లను మీరు పాటిస్తూ, వారినీ పాటించేలా చూడాలన్నారు. అప్పుడే వాళ్ల ఆధ్యాత్మికతకు అసలైన అర్థమేంటో . తెలుసుకోగలుగుతారు.

**ధ్యానం..** ధ్యానానికి ఎంతో ప్రాముఖ్యం ఉంటుంది. అయితే ఒక్కొక్కరు ఒక్కో విధంగా ధ్యానం చేస్తారు. ఎలా చేసినా అంతిమంగా కలిగే ప్రయోజనాలు మాత్రం దాదాపు ఒకేవిధంగా ఉంటాయి. కాబట్టి మీ పిల్లలు క్రమం తప్పకుండా ధ్యానం చేసేలా ప్రోత్సహించండి. దీనిద్వారా వారికి ఆధ్యాత్మిక భావన కలగడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. ఫలితంగా చదువులోనూ రాణించగలుగుతారు. చదువుకు ఆటంకం కలగకుండా..!పిల్లలకు చదువుకునే వయసులోనే ఆధ్యాత్మిక చింతనను కూడా అలవరిస్తే వారు మంచి విజయాలను సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఆధ్యాత్మికతను అలవాటు చేయాలంటే వారి చదువుకు భంగం కలగ కుండా జాగ్రత్త పడాలి. ఎక్కువ సమయం పట్టే కార్యక్రమాలను ఆరోజు వరకు సెలవు రోజుల్లోనే సాధన చేయడం. అందువల్ల వారి చదువుకి ఎలాంటి ఆటంకం కలగదు.

## ఎండు దానిమ్మ శ్రేష్ఠమే ..



**ఈ కాలంలో మనల్ని తరచుగా ఏవో అనారోగ్యాలు వేధిస్తుంటాయి.** దానికి ప్రధాన కారణం రోగనిరోధక శక్తి తగ్గడం, అలా కాకూడదంటే సి విటమిన్ ఎక్కువగా ఉండే ఆహారం తినాలి. అందులో దానిమ్మది మొదటి స్థానం. తీపికి కాస్త పులుపు జోడించినట్లుండే దానిమ్మ ఎంత రుచిగా ఉంటుందో అంత ఆరోగ్యకరం కూడా. అందుకే ఇవి దొరికే కాలంలో తాజా పండ్లను ఎటూ తింటాం, అన్సీజన్‌లోనూ ఎండు తినడం చేసుకోమంటున్నారు నిపుణులు, పిస్తా, బాదం, జీడిపప్పు, కిస్మిస్, అంజీరా తదితర డ్రై ఫ్రూట్స్‌కు మల్లే ఎండు దానిమ్మ ఆరోగ్యానికి చాలా మంచిది. దానిమ్మలో సోడియం, కాపర్, పొటాషియం, మెగ్నీషియం, పీచు, ఐరన్, సి, కె, బి6 విటమిన్లు విస్తారంగా ఉంటాయి. ఎండు దానిమ్మ గింజలు విడిగానూ తినొచ్చు. పెరుగు, సలాడ్స్ లోనూ వేసుకో వచ్చు. మొలకెత్తిన పెసలు, శనగల్లో పల్లీలు, మిరియాల పొడితో బాటు కొంచెం డ్రై అనార్ పౌడర్ వేస్తే ఆ రుచి వేరు. ఎండుద్రాక్ష కంటే ఎండు దానిమ్మ శ్రేష్ఠం. టొమాటో, బంగాళదుంప తదితర కూరల్లో ఎండు దానిమ్మ గింజల పొడి వేయడం వల్ల పోషకాలు అందడమే కాకుండా అదనపు రుచి తోడవుతుంది. రెండు కప్పుల నీళ్లలో చారెడు ఎండు దానిమ్మ గింజలు వేసి అరకప్పు అయ్యేదాకా ఉడికించి ఉదయాన్నే తాగితే అనేక ఆరోగ్య సమస్యలు అరికట్టినట్టే. ఈ గింజలకు ఒక చిన్న బీట్రూట్ కలిపి ఉడికించి గ్రైండ్ చేసి తాగితే హిమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. ఎర్రరక్త కణాల వృద్ధిచెందుతాయి. రక్తపోటు రాదు, ఎండు దానిమ్మలో ఎక్కువ విటమిన్లు, తక్కువ కాలరీలు ఉండటాన కొలెస్ట్రాల్ పెరగదు. గుండె సంబంధ వ్యాధులు రావు. రక్తలేమికి ఇది దివ్యౌషధం. కీళ్ల నొప్పులు, అర్థరైటిస్ తగ్గుతాయి. జ్ఞాపకశక్తి పెరుగుతుంది, ఊబకాయం రాదు. జీర్ణప్రక్రియ మెరుగవుతుంది. వంతులు, వికారం తగ్గుతాయి. ఎండు దానిమ్మ గింజల పొడిలో చిటికెడు మిరియాల పొడి కలిపి పళ్ళ, చిగుళ్లకు మర్దన చేస్తే పంటి సమస్యలు తలెత్తుతాయి. దంతాలు దృఢంగా ఉంటాయి.

## నేడు నానబియ్యం బతుకమ్మ



బతుకమ్మ సంబురాల్లో నాలుగవ రోజు తంగేడు, గునుగు, బంతి, చెమంతి తదితర పూలను మూడు ఎత్తుల్లో పేర్చి, గౌరమ్మను వాటిపై పెడతారు.

**ఈ రోజు నైవేద్యం:** నానబియ్యంలో బెల్లం, పాలు కలుపుతారు. .

# తెర

## ఫన్, ఎమోషన్ తో 'క్రేజీ కళ్యాణం'

**డా. నరేష్ విజయ కృష్ణ**



నవరసరాయ డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అ ఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా ఈ నెల 16న "క్రేజీ కల్యాణం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది.

ఈ రోజు మన తెలుగు సినిమా ప్రపంచ సినిమాతో పోటీ పడాల్సి వస్తోంది. ప్రేక్షకుల్ని ఒప్పించి థియేటర్స్ దాకా తీసుకురావడం గగనమైపోయింది. సక్సెస్ ఫెయిల్యూర్స్ ఎప్పుడూ ఉంటాయి. మనకున్న సక్సెస్ రేట్ చాలా తక్కువ. బాలీవుడ్ లో రాజేష్ ఖన్నా సినిమా నుంచి అమితాబ్ సినిమాలు...అలా ఒక ట్రెండ్ కొనసాగుతూ వచ్చింది. తెలుగులో కూడా ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణగారు, చిరంజీవి..ఇలా మన దగ్గరా మూవీ జర్నీ మారుతూ వచ్చింది. క్రేజీ కల్యాణం సినిమా నాలుగు స్తంభాలాట లాంటిది నేను, తరుణ్ భాస్కర్, అనుపమ, అఖిల్.. ఈ నలుగురి క్యారెక్టర్స్ నాలుగు ఫిల్లర్స్ లాంటివి. అందులో నా పాత్రకు ఇంకొంత ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. గతంలో హాలీవుడ్ లో ఇలాంటి సినిమాలు వచ్చేవి. ఒక మెయిన్ క్యారెక్టర్ ఆ పాత్ర చుట్టూ మరికొన్ని పాత్రలు ఉంటాయి. నా పాత్ర ఈ సినిమాకు హీరో అంటే..హీరోయిజంకు ఇప్పుడు అర్థం మారిపోయింది. పాటలు, ఫైట్స్, రొమాన్స్ చేస్తేనే హీరో కాదు. కథకు లీడ్ తీసుకుని మెప్పించే పాత్రే హీరో.

డైరెక్టర్ బద్రప్పను నేను కె విశ్వనాథ్ గారితో పోల్చాను. ఎందుకంటే ఆయన తన సినిమాల్లో నేటివిటీకి దూరంగా వెళ్లకుండా కొత్త దారిలో కథ చెబుతూ పాత్రలకు ఒక కొత్త అర్థాన్నిస్తూ సినిమా రూపొందిస్తారు. ఆ పాత్రలకు ఒక మంచి ముగింపు ఇస్తారు. బద్రప్ప కూడా క్రేజీ కల్యాణం సినిమాను అలాగే డీల్ చేశాడు. కె విశ్వనాథ్ గారి సినిమాల్లోని ఎమోషన్ ను ఈ చిత్రంలో బద్రప్ప తీసుకొచ్చారు.




## కాస్ట్ టీజర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది

**వ**రుణ్ సందేశ్, గగన్ బాబు, సత్యం రాజేష్, రవి సోషల్ డ్రామా కాస్ట్ ఇంటెన్స్ అండ్ గ్రిప్పింగ్ టీజర్ లాంచ్ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కోటేశ్వరరావు గారు మాకు మంచి మిత్రులు. తన తొలి ప్రయత్నంగా ఒక మంచి సినిమా తీస్తున్నారు. ఇరుముడి సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ గారు, డైరెక్టర్ శివ నిర్వాణ గారు ఈ కార్యక్రమానికి రావడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ శివ నిర్వాణ మాట్లాడుతూ.. ఈ టీజర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. కచ్చితంగా మీ అందరినీ అలరిస్తుంది.మా హీరోలు వరుణ్ సందేశ్ గారు, గగన్ గారు, రవి గారితో పాటు మా టెక్నీషియన్లందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. హీరో గగన్ బాబు మాట్లాడుతూ.. నేను పుష్ప సినిమాకు పనిచేశాను. నవీన్ గారు కథ విన్నారంటే ఏ సినిమా ఎక్కడ, ఎంతవరకు వెళ్తుందో చెప్పగలరు. సత్యం రాజేశ్ మాట్లాడుతూ.. మా నిర్మాత ఈ సినిమాను చాలా ప్రేమించి చేశారు. సినిమాను చాలా అద్భుతంగా తీశారు.



## పవన్ కళ్యాణ్‌కు అల్లు అరవింద్ అభినందనలు

**సి**నీ రంగంలో పవన్ కళ్యాణ్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో కలిసి చేసిన తొలి సినిమా "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" నుంచి ఇప్పటి వరకు సాగిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. మూడు దశాబ్దాల కాలం ఇంత త్వరగా గడిచిపోయిందా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సినీ రంగంలో పవన్ కళ్యాణ్ సాధించిన విజయాలను అభినందిస్తూ, ఆయన ఎంచుకునే ప్రతి మార్గంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు. సినిమాలకే పరిమితం కాకుండా సమాజం పట్ల పవన్ కళ్యాణ్‌కు ఉన్న దూరదృష్టిని కూడా అల్లు అరవింద్ ప్రశంసించారు. సినిమా రంగం వెలుపల కూడా ఆయన చేస్తున్న సేవలను, సమాజం కోసం అందిస్తున్న తన వంతు కృషిని అభినందించారు. పవన్ కళ్యాణ్ సినీ ప్రయాణం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, మరోసారి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఆయన చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరుకుంటూ తన ఆశీస్సులు అందించారు. సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న పవన్ కళ్యాణ్, ప్రస్తుతం సినీ రంగంతో పాటు ప్రజా జీవితంలోనూ తనదైన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన 30 ఏళ్ల సినీ ప్రస్థానం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

## బా బా బ్లాక్ షీప్‌కి మంచి రెస్పాన్స్

**నిర్మాత వేణు దోనేపూడి..**



**దో**నేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై గుణి మంచికంటి దర్శకుడిగా వేణు దోనేపూడి చిత్రీకరించిన తెలుగు క్రైమ్ కామెడీ బా బా బ్లాక్ షీప్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. ఈ మూవీలో నటించిన ఉపేంద్ర లిమాయే, అక్షయ్ లగుసాని, విష్ణు ఓయి, రాజా రవీంద్ర, జార్జ్ మరియన్, టీనూ ఆనంద్, కశ్యప్, కార్తికేయ దేవ్, సమ్రీధీ ఆర్యల్, మాల్వీ మల్హోత్రా, విస్మయ శ్రీ, కశ్యప్ తదితరులకు మంచి గుర్తింపు లభించింది.

**..మీ నేపథ్యం గురించి చెప్పండి?..**

మా తాత గారు థియేటర్ నడిపించేవారు. మా నాన్న గారు థియేటర్‌ను కొన్నేళ్ల క్రితమే క్లోజ్ చేశారు. సినీ రంగంతో మా ఫ్యామిలీకి పరిచయం ఉంది. 90వ దశకంలో యూఎస్‌లో ఆటో మొబైల్ బిజినెస్ చేశాను. అక్కడే డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ కూడా చేశాను. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా, సింగపూర్ ఇలా అన్ని దేశాల్లో సినిమాల్ని డిస్ట్రిబ్యూట్ చేశాను. 2008లో నేను ఇండియాకి వచ్చాను. నాగేశ్వరరావు గారిని నేను తాతగారు అని పిలిచేవాడ్ని. అన్నపూర్ణ బ్యానర్‌తోనే ఇండస్ట్రీకి పరిచయమవ్వు అని నాగేశ్వరరావు గారు అన్నారు. అప్పుడు 'మనం' చిత్రంతో ఆయన బిజీగా ఉన్నారు.

**విశ్వంతో ఏం నేర్చుకున్నారు?**

'మనం' తర్వాత గోపీ మోహన్ గారు, శ్రీను వైట్ల గారు పరిచయం అయ్యారు. అలా 'విశ్వం' జర్నీ మొదలైంది. అతి మంచితనం పనికి రాదు అని ఆ ప్రయాణంలో తెలిసింది. కో ప్రొడ్యూసర్స్‌గా వచ్చిన వారు ఒరిజినల్ ప్రొడ్యూసర్స్‌గా ప్రవర్తించారు. షూటింగ్ పూర్తికాక ముందే అన్ని రకాల బిజినెస్‌లు క్లోజ్ అయ్యాయి.

**..ఇంత నేపథ్యం ఉండి కూడా ఆలస్యంగా ఇండస్ట్రీలోకి ఎందుకు వచ్చారు?..**

ఇండస్ట్రీ ఎలా ఉంటుంది.. ఇక్కడి పరిస్థితులు ఏంటి? అన్నది మా ఫ్యామిలీకి తెలుసు. అవసరమా? అని అందరూ నన్ను ఆపారు. సినిమాల వల్ల కూడా గౌరవం వస్తుంది కదా అని నేను ఇండస్ట్రీలోకి వచ్చాను. ఫిల్మ్ ఛాంబర్ వల్ల 'విశ్వం' విషయంలో కాస్త సేఫ్ అయ్యాను.




## గ్రాండ్‌గా రవితేజ తులాభారం లాంచ్

**మా**స్ మహారాజా రవితేజ, దర్శకుడు వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్‌లో మోస్ట్ ఎవైటెడ్ ఆర్‌టి78 తెరపైకి వస్తోంది. రవితేజ ట్రేడ్‌మార్క్ ఎనర్జీ, వివేక్ ఆత్రేయ యూనిక్ స్టయిల్ స్టోరీ టెల్లింగ్ కలగలిసి క్రైమ్, డ్రామా, ఎంటర్‌టైన్‌మెంట్‌తో సరికొత్త అనుభూతిని అందించనున్నాయి. బ్లాక్‌బస్టర్ ఇరుముడి విజయంతో జోరు మీదున్న రవితేజ.. ఈ ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్నారు. బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లక్ష్మణ్, శ్రీనిరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా టైటిల్‌ను రివిల్‌ను మేకర్స్ వినూత్నంగా రూపొందించిన ది టైటిల్ డాక్యుమెంటరీ వీడియోను విడుదల చేశారు. వివేక్ ఆత్రేయ తనదైన స్టయిల్ లో రూపొందించిన ఈ వీడియోను మై హోమ్ రామ్ విడుదల చేశారు. తులాభారం టైటిల్‌ను ఎంపిక చేసే ప్రక్రియ వెనుక జరిగిన సరదా, వినోదభరితమై సంభాషణలను ఈ వీడియో ద్వారా చూపించారు. చిత్ర బృందం ఈరోజు సినిమా పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంతో సినిమా అధికారికంగా ప్రారంభమై, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌లోకి అడుగుపెట్టనుంది. శ్రీ విష్ణు క్లాప్ కొట్టారు వివేక్ ఆత్రేయతో తరచుగా కలిసి పనిచేసే వివేక్ సాగర్ సంగీతాన్ని అందిస్తున్నారు.



## ఘనంగా ట్రయల్ అండ్ ఎర్రర్ పూజా కార్యక్రమం

నిర్మాత శరత్ మరార్ నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సత్యదేవ్, ఫరియా అబ్దుల్లా, రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ 'ట్రయల్ అండ్ ఎర్రర్' సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమల్ హాసన్ నటించిన స్టైలిష్ థ్రిల్లర్ 'చీకటి రాజ్యం'కు దర్శకత్వం వహించిన రాజేష్ సెల్వ ఈ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన పాత్రల్లో తనదైన నటనతో ఆకట్టుకునే సత్యదేవ్.. ఈ సిరీస్ లో ఛాలెంజింగ్ క్యారెక్టర్ చేస్తున్నారు. ఇందులో రమ్యకృష్ణ కీలక పాత్రలో నటిస్తున్నారు. తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో కథకు మరింత ఇంటెన్సిటీ తీసుకురానున్నారు. ఫరియా అబ్దుల్లా కూడా ఈ ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ఈ సిరీస్‌లో విరాజ్ అశ్విన్, చైతన్య కృష్ణ, వర్ష బొల్లమ్మ, యష్ పూరి, సంపత్ రాజ్, సుబ్బరాజు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మాణంలో, రాజేష్ సెల్వ దర్శకత్వంలో రూపొందుతున్న 'ట్రయల్ అండ్ ఎర్రర్'.. ప్రతిభావంతులైన నటీనటుల కలయికతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

13-10pg10.qxd:13-10pg10.qxd 1/1/02 6:40 AM Page 1



# డెన్మార్క్ ఓపెన్‌లో సింధుకు ఆన్ సేయంగ్ సవాల్

## సత్విక్-చిరాగ్‌ల పునరాగమనం



**ఒడెన్స్:** మంగళవారం డెన్మార్క్ ఓపెన్ 2026 లో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో తొలి రౌండ్‌లోనే ప్రపంచ నంబర్ 1 ఆన్ సే యంగ్‌తో పీవీ సింధుకు గట్టి సవాలు ఎదురుకానుంది. ఈ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్‌లో సత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిల పురుషుల డబుల్స్ జోడి పునరాగమనం కూడా ఒక ప్రధాన చర్చనీయాంశం కానుంది. ఈ టోర్నమెంట్‌లో బలమైన అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొంటున్నారు. సింగిల్స్ మరియు డబుల్స్ విభాగాలలో తమదైన ముద్ర వేయడానికి భారతదేశం ఇప్పటికే పేరుపొందిన స్టార్లు మరియు వర్ధమాన ప్రతిభావంతులపై ఆధారపడుతోంది. ఈ ఏడాది ఆరంభంలో జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్ గెలుచుకున్న సింధ , తొలి రౌండ్‌లో రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సే యంగ్‌తో తలపడనుంది. ప్రస్తుతం ప్రపంచంలో 10 వ ర్యాంక్‌లో ఉన్న రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత అయిన సింధు, వీరిద్దరి మధ్య జరిగిన గత 10 ముఖాముఖి పోరులో ఆన్‌ను ఇంకా ఓడించలేదు. మహిళల బ్యాడ్మింటన్‌లో అత్యంత ఆధిపత్యం చెలాయించే క్రీడాకారిణులలో ఒకరితో ఉన్న కఠినమైన హెడ్ టు హెడ్ రికార్డును అధిగమించాలని సింధు చూస్తున్నందున ఈ ప్రారంభ పోరు ఆమె టైటిల్ ఆశలకు తొలి పరీక్షగా నిలుస్తుంది. భారత మహిళల సింగిల్స్ జట్టులో తన్వి శర్మ, అష్మిత చలిహా, దేవికా సిహాగ్ మరియు ఉన్నతి హూడా కూడా ఉన్నారు.





# రంజీ ట్రోఫీ.. 135 రన్స్ ఆధిక్యంతో మధ్యప్రదేశ్

## జమ్మూ కాశ్మీర్‌పై పైచేయి

**శ్రీనగర్:** జమ్మూ కాశ్మీర్‌ను 120 పరుగులకే ఆలౌట్ చేసి తొలి ఇన్నింగ్స్‌లో 76 పరుగుల ఆధిక్యం సాధించిన మధ్యప్రదేశ్, రెండో రోజు ఆట ముగిసేనాటికి నాలుగు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. అఖిబ్ నబీ చివరిలో కొట్టిన వికెట్లు ఆతిథ్య జట్టును పోటీలో నిలబెట్టడంతో, మొత్తం మీద 135 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మధ్యప్రదేశ్‌కు ఆధిక్యం ఉన్నప్పటికీ, గ్రూప్ ఎ రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో జమ్మూ కాశ్మీర్‌కు కూడా పట్టు లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ కాశ్మీర్‌ను 120 పరుగులకే ఆలౌట్ చేసి 76 పరుగుల ఆధిక్యం సాధించిన మధ్యప్రదేశ్, రెండో రోజు ఆట ముగిసేనాటికి నాలుగు వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసింది. అఖిబ్ నబీ చివరిలో కొట్టిన వికెట్లు ఆతిథ్య జట్టును పోటీలో నిలబెట్టడంతో, మొత్తం మీద 135 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. సోమవారం షేర్‌ఇకాశ్మీర్ స్టేడియంలో నెలకొన్న మేఘావృత వాతావరణాన్ని సద్వినియోగం చేసుకున్న ఆవేశ్ ఖాన్, తన మొదటి ఓవర్‌లోనే నైట్‌వాచ్‌మ్యాన్ వంశజ్ శర్మను అవుట్ చేసి, జమ్మూ కాశ్మీర్‌కు ఆ రోజు కష్టంగా గడవడానికి నాంది పలికాడు. రౌండ్ ది వికెట్ బౌలింగ్ చేస్తూ, ఆవేశ్ (29 పరుగులకు మూడు వికెట్లు) మరియు ఆర్యన్ పాండే (44 పరుగులకు మూడు వికెట్లు) క్రమశిక్షణతో కూడిన లైన్ అండ్ లెంగ్త్‌ను కొనసాగిస్తూ, క్రమం తప్పకుండా వికెట్లు తీశారు. పిచ్‌లో ఎలాంటి లోపాలు లేనప్పటికీ, అనుభవజ్ఞులైన ఖమ్రాన్ ఇక్బాల్ మరియు పరాస్ డోగ్రా కూడా బంతిని ముందుకు తీసుకెళ్లడానికి చాలా కష్టపడ్డారు.

# షాంఘై నుండి అల్కరాజ్ నిష్క్రమణ

## జ్వెరెవ్ తొలిసారిగా నంబర్ 1 స్థానం

**షాంఘై:** సోమవారం షాంఘై మాస్టర్స్‌లో స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ అనూహ్య ఓటమిని చవిచూడటంతో, అలెగ్జాండర్ జ్వెరెవ్ తన కెరీర్‌లో తొలిసారిగా ఏటీపీ ఇయర్



ఎండ్ నెంబర్ 1 ర్యాంకింగ్‌ను కైవసం చేసుకుని తన అద్భుతమైన 2026 సీజన్‌లో ఒక ప్రధాన మైలురాయిని సాధించాడు. రౌండ్ ఆఫ్ 32 లో బెల్జియంకు చెందిన జిజౌ బెర్గ్స్ చేతిలో 7-5, 7-6 ( 4 ) తేడాతో అల్కరాజ్ నిష్క్రమించాడు. అంతకు ముందు జరిగిన రౌండ్ ఆఫ్ 32 పోరులో ఫ్రాన్స్‌కు చెందిన ఆర్థర్ గియా చేతిలో ఓడిపోయిన అమెరికన్ బెన్ షెల్టన్ నిష్క్రమించడంతో ఈ ఫలితం సంవత్సరాంతపు ర్యాంకింగ్స్‌లో జ్వెరెవ్ అగ్రస్థానాన్ని ఖరారు చేసింది. ఎటిపి యొక్క సంవత్సరాంతపు నంబర్ 1 గా ఒక సీజన్‌ను ముగించిన మొదటి జర్మన్ ఆటగాడిగా జ్వెరెవ్ నిలవనున్నాడు. జ్వెరెవ్ షాంఘై మాస్టర్స్‌లో తన ఆటను కొనసాగిస్తున్నాడు మరియు మంగళవారం నాడు రౌండ్ ఆఫ్ 16 లో అలెగ్జాండర్ బుబ్లిక్‌ను ఎదుర్కోనున్నాడు.





# వైట్‌వాష్ నుండి తప్పించుకున్న భారత్

## ఆస్ట్రేలియా ఓడినా 2-1తో సిరీస్ కైవసం

**పుదుచ్చేరి:** మూడవ మరియు చివరి50 ఓవర్ల మ్యాచ్‌లో, గుర్జప్‌నీత్ సింగ్, యశ్ ఠాకూర్, నిశాంత్ సింధు నేతృత్వంలో జరిగిన బౌలింగ్ ప్రదర్శనతో ఇండియా జట్టు ఆస్ట్రేలియాను 49 పరుగుల తేడాతో ఓడించి సిరీస్ వైట్‌వాష్‌ను తప్పించుకుంది. 276 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో, ఇండియా 46.2 ఓవర్లలో ఆస్ట్రేలియాను 226 పరుగులకే ఆలౌట్ చేసింది. 177/3 స్కోరు వద్ద నిలిచిన ఆస్ట్రేలియ కేవలం 49 పరుగులకే తమ చివరి 7 వికెట్లను కోల్పోయి నాటకీయంగా కుప్పకూలింది. అయినప్పటికీ, ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2 -1 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఇండియా 49.3 ఓవర్లలో 275 పరుగులకే ఆలౌట్ అయింది. సూర్యాంశ్ షెడ్గే 66 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టగా, విప్రజ్ నిగమ్ 40 పరుగులు చేసి టాప్ ఆర్డర్ పతనం నుండి ఆతిథ్య జట్టును ఆదుకున్నాడు. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌ల ద్వారా ఇండియా వేగవంతమైన ఆరంభాన్ని అందుకుంది . వీరిద్దరూ తొలి వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యా న్ని నెలకొల్పారు. 11వ ఓవర్‌లో ప్రభ్‌సిమ్ర న్ 39 పరుగులు చేసి అవుటవడంతో ఆ జట్టు పతనం ప్రారంభమైంది. దీంతో ఇండియా 35 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి 118/5 స్కోరుకు పడిపోయింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, షెడ్జ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నించి 33 పరుగులు చేశాడు. అయితే మిచెల్ ఓవెన్ గైక్వాడ్‌ను అవుట్ చేయడంతో ఇండియా 159/6 తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత షెడ్జ్, నిగమ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను పునర్నిర్మించగా, వారి ఏడవ వికెట్ భాగస్వామ్యం ఇండియాకు ఊపునిచ్చింది. ఈ జంట యొక్క 85 పరుగుల భాగస్వామ్యం స్కోరును 275 కు చేర్చి బౌలర్లకు కాపాడుకోవడానికి ఒక పోటీ లక్ష్యాన్ని అందించింది. దీనికి ప్రతిగా ఆస్ట్రేలియా జోష్ ఫిలిప్ 82 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పి, చక్కటి అర్ధశతకం సాధించాడు. ఫిలిప్‌ను అవుట్ చేసి నిగమ్ ఆ భాగస్వామ్యాన్ని విడగొట్టగా, ఆ తర్వాతి ఓవర్‌లోనే లియామ్ స్కాట్ కూడా అవుటవడంతో ఇండియా మ్యాచ్‌పై తమ పట్టును మరింత బిగించింది. 39 పరుగులు చేసిన నాథన్ మెక్‌స్వీనీ, 31 పరుగులు చేసిన లాచ్లాన్ షా కలిసి మూడో వికెట్‌కు 58 పరుగులు జోడించి ఆస్ట్రేలియాను పోటీలో నిలిపారు. అయితే గుర్జప్నీత్, ఠాకూర్, సింధు క్రమం తప్పకుండా వికెట్లు తీయగా , నిఖిల్‌ని సరైన సమయంలో రనౌట్ చేయడం మరింత బలహీనపరిచింది. చివరకు ఆస్ట్రేలియా 226 పరుగులకే ఆలౌట్ కావడంతో ఇండియాకు ఓదార్పు విజయం లభించింది.

# వెస్టిండీస్‌తో హైదరాబాద్ మ్యాచ్‌లో.. టీమిండియాలో ముగ్గురు బెంచ్‌కే పరిమితం



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఇప్పటివరకు 3 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. భారత్ రెండు మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, వెస్టిండీస్ ఒక మ్యాచ్‌లో గెలిచింది. వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో నాలుగో మ్యాచ్ ఈ నెల 14న హైదరాబాద్ లో జరగనుంది. ఈ నాలుగో ఫలితమే సిరీస్‌పై కీలక ప్రభావం చూపనుంది. ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ ఓడిపోతే భారత్ సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంటుంది. చివరి మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా సిరీస్ సొంతం చేసుకుంటుంది. ఈ మ్యాచ్‌లో ముగ్గురు ఆటగాళ్లకు ప్లేయింగ్ 11లో అవకాశం ఇవ్వకపోవచ్చు. మరోసారి ఈ ముగ్గురు బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశముంది. ఆల్‌రౌండర్ శివమ్ దూబెకు వెస్టిండీస్‌తో తొలి రెండు టీ20ల్లో అవకాశం లభించింది. అయితే అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. దీంతో మూడో మ్యాచ్‌లో అతడిని ప్లేయింగ్ 11 నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. దూబే స్థానంలో నితీశ్ కుమార్‌ని జట్టులోకి తీసుకున్నారు. అతను చూపించిన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో తదుపరి హైదరాబాద్‌లో కూడా శివమ్ బెంచ్‌కే పరిమితం అయ్యే అవకాశం ఉంది. ఇక వరుణ్ చక్రవర్తి ఫిట్‌గా లేకపోవడంతో కుల్దీప్ యాదవ్‌ను ఎంపిక చేశారు. తొలి మ్యాచ్‌లో 2 వికెట్లు తీసుకుని ఆకట్టుకున్నాడు. అయితే రాంచీ మ్యాచ్‌లో 53 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ మాత్రమే సాధించాడు. మరోవైపు అక్షర్ పటేల్, నమన్ ధీర్ బ్యాటింగ్‌లోనూ సహకారం అందించగలగడంతో పేస్ బౌలింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కుల్దీప్‌ను పక్కన పెట్టింది. అతడి స్థానంలో ప్రిన్స్ యాదవ్‌కు అవకాశం ఇచ్చారు. నాలుగు ఓవర్లలో 37 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయినా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. దీంతో తదుపరి మ్యాచ్‌లోనూ ప్రిన్స్‌కు అవకాశం దక్కవచ్చు. అదే జరిగితే కుల్దీప్ మరోసారి బెంచ్‌పైనే ఉండాల్సి రావచ్చు. కాగా లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కు ఈ నాలుగో మ్యాచ్‌లోనూ అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. తొలి మూడు మ్యాచ్‌ల్లోనూ అతడు తుది జట్టులో చోటు సంపాదించలేకపోయాడు. ఇదే పరిస్థితి నాలుగో మ్యాచ్‌లోనూ కొనసాగవచ్చు.

# 23నెలల గరిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

## ఆహారోత్పత్తుల ధరల పెరుగుదలతో 5.54 శాతానికి చేరిక



**న్యూఢిల్లీ, అక్టోబరు 12:** రిటైల్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో గణనీయంగా పెరిగి 5.54 శాతానికి చేరుకుంది. దీంతో గత 23 నెలల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ మోస్పి సోమవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. సెప్టెంబర్‌లో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 5.58 శాతంగా ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేయగా, వాస్తవంగా అది 5.54 శాతంగా నమోదైంది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో వరుసగా నాలుగో నెల కూడా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన లక్ష్యాన్ని ద్రవ్యోల్బణం అధిగమించింది. వినియోగదారులపై ధరల భారం పెరుగుతుండగా, ఆహార ద్రవ్యోల్బణం ప్రధాన కారణంగా నిలిచింది. సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం పెరగడానికి ఆహార ధరలే ప్రధాన కారణమయ్యాయి. వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆగస్టులో 5.97 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 7.74 శాతానికి పెరిగింది. ఆహారం, పానీయాల విభాగంలో ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.66 శాతం నుంచి సెప్టెంబర్‌లో 7.36 శాతానికి చేరుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.97 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 6.08 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 4.31 శాతం నుంచి 4.88 శాతానికి చేరుకుంది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ధరల పెరుగుదల అధికంగా ఉండటం గమనార్హం. దుస్తులు, పాదరక్షల విభాగంలో సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం 3.93 శాతంగా నమోదైంది. గృహనిర్మాణం, యుటిలిటీస్ విభాగంలో ఇది 2.74 శాతంగా ఉంది. పాన్, పొగాకు, మత్తు పదార్థాల విభాగంలో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా నమోదైంది. వ్యక్తిగత సంరక్షణ, ఇతర సేవల విభాగంలో ద్రవ్యోల్బణం ఆగస్టులో 15.17 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 13.75 శాతానికి తగ్గింది. రెస్టారెంట్లు, వసతి సేవల విభాగంలో ద్రవ్యోల్బణం 9.36 శాతానికి పెరిగింది. విద్యా సేవల విభాగంలో ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.73 శాతంగా ఉండగా, సెప్టెంబర్‌లో 3.94 శాతానికి చేరుకుంది. వినోదం, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల విభాగంలో ఇది 2.16 శాతంగా నమోదైంది. సమాచార, కమ్యూనికేషన్ విభాగంలో ద్రవ్యోల్బణం 2.44 శాతంగా ఉంది. ఆరోగ్య సేవల విభాగంలో నెలవారీ ప్రాతిపదికన స్వల్ప పెరుగుదల నమోదై, ద్రవ్యోల్బణం 1.4 శాతానికి చేరుకుంది. గృహోపకరణాలు, ఫర్నిషింగ్స్ విభాగంలో ద్రవ్యోల్బణం 3.11 శాతంగా నమోదైంది. ఆహార ధరల పెరుగుదలతో రిటైల్ ద్రవ్యోల్బణం మరింత వేగం పుంజుకోవడం సామాన్య వినియోగదారులపై ధరల భారాన్ని పెంచుతోంది. రాబోయే నెలల్లో ఆహార ధరల కదలికలు ద్రవ్యోల్బణ ధోరణిని ప్రభావితం చేసే కీలక అంశంగా నిలవనున్నాయి.

# ఆటోమొబైల్ సేల్స్ 'బాలెనో' టాప్‌గేర్..!



**ముంబయి, అక్టోబరు 12:** దేశీయ కార్ల మార్కెట్లో మారుతి సుజుకి బాలెనో దూసుకెళ్లింది. 2026 సెప్టెంబరులో దేశంలోనే అత్యధికంగా అమ్ముడైన ప్యాసింజర్ కారుగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఏకంగా 93 శాతం వృద్ధిని నమోదు చేసింది. టాటా నెక్సాన్, పంచ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టాప్10 కార్ల జాబితాలో మారుతి సుజుకికి చెందిన ఆరు మోడళ్లు చోటు దక్కించుకున్నాయి. మారుతి సుజుకి బాలెనో 25,392 యూనిట్లను డీలర్లకు పంపించింది. గత ఏడాది ఇదే నెలలో 13,173 యూనిట్లు మాత్రమే నమోదయ్యాయి. వార్షిక ప్రాతి పదికన 93 శాతం వృద్ధి సాధించింది. టాప్ 10 కార్లలో ఇదే అత్యధిక వృద్ధి కావడం విశేషం. టాటా నెక్సాన్ 20,456 యూనిట్లతో రెండో స్థానంలో నిలిచింది. గత ఏడాది ఇదేకాలంలో నమోదైన 22,573 యూనిట్లతో పోలిస్తే అమ్మకాలు 9 శాతం తగ్గాయి. టాటా పంచ్ 20,333 యూనిట్లతో మూడో స్థానాన్ని దక్కించుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈ మోడల్ అమ్మకాలు 28 శాతం పెరిగాయి. టాప్10 జాబితాలో బాలెనో, ఫ్రాంక్స్, వ్యాగనార్, డిజైర్, స్విఫ్ట్, ఎర్టిగా సహా మారుతి సుజుకీకి చెందిన ఆరు మోడళ్లు ఉన్నాయి. ఫ్రాంక్స్ 19,282 యూనిట్లతో 40 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఎర్టిగా 16,911 యూనిట్ల అమ్మకాలతో అదే స్థాయిలో వృద్ధిని కనబరిచింది. టాటా నెక్సాన్, పంచ్ కలిపి 40,789 యూనిట్లను నమోదు చేశాయి. కాంపాక్ట్ ఎస్‌యూవీలకు మార్కెట్లో ఉన్న ఆదరణను ఈ డేతా చెపుతోంది. మరోవైపు హ్యాచ్‌బ్యాక్ కార్లకూ డిమాండ్ తగ్గలేదు. బాలెనో, వ్యాగనార్, స్విఫ్ట్ కలిపి 61 వేలకుపైగా యూనిట్లను నమోదు చేశాయి. టాప్10 జాబితాలో హ్యుందాయ్ క్రెటా ఏడో స్థానంలో నిలిచింది. ఈ మోడల్ 17,657 యూనిట్లను నమోదు చేసింది. మహీంద్రా స్కార్పియో 17,313 యూనిట్లతో తొమ్మిదో స్థానాన్ని దక్కించుకుంది.

# ఆర్బీఐ ఎంట్రీతో రూపాయి క్షీణతకు కట్టడి



**ముంబయి,అక్టోబరు 12:** రూపాయి క్షీణత కట్టడికి ఆర్‌బిఐ తీసుకున్న చర్యలు వెంటనే సానుకూల ఫలితాలనిచ్చాయి. ఫారెక్స్ మార్కెట్ ప్రారంభంలోనే అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఒకశాతానికి పైగా లాభపడి 95.76 వద్ద ట్రేడింగ్ మొద లుపెట్టింది. ఆఫ్‌షోర్ మార్కెట్లోనూ రూపాయి బలంగా పుంజుకుంది. 2013 తర్వాత రూపాయిని నిలబెట్టేందుకు ఆర్బీఐ తీసుకున్న అత్యంత కఠి నమైన చర్యల్లో ఇవి కూడా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రూ పాయి మారకం విలువ రికార్డు స్థాయి కనిష్ఠమైన 97కు చేరువవు తుండటంతో ఆర్బీఐ రంగంలోకి దిగింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థల డాలర్ అవసరాలను తీర్చడం కోసం ఒక ప్రత్యేక విండోను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపింది. దీంతో పాటు ఫారెక్స్ డెరివేటివ్ లావాదేవీలపై కొత్త రిజర్వ్ నిబంధనను కూడా ప్రవేశపెట్టింది. అంతకుముందు గత బుధవారం వడ్డీ రేట్లను పెంచిన ఆర్బీఐ, అవసరమైతే మరిన్ని కఠిన నిర్ణయాలు తీసు కుంటామని సంకేతాలిచ్చింది. అక్టోబర్ ఆరంభంలో కూడా ఆర్బీఐ కొన్ని నియంత్రణ చర్యలు తీసుకుంది. అన్‌హెడ్జ్‌డ్ ఫారెక్స్ డెరివేటివ్ లావాదేవీల పరిమితిని 100 మిలియన్ డాలర్ల నుంచి 5 మిలియన్ డాలర్లకు భారీగా తగ్గించింది. దీంతో పాటు కొత్తగా ఫారెన్ ఎక్స్ఛేంజ్ రిస్క్ రిజర్వ్ (ఎఫ్‌ఈఆ ర్‌ఆర్) విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద 2 మిలియన్ డాలర్లకు మించిన ఫారెక్స్ డెరివే టివ్ కాంట్రాక్టులపై, కాంట్రాక్ట్ విలువలో 20 మొత్తాన్ని నగదు రూపంలో ఆర్‌బీఐ వద్ద రిజర్వ్‌గా ఉంచాలని అధీకృత డీలర్లను ఆదేశించింది. రద్దు చేసిన డెరివేటివ్ కాంట్రాక్టులను మళ్లీ రీబుక్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. మెచ్యూరిటీ సమయంలో కాంట్రాక్టులను రోలోవర్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ వరు సగా ఇన్ని చర్యలు తీసుకోవలసి రావడం, పరిస్థితి తీవ్రతను సూచిస్తోందని సోషియేట్ జనరల్ సంస్థకు చెందిన ఎమర్జింగ్ ఆసియా స్ట్రాటజిస్ట్ గాల్విన్ చియా అంచనావేసారు.

# ద్రవ్యోల్బణ డేటాపై ఇన్వెస్టర్ల ఫోకస్..

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబయి,అక్టోబరు 12:** దేశంలో సెప్టెంబర్ నెల ద్రవ్యోల్బణ గణాంకాల విడుదలకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం, భారత బాండ్ రాబడులు గణనీయంగా పెరగడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. రష్యా ఉక్రెయిన్ మధ్య భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గ వచ్చన్న ఆశలతో చమురు ధరలు కొంత వెనక్కి తగ్గినప్పటికీ, బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 105 డాలర్ల పైనే కొనసాగింది. దీంతో దిగుమతి ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలు, రూపాయి విలువపై ఒత్తిడి వంటి అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఇటీవల తీసుకున్న ద్రవ్య విధాన కఠిన చర్యలు మార్కెట్లో నగదు లభ్యత, రుణ వ్యయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న అంశాన్ని కూడా ఇన్వెస్టర్లు పరిశీలించారు. బీఎస్ఈ సెన్సెక్స్ 547.65 పాయింట్లు తగ్గి 71,924.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 157.10 పాయింట్లు క్షీణించి 22,363.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీ పతనానికి ప్రధానంగా లార్సెన్ అండ్ టూబ్రో (2.05 శాతం), భారతి ఎయిర్‌టెల్ (1.46 శాతం), ఐసీఐసీఐ బ్యాంక్ (1.11 శాతం) షేర్లు ప్రతికూలంగా దోహదపడ్డాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.13 శాతం పెరగగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.08 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఆటోమొబైల్, రియల్టీ షేర్లు లాభాల్లో పయనించగా, ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈలో మొత్తం 2,295 షేర్లు లాభపడగా, 1,909 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 239 షేర్లలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిసినప్పటికీ, కమోడిటీ మార్కెట్లో డిసెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ధర 88 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 105.60 డాలర్లకు చేరింది. భారతదేశ 10 ఏళ్ల





బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 7.302 శాతం నుంచి 7.388 శాతానికి పెరిగింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు కొనసాగాయి. అందించిన మార్కెట్ గణాంకాల ప్రకారం, రూపాయి విలువ 95.7800 స్థాయిలో ఉండగా, గత సెషన్ ముగింపు విలువ 96.7100గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో 2026 డిసెంబర్ 4 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 1.05శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,49,910కు చేరింది. అమెరికా 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.23 శాతం పెరిగి 5.256 శాతానికి చేరింది. ఇక వివిధ షేర్లపరంగాచూస్తే హెచ్‌సీఎల్ టెక్నాలజీస్: 0.52 శాతం లాభపడింది. అవెన్యూ సూపర్‌మార్ట్స్ (డీమార్ట్): 4.32 శాతం పడిపోయింది. టెక్ మహీంద్రా: 2.85 శాతం క్షీణించింది. పీటీసీ ఇండస్ట్రీస్ అక్టోబర్ 9న జరిగిన సమావేశంలో షేర్ల కేటాయింపునకు సంబంధించిన ప్రకటన నేపథ్యంలో 5.34 శాతం ఎగబాకింది. స్వరాజ్ ఇంజిన్స్ 9.24 శాతం పెరిగింది. ఏరోఫ్లెక్స్ ఇండస్ట్రీస్ 10.09 శాతం దూసుకెళ్లింది. రాజేష్ పవర్ సర్వీసెస్ 4.44 శాతం లాభపడింది. సియారామ్ రీసైక్లింగ్ ఇండస్ట్రీస్ 1.28 శాతం పెరిగింది. వాటర్‌వేస్ లీజర్ టూరిజం 4.17 శాతం ఎగసింది. సెప్టెంబర్ నెల ద్రవ్యోల్బణ గణాంకాలు, ముడి చమురు ధరల కదలికలు, బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు, రూపాయి పనితీరు రానున్న ఈక్విటీ సెషన్లలో దేశీయ స్టాక్ మార్కెట్ల దిశను ప్రభావితం చేసే కీలక అంశాలుగా నిలవనున్నాయి.

# సరికొత్త గరిష్టాలకు సిప్ పెట్టుబడులు..

## ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోనూ భారీ వృద్ధి

**ముంబయి, అక్టోబరు 12:** దేశంలో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చే నెలవారీ పెట్టుబడులు సెప్టెంబర్‌లో సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని నమోదు చేశాయి. ఆగస్టులో రూ.32,297 కోట్లుగా ఉన్నసిప్ పెట్టుబడులు సెప్టెంబర్‌లో రూ.32,490 కోట్లకు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా ఆంఫీ విడుదల చేసి న డేటాతో ఈ విషయం వెల్లడైంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు సెప్టెంబర్‌లో ఆశాజనకంగాపెరిగాయి. ఆగస్టులో రూ.29,328 కోట్లుగా ఉన్న పెట్టుబడులు సెప్టెంబర్‌లో రూ.38,307 కోట్లకు చేరాయి. అంటే నెలవారీ ప్రాతిపదికన చూస్తే సుమారు 30.6 శాతం వృద్ధి నమోదైంది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పథకాల నుంచి పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో నికరంగా భారీ పెట్టుబడుల ఉపసంహరణ నమోదైంది. మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ ఆగస్టులో రూ.87.08 లక్షల కోట్లుగా ఉండగా, సెప్టెంబర్‌లో రూ.82.64 లక్షల కోట్లకు తగ్గింది. సెప్టెంబర్‌లో స్మాల్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలోకి రూ.9,039 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆగస్టులో ఈ మొత్తం రూ.7,973 కోట్లుగా ఉంది. అదే సమయంలో మిడ్‌క్యాప్ ఫండ్లలో పెట్టుబడులు రూ.6,989 కోట్ల నుంచి రూ. 7,835 కోట్లకు పెరిగాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లు కూడా పెట్టుబడిదారులను ఆకర్షించాయి. ఆగస్టులో రూ.5,059కోట్లుగా ఉన్న పెట్టుబడులు సెప్టెంబర్‌లో రూ.6,702 కోట్లకు చేరాయి. సెక్టోరల్, థీమాటిక్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు సైతంరూ.1,713 కోట్ల నుంచి రూ.3,640 కోట్లకు పెరిగాయి. లార్జ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్లలోనూ సానుకూల మార్పు కనిపించింది.

# హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ క్యూ2లో 11శాతం పెరిగిన లాభం

## రూ.12 డివిడెండ్ ప్రకటించిన కంపెనీ

**ముంబయి,అ క్టోబరు 12:** ప్రముఖ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్‌టెక్ రెండో త్రైమాసికంలో మెరుగైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గత త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ నికర లాభం 11శాతం పెరిగి రూ.5,132 కోట్లకు చేరుకుంది. మార్కెట్ అంచనాలు రూ.4,875 కోట్లను అధిగమించింది. 2026 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలోని రెండో త్రైమాసికానికి సంబంధించి కంపెనీ ఈ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. అంతకుముందు ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో సంస్థ రూ.4,624కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 3.01 శాతం పెరిగి రూ.34,579 కోట్లనుంచి రూ.35,620 కోట్లకు చేరింది. మార్కెట్ నిపుణుల అంచనా రూ.35,547 కోట్లు. నికర లాభం రూ.4,624 కోట్ల నుంచి రూ.5,132 కోట్లకు పెరిగింది. మార్కెట్ అంచనా రూ.4,875 కోట్లు. ఎబిడిటా నిర్వహణకు సంబంధించిన లాభం 10.9శాతం పెరిగి రూ.6,465కోట్లకు చేరింది. 2026 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో హెచ్‌సీఎల్‌టెక్ కొత్తవ్యాపార ఒప్పందాలను సాధించింది. ఈ కాలంలో కొత్త ఒప్పందాల మొత్తం కాంట్రాక్ట్ విలువ 3.26 బిలియన్ డాలర్లుగా నమోదైంది. కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య సుమారు 2.3 లక్షలుగా ఉంది. ఈ త్రైమాసికంలో 6,450 మంది ఫ్రెషర్లను నియమించుకుంది. ఉద్యోగుల అట్రిషన్ రేటు 12.8 శాతంగా నమోదైంది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ఒక్కో షేరుకు రూ.12 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఈనెల 16 రికార్డు తేదీగా వెల్లడించింది ఈనెల 26 రికార్డు తేదీ నాటికి అర్హత కలిగిన వాటాదారులకు ఈ డివిడెండ్ చెల్లించనున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.